బ్రహ్మశ్రీ-వేదము-వేంకటరాయశాస్త్రి గారు.

శ్రీ

బొబ్బిలియుద్ధనాటకము.

"మహామహోపాధ్యాయ" "కళాప్రపూర్ణ" "సర్వతంత్ర స్వతంత్రే"త్యాది
అసంఖ్యాక బిరుద విరాజితులు
బ్రహ్మశ్రీ, వేదము - వేంకటరాయశాస్త్రిగారిచే
విరచితము.

7/69

రెండవకూర్పు.

ప్రకాశకులు.
తత్పౌత్రులు:
వేదము - వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్,
4, మల్లికేశ్వరగుడి సందు, లింగిశెట్టివీధి,
మన్నెడి. జి. టి. మదరాసు.

All Rights Reserved.

1934

[వెల రు. 1.

పప్పి పొన్నయ్యశెట్టిగారి
చంద్రికాముద్రాక్షరశాలయందు ముద్రితము.
చాకలపేట, మదరాసు.

శ్రీ వేదము ... ఆంధ్రభాషా ... HYDERABAD

శ్రీ

బొబ్బిలియుద్ధనాటకము.

విజ్ఞప్తి.

ఈ చిన్నిపొత్తమున—శీలసంరక్షణముకై కుసుమ సుకుమారముల నాత్మవపువుల నగ్నిసాత్కరించువారును నిజ సదాచార మహిమచేత శాపానుగ్రహ సామర్థ్యము కలవారును అగు నర్ధాంగలక్ష్ములచే విరాజిల్లుచు, నిజ బాహుపరాక్రమముచేత ఆసేతు వింధ్యాచలము జమీను తేర్పరించుకొని, మానముకై ప్రాణమును తృణముగా నొడ్డుచు, ప్రతాపరుద్రాది రాజాధిరాజాధిష్ఠిత హిందూరాజ్య సంస్థాపకులై క్షత్త్రధర్మౌదార్య వైదుష్యములచేత భీష్మ విక్రమ భోజులను మఱపించుచు, అనన్యవిషయమై పరమశివునియందే వర్తించు నీశ్వరశబ్దమువోలె దొరశబ్దము అనన్యకులనామసాధారణముగా తమకుల నామముతోనే సుఘటితమై వెలుఁగొందు ప్రాభవముగల వెలమదొరలలో ఉదాహరణభూతులైన బొబ్బిలి మహావీరుల పుణ్యచరిత్రము - కీర్తింపఁబడినది.

ఇక్కథకు ఆకరములు రెండు సులభములు. పెద్దాడ మల్లేశకవి పాటయు, రంగరాట్చరిత్ర మను పద్యకావ్యంబును. ఇందు రెండవది కావ్యమార్గమున మెఱుఁగెక్కియున్నను, రసనిష్యందంబున పాటకు ఈడు గాక యున్నది.

ఈముద్రణమున మూలగ్రంథము అచటనచట ఇంచించుక మార్పులంబొరసినది.

వేదము - వేంకటరాయశాస్త్రి.

పెద్దలకు విన్నపము

మాతాతగారి, బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారి, యీ నాటకమునకు ఇప్పటికి పదునెనిమిదేండ్లప్రాయము అయినది. శ్రీతాతగారు, దీనిని పలుమార్లు దమ శైక్షులచేఁ బ్రదర్శింపించుచు ఆయా ప్రదర్శనకాలములయందు తమ చిత్తమునకు రసము అందునట్లుగా మరల మరల అచటనచట మార్చుచు తుదకు యిపుడు గ్రంథము ముద్రితమైయుండు ఉత్కృష్ట స్వరూపమునకుం దెచ్చి పునర్ముద్రణోచితముం గావించియుండిరి. ఆయా సవరణలనెల్ల శ్రీతాతగారు కావించిన రీతినే యిందుగావించి ఈ ముద్రణమును నెఱవేర్చినాఁడను. బాలుఁడను అజ్ఞుఁడను నగు నాచేతిలో నేవేని పొరబాటు లుప్పతిలిన ప్రాజ్ఞులగు పెద్దలు వానిం దెలిపి అనుగ్రహింతురేని వానిని దిద్ది గ్రంథమును చక్కఁజేసికొందును.

1-ఆగస్టు-1934
ముత్యాలపేట, మదరాసు.

వేదము - వేంకటరాయుఁడు.

ఇందలి కథాసందర్భము.

గోలకొండ నైజాముగారు ఉత్తరసర్కారులలో జమీన్దారులవలన కప్పము తండు మని ఫ్రెంచివారి సేనాపతిని బుస్సీదొరను నియమించి, ఆతనికి అతని ఫ్రెంచి దండునకుఁ దోడుగా గొప్ప గోలకొండ సైన్యము నిచ్చి, హైదర్జంగు అనువానిని దివానుగా నేర్పరించినారు. వారు వచ్చి రాజమహేంద్రవరముకడ విడిసి ఉత్తరమందలి జమీన్దారులకు తెలిపినారు. వెంటనే విజయనగరము నేలు విజయరామరాజు బూసీ దర్శనమునకు వచ్చెను. బొబ్బిలి జమీనును హరింపవలయు నని ఎప్పుడును కోరుచుండు వాఁడు విజయరామరాజు గోలకొండవారి హర్కారాలకు లంచమిచ్చి వారు బొబ్బిలి రంగారాయనికై తెచ్చిన జాబును ఆయనకు చేరనీక ఆఁపివైచెను. అందువలన మొగలాయీల రాక తెలియక బొబ్బిలిదొర రాజమహేంద్రవరమునకు బూసీబేటికి రాలేదు. రాజు మొగలాయీల బేటికి రమ్మని రంగారాయనికి తాను జాబు పంపినట్లును, గర్వాంధుఁడై యాతఁడు రానియట్లును బుస్సీని నమ్మించి, ఆయహంకారము నడంచుటకై వారు బొబ్బిలిని కొట్టవలసినట్లును, రంగారాయఁడు నిరంతరము తనకు ఉపద్రవములు చేయుచుండుటవలన తాను తన పేష్కస్సును ఇయ్యలేక పోయి నట్లును ఇప్పుడు వారు ఆతనిం గొట్టి యాతని జమీనును తన కిత్తురేని రెండు జమీనుల పైకమును నిలువలతోఁగూడ సమస్తమును తానేకట్టునట్లును, వారి నొడంబఱిచెను. ఆ ప్రకారము నెఱవేర్చునందులకై బుస్సీకి తెలియనీయక లక్షవరహాలు హైదరుజంగునకు లంచము ఇయ్యనొప్పుకొనెను.

బొబ్బిలివారు ఈవృత్తాంతము నేమియు నెఱుఁగక 50 పెండిండ్ల మహోత్సవములో మునింగి యుండిరి. రాత్రి కోటలో ఊరేఁగింపు ముగియుచుండఁగా, తెల్లవాఱఁబోవుచుండఁగా, ఊరి బయట రాజును మొగలాయీలును ముట్టడి ముగించిరి. పగలు రాయబారములు. బూసీదూత వచ్చి రంగారాయని దర్శించి హైదర్జంగుమాటగా, తక్షణమే వీరు నౌబత్తును మాన్పవలసినట్లును, జాముసేపులో, కోట వెడలి పాలకొండకు పోవలసినట్లును తెలిపెను. వీరు అందులకు అంగీకరింపక బదులు రాయబారము పంపిరి, వీరి రాయబారిని హైదరు లోవగువారు తిరస్కరింపఁగా నాతఁడు అడ్డ మయినవారి నెల్ల తెగనఱకుకొని కోటకు వచ్చి తన పోక ఫలింప దాయెనని రాయనికిం జెప్పెను. అది మొదలు యుద్ధనిశ్చయము. బొబ్బిలివారి సన్నాహము. ఆరాత్రి 12 గంటలప్పుడు

కోటఁ గూల్చుటకు మొగలాయీల యారంభము. ఘోరయుద్ధము. కోమటి చెలఁపలు సయితము వైరులను బురు జెక్కనీయక పోరిరి. వెలమలు తెలగాలు బలిజెలు ఆయా బురుజులందు వైరులం జొరనీయక ప్రాణాంతము పోరాడిరి. పరాసులు ఈ బొబ్బిలి గడ్డలోని వీరుల పరాక్రమమునకు ఆశ్చర్యపడిరి, పలువురు మడిసిరి, అవశిష్టులు బురుజులం బట్టిరి.

ఈ సమయాన రంగారాయుని తమ్ముఁడు వెంగళరాయఁడు కోట వెలువడి మొగలాయీలతో పోరి మడిసెను. ఇంతలో నిట మొగలాయీలును కోటను పలు తావుల పడఁగొట్టిరి. వారు లోనజొత్తు రనియు, శేషించియున్న పురుషులు మడిసిన యనంతరము ఆ వైరులవలన తమకు మానరక్షకు లుండ రనియు, తలంచి, ఒక్కుమ్మడి వెలమదొరసానులు (పెండ్లికొమారితలును) తెలఁగాస్త్రీలు లోనగు ఘోషావర్ణముల మానవతులు వారి వరవుడులును కోటలోని యాఁడుఁబురుగెల్ల ఆబాలావృద్ధము పొడుచుకొని చచ్చిరి, తమ భర్తలచే నిహత లయిరి, చిచ్చుం జొచ్చిరి. కుమారులు తల్లులం జంపిరి, శిశువులను తండ్రులు కెడపిరి.

ఇట్లు గోహారయిన వెంటనే రంగారావు కోట వెలువడి మొగలాయి డేరాల మీఁదికి పోయి దుమికి, వీరలోకభయంకరముగా పోరి, జీవముతో వైరులకు పట్టువడక, సంధి కొడంబడక, అవయవములు ఆయుధహతులచే లుప్తములు కాఁగా కాఁగా సూర్యోదయ సమయమున వీరస్వర్గము నలంకరించెను.

ఈతనికుమారుని శిశువును చినవేంకటరాయని పినతల్లికడకు సామర్లకోటకు కొనిపోవుచు దాది యీ మొగలాయీలకు పట్టువడెను. బుస్సీదొర ఆశిశువును తగిన రక్షకపరివార మిచ్చి సామర్లకోటకు పంపెను.

ఈవృత్తాంత మెల్ల తెలియుడు రాజాము ఠాణాలో నున్న తాండ్ర పాపారాయఁడు రంగారాయని బావ, తనదివాను మిరియాలసీతన్నతోఁ గూడ, బొబ్బిలికి వచ్చి రాత్రి డేరాలో నిద్రితుని విజయరామరాజును నిద్ర లేపి, బొబ్బిలిరాణి మల్లమ్మదేవి పలికిన శాసముప్రకారము చిత్రవధ గావించి, తాను పొడుచుకొని చచ్చెను.

పిమ్మట సామర్లకోట సీలాద్రిరావు చినవేంకటరాయని నైజాముగారి దర్శనమునకుం గొనిపోయెను. ఈ లోపల ఉత్తరసర్కారులు ఇంగ్లీషువారి యేలుఁబడి లోనికి వచ్చినందున నైజాము వారిసిఫారసుచేతను ధర్మ్యమగుటచేతను మదరాసు గవర్నమెంటు వారు బొబ్బిలి సంస్థానమును చినవేంకటరాయని వారికి జమీనుగా నొసంగిరి.

ఈ నాటకమందలి పాత్రములు.

పురుషులు.

సూత్రధారుఁడు.

పారిపార్శ్వకుఁడు.

పూసపాటి విజయరామరాజు,
లేక, కళింగరాజు, లేక, రాజు. } విజయనగరము రాజు, క్షత్త్రియుఁడు.

౨ హర్కారాలు.

గుండాల అప్పన్న (పంతులు,) రాజుగారి కార్యస్థుఁడు.

౪ సామంతరాజులు—రాజుగారి సర్దారులు.

మంత్రి — ... మంత్రి.

బూసీ—గోలకొండ నైజాముగారి ఫ్రెంచి సేనానాయకుఁడు; ఈ రణము సర్వాధికారి.

హైదరుజంగు—బూసీకి దివాను.

౨౪ గోలకొండ సర్దారులు.

నీలాద్రిరాయఁడు—సామర్లకోట జమీన్దారు, పిఠాపురము దొర.

సుబ్బన్న
రామయ్య
భీమశంకరము
సోమన్న
పార్లు బ్రాహ్మణుఁడు
వెంకన్న } బొబ్బిలిలోఁ పెండ్లి సత్త్రభుక్కులు, భూరికి వచ్చినవారు.

౨ వేగులు—రంగారాయనింగారికి బయటి వృత్తాంతములు నివేదించువారు.

రంగారావు, లేక, రంగారాయనింగారు,
లేక, రంగారాయఁడు } బొబ్బిలి జమీన్దారుఁడు.

వెంగళరావు—రంగారాయని తమ్ముఁడు.

ప్రతీహారి—రంగారాయాస్థాన దౌవారికుఁడు.

వేదాంతి శాస్త్రి జోస్యుడు విద్యార్థి కవి మాంత్రికుఁడు	బొబ్బిలిలో పెద్దచెఱువు స్నానఘట్టమునకు వచ్చిన బ్రాహ్మణులు.

ధర్మారావు—రంగారాయని బావమఱఁది. ఆతని దివాను.

హసేనాలి—గోలకొండవారి రాయబారి.

రాయనివారి సభ్యులు.

రామయ్య—రాయనివారి కరణము.

వేంకటరంగారావు, లేక, చిన్న వేంకటరాయఁడు	రంగారాయుని కుమారుఁడు, బాలుఁడు.

౨ బొబ్బిలి దళవాయులు.

పడవాలు రామయ్య ముత్యాలపాపయ్య	బొబ్బిలి దళవాయులు.

అప్పఁడు సన్యాసి కుబ్జవాఁడు	బొబ్బిలి పౌరులు.

౪ పౌరులు.

౩ కోమటి చెలువలు.

దౌవారికుఁడు—బుస్సీ డేరాకడ కావలివాఁడు.

ముసేపనాల్—బొబ్బిలికోటను కొట్టిన సర్దారుఁడు.

౪ సర్దారులు.—బుస్సీక్రింద సేనాపతులు.

లాలి.—ఒక ఫ్రెంచిసర్దారుఁడు.

౪ నివేదకులు.—బుస్సీకి యుద్ధవృత్తాంతమును ఎప్పటి కప్పుడు వచ్చి చెప్పుచుండువారు.

కింకరుఁడు.—విజయ రామరాజుగారి సేవకుఁడు.

సేవకులు.—బుస్సీదొరగారి నౌకరులు.

చెలికాని వెంకయ్య.—రాయనింగారి బంధువు.

జక్కఁడు.—వెంగళరాయని పైనాతువాఁడు.

౧౦ పెండ్లికుమారులు.—వెలమదొరలు.
(బొబ్బిలివారి) నౌకరులు.
(గోలకొండవారి) నౌకరులు.
వెట్టినాయకుఁడు
౪ వెట్టివాండ్రు } బొబ్బిలివాండ్రు
చాటింపు వెట్టివాఁడు
తాండ్రపాపయ్య.—రంగారాయని బావ.
మిరియాలసీతన్న.—పాపయ్యకు దివాను.
(మొగలాయీ) దండు.
(మొగలాయీ) సిపాయి.
చల్లారాముఁడు.—విజయరామరాజుగారి పాదము లొత్తు సేవకుఁడు.
నైజాము.—గోలకొండ ప్రభువు.
బూస్సీ.—వారి వజీరు.

స్త్రీలు.

నటి.
బ్రాహ్మణి.—భూరికి సంతర్పణలకు వచ్చి నట్టిది.
చంటిపిల్ల.—బ్రాహ్మణి కూఁతురు.
మల్లమ్మదేవి.—బొబ్బిలిరాణి.
వేంకటలక్ష్మి.—బొబ్బిలివారి పెద్ద దాసి.
సుందరమ్మ.—రంగారాయని కూఁతురు. (ఒకపెండ్లి కూఁతురు)
౪౯ పెండ్లికూఁతులు.
అవ్వ.—బొబ్బిలిరాయనింగారి పౌరోహితునిభార్య.
కామాక్షి.—ఒకదాసి.
కమలాక్షి.— . . .
పేరఁటాండ్రు.—బొబ్బిలిలోని విప్రపురంధ్రులు.
౨౦ వేగు యువతులు.

శ్రీ

బొబ్బిలియుద్ధనాటకము.

శా. శ్రీనాథుం డిలకున్ భరం బుడుప నాజిం బెట్టుచున్, దాన, వీ
రానీకంబు లురఃక్షతాధ్వమున డాయన్ దూయ, నెవ్వాఁడు క
న్గో నాఁ డేనియప ట్టకో తితఁడు వాక్కొ్కనాఁగ, శర్వార్థి యా
భానుం డేనవజార్జి లోకపతి సర్వశ్రీయుతు న్జేయుతన్.

చం. కరమున శూలి, నెన్నుదుటికంటను గీలి, సిగన్ భపాలి, యం
బరమునఁ జూలి, భిక్షఁ గొను పాత్రమునం గకపాలి, మేన సుం
దరతమకాళి, భూషణగణంబున వ్యాళి, జడం బ్రియాళి, కం
ధరమున క్ష్వేళి,యై కరుణ సన్గను వేలుపు మిమ్ముఁ బ్రోచుతన్.

ఇఁక ప్రస్తావన.

నాంద్యంతమున

సూత్రధారుఁడు.—(ప్రవేశించి) మారిషా, త్వరగా రమ్ము.

పారిపార్శ్వకుఁడు.-(ప్రవేశించి) ఇదుగో వచ్చినాను బావా.

సూత్ర.—ఇప్పుడే ఈయార్యమిత్రులమ్రోల బొబ్బిలియుద్ధము నాడవలయును; నీవు పోయి పాత్రవర్గమును హెచ్చరింపుము.

పారి.—అబ్బబ్బ ! బొబ్బిలినాటక మంటే నాగుండెలు తల్లడిల్లి పాపొల్లు జల్లు మంటుంది బావా. మరొకనాటకం ఆడరాదా?

సూత్ర.—[పరిహాసముగా] అంతటి బంటవేని విజయరామరాజు వేసము వేసికోరా.

పారి.— [మొగము చిట్లించుకొనుచు] తాండ్రపాపయ్య వేసాన వొచ్చి 33 పోట్లు లెక్కపెట్టి పొడిచి చంపడానికా?

సూత్ర.— [పారిపార్శ్వకునిం బోనీక పట్టుకొని] కాదురా మూర్ఖా. మనకు కీర్తివలయునేని దానినే ఆడవలయును. ఏల యన?

ఆ. తప్పు లెల్ల నడఁచి యొప్పులు గురియించు
రంగరావుకీర్తి రంగమందుఁ,
బాప మడఁచి యిష్టఫలము లొనఁగఁ జేయు
పారిజాత పాదపంబు కరణి. ౧

పారి.— నా కక్కరలేదయ్యా. [స్వగతము] ఇందులో యేవేసం వొచ్చినా నాకు మధ్యలో డింకకొట్టేదిగానే వొస్తుంది.

[అని తటాలున విడిపించుకొని నిష్క్రమించును.

సూత్ర.— ఔరా, ఎంతమూర్ఖుఁడు! [కోపముగా నేపథ్యమువైపు చూచి] ఆర్యా, ఇటు రమ్ము; నీవు పూనుకొనక ఈపనిగాదు.

నటి [ప్రవేశించి]— కోప మెందులకు ఆర్యపుత్రా?

సూత్ర.— సీతమ్ముఁడు ఇపుడు అమాంతముగా నాపుట్టి ముంచినాఁడు. ఈయార్యమిశ్రులమ్రోల బొబ్బిలియుద్ధమునాడి మనవైరులకు చెంపపెట్టు వేయింపవలసియుండఁగా వేసమువేయక పరారి యైనాఁడు!

నటి.— వానితో నేమి ఆర్యపుత్రా? మీతమ్ములు లేరా; నేను లేనా? కోపము మాని ప్రకృత మానతిమ్ము. మన మాడవలసిన బొబ్బిలినాటకము ఎవరు కావించినది?

సూత్ర.— శ్రీమద్వేంకటగిరి సింహపీఠాధిష్ఠాతృ శ్రీ శ్రీరాజగోపాలకృష్ణయాచేంద్రమహారాజ నిరంతర బహూకృత శ్రీమద్వేదాన్వవాయ వేంకటరాయ శాస్త్రిగారు కావించినట్టిది.

నటి.— ఆదే?

సూత్ర.— ఆదే.

నటి.— బలే! బలారే! అది మనపాలిటి కల్పవృక్షము గదా! మఱి నే నరిగి పాత్ర వర్గమును సిద్ధపఱిచెదను. [అని పోనుంకించును.

సూత్ర.— పోకుము. ఈయార్యమిశ్రులు నీశరద్గీతమును వినుటకుం జెవులూరుచుం గనుపెట్టుకొని యున్నారు.

నటి.—అటయినఁ బాడెదను.

వచ్చెఁ జెలియ, యంచ లులియు వాసరంబులే
చెచ్చెర వికసిల్లు కల్వ శ్రీసరంబులే. వచ్చె ...

సూత్ర.—[స్వగతము] ఆహా! యేమి పాటరా దీనిది! ఈనాటకమువలన మరల నాకీర్తి పర్వి నావైరివర్గమునకు పెద్దలచేత చెంపకాయ లగును. నిశ్చయము. నిశ్చయము.

[నేపథ్యమున]

[భేరులు మ్రోఁగును, వీరకాహళములు మొరయును]

[వెండియు నేపథ్యమున]

హా ఆలాంటిచెంపపెట్లు మేము దప్ప మరెవ్వరూ యెప్పుడూ తిని వుండరు మహాప్రభో. వీరభద్రుడి చేత దక్షప్రజాపతి సమేతూ తినివుండడు!

[నటి విని ఆచ్చపడి యరయుచుండును.

సూత్ర,—[ఆచ్చపడి] ఏమి యీ విఘ్నము! [మరల భేరీకాహళములు మొరయును ఆలోచించుట నభినయించి]—వహావ్వా వహావ్వా! ఎంతమంచి యుపశ్రుతి! ఆ వాద్యధ్వానములవలె మనకీర్తి వ్యాపించి, ఆమొట్టవలె మనవైరులకు చెంపపెట్లగు నగుట! అవునుగాని ఈయడావుడియంతయు నేమి? [నిర్వర్ణించి] ఓహో యిపుడే మహా పరివారముతో విజయనగరాధీశ్వరులు మన్నెసుల్తాన్ బహద్దరు విజయరామరాజుగారు గోలకొండవారి సేనాపతి బుస్సీదొరగారి చేటికి, ఎదుట సానిమేళాలతోఁ గూడతరలి, ఈదారినే వచ్చుచున్నారు. ఆమొట్ట ఈగుంపులోనిదే కావలయు. ఈవఱదలో తగుల్కొనక తప్పించుకొనిపోవుదము రమ్ము.   [అని వడివడిగా నిష్క్రమింతురు.

ప్రస్తావన సమాప్తము.

ప్రథమాంకము.

స్థలకము:—కోటిలింగ రాజమహేంద్రవరముల నడుమ.

[విజయరామరాజు సచివసామంతాది మహాపరివారముతో యథానిర్దిష్టము ప్రవేశించును]

రాజు.—[స్వగతము] ఈమాఱు నాకు విజయము కలిగి నావిజయరామ నామము సార్థము కావలయును.

హర్కారాలు.—[రాజునెదుటికి చొచ్చి] ఏలినవారి హర్కారాలము మేము? మామొఱ్ఱ ఆలకించరేమి మహాప్రభో మాయేలినవాడా! ఆలాంటిచెంపపెట్లు(ఇత్యాది.)

రాజు.—[కని విని,] అప్పన్నా, ఏమి ఆదిలోనే యీ యపశకునము. ఎవరువీరు?

అప్పన్న:—[జనాంతికము] మహాప్రభూ, వీరు ఏలినవారి యానతిచేత [తన్ను నిర్దేశించుకొనుచు] ఈనౌకరుచేత తయ్యారయిన మనవేగులు. ఇటనుండి బొబ్బిలికి ప్రకాశముగా హర్కారాలుగా తరలి,విజయనగరము దాటఁగానే వేగులుగామాఱి, అచటి వృత్తాంత మెల్లం గని, మరల హర్కారాలుగా, ఇట మాఱి, ప్రవేశించినారు. వీరు బుస్సీయెదుట రాయనిమీఁది మన ప్రయోగమునకు మిక్కిలి సాధనభూతు లగువారు.

రాజు.—[జనాంతికము] బళి బళీ! అప్పన్నా? నీవోయి మమ్ముఁ గొలువ నేర్చినవాఁడవు! మంచిది, వీరియుద్దికం గనియెదఁగాక. [ప్రకాశము] ఎవరురా మీరు? ఏల మామ్రోల నిట్లు మొఱ యిడెదరు?

హర్కారాలు.—మహాప్రభూ, మేము ఏలినవారి జాబులు బొబ్బిలికి రంగారాయనింగారికి తీసుకొవెళ్లిన హర్కారాలమండి. మమ్మల్ని అక్కడ తన్ని చెంపకాయలు కొట్టి వెనకకి తగిలేసినారండి.

[రాజును అప్పన్నయు మొగమొగంబులు సూతురు.

రాజు.—[హర్కారాల నుద్దేశించి] ఏమిరా, మీరు జాబు వారికి ఇచ్చినారా లేదా?

హర్కా.—ఏలినవారిజాబు లని చెప్పఁగానే, వారి తమ్ములు వెంగళరావుగారు పెరుక్కొని చింపి పారేశి మమ్మల్ని నోరు తెరవనీక పీక పట్టుకొని తన్ని చెంపలు వాఖుంచి తగిలేశినారు మహాప్రభో.—''ఆలాంటిచెంపకాయలు'' ఇత్యాది.

రాజు.—[ఆత్మగతము] చక్కఁగానే తయ్యారు చేసినాఁడే అప్పన్న! [ప్రకాశము] హా! ఏమి దీమసము! ఏమి దీమసము! [అప్పన్నతో, జనాంతికము] మఱి పరాసులరాక అక్కడవారి కే మయిన తెలిసిన ట్లున్న దేమో కనుంగొనుము.

అప్పన్న.—[జనాంతికము] నే నప్పుడే విచారించితిని. తెలిసినజాడ లేదఁట మహాప్రభూ.

రాజు.—[స్వగతము] అది నాప్రయోగమునకు కర మనుకూలము. [అప్పన్నతో జనాంతికము] కోటలో పెండ్లిండ్లు ఎట్లున్నవో కనుఁగొంటివా?

అప్పన్న.—[జనాంతికము] ఏఁబది పెండిండ్లు జరుగనున్న వఁట.

రాజు.—[అప్పన్నతో జనాంతికము] తాండ్రపాపయ్య బొబ్బిలికివచ్చినాఁడా?

అప్పన్న.—[జనాంతికము] పాపయ్య పితూరీలు అణఁగఁగొట్టుటకు రాజాము లోనేయున్నాఁ డఁట.

రాజు.—[వికటముగా నటు నిటు పరిక్రమించుచు, ఆత్మగతము] బళీ, అక్క అకు వచ్చినవి రాజాముసీమలో నాచేయించిన పితూరీలు! పితూరీదార్లకు సాయముగా నేఁ బంచినరాణువ అక్కడ చాటున మాటున కావలసినంత యున్నది. కనుక ఆపితూరీలు రావణాసురుని తలకాయలే అగును. ఇతఁడు బొబ్బిలికి రాఁజాలఁడు. ఎట్టకేలకు వచ్చె నేని అంచెలమీఁద వచ్చి, ముడులు పడఁగానే, అంచెలమీఁదనే మరలును. [ఆలోచించి, హర్షముతో] వహవ్వా! బుస్సీజేటికి రంగారావు రామి నాకు దేవుఁడు ఇచ్చినవరము. నాకార్యసిద్ధికి ఇదియే బీజము. దుస్సీహైదరులను ఇతనిపైకి ఎసకొల్పుటకై నాచేసిన సంకల్పము నెఱవేఱినది! ఇతఁడు లేనందున నాయిచ్చవచ్చినట్లు వారి కడ నితనిని కొండెలు నఱకెద. ఎంత లంచ మైనను ఇచ్చి వారిచే ఈవెలమలను రూపు మాపించి, మా యానందరాజునకు బొబ్బిలి పట్టము గట్టించుకొనియెద. [మహోద్ధత్యముతో] నేను ఈబొబ్బిలిమీఁద

కాకుల గ్రద్దలఁ గాఱాడింప నేని కాను విజయరాముఁడ.
వీరబొబ్బిలిఁ గాల్చి పేరు మాప నేని— కాను ...
రావుపురువు నెల్ల గావు వెట్ట నేని— కాను ...
నీటుఁగోట పాటి బాట సేయ నేని— కాను ...
ఆముదాలు సల్లి యానందింప నేని— కాను ...
పొగతోఁట వేసి చుంపొగ పీలువ నేని— కాను ...
కోటను బులివేఁట కోన సేయ నేని— కాను ...
ఆనందు బొబ్బిలి కభిషేకింప నేని— కాను ...

వీరబొబ్బిలి యంట దీనిని తగులం బెట్టి నీబుబొబ్బిలి చేసెదను. [ప్రకాశము, సర్దారుల నుద్దేశించి] మాసర్దారులారా వైరిలక్ష్మీబందిగ్రాహకులారా, మన నాయ మును బొబ్బిలివారి నాయమునుం గంటిరా ?

సామంతరాజులు.—కనకేమి ? వారిదెప్పుడును పెడబుద్ధియే.

రాజు.—[అపవారించి] అప్పన్నా, నీవు నీయేలినవారిని కొలువనేస్తువేని, ఈ హర్కారాలను ఇంతకన్నను తీంద్రముగా సిద్ధపఱుపుము. బుస్సీ హైదరుజంగులను రంగారాయఁడు మిక్కిలి తిరస్కరించినట్లుగా ఈ హర్కారాలచేత ఆ యిద్దఱమ్రొ లను చెప్పింపవలయును. అవసరము కనుంగొని బూసియెదుటకి వీరిని నీవు కొనిరావల యును. ఈ ప్రయోగముచేత-

క. గండారు రంగరాయని
గుండానం ద్రోచి నీదు కుల నామంబుఁ
బండిత, సార్థము నేయుము,
గుండాల కులాబ్ధి యమృతగుండా, యప్పా.

అప్పన్న.—చిత్తము మహాప్రభూ.

రాజు —[చెవిలో] అప్పన్నా పెండ్లింండ్లమాటను చెప్పనీయకుమా.

అప్పన్న.—మహాప్రభూ, అదికూడ నాకుఁ జెప్పవలయుఁనా? [హర్కారాలను దఱిసి] రండోయి రండి. వారు చెంపకాయలిచ్చిన మనము వారికి చెంపపం డ్లిత్తము. వా రిచ్చినవే పండవా? మఱి వారివి వారికే ఇచ్చివేయుదము రండి.

[అని వారితో నిష్క్రమించును.

రాజు.—సర్దారులారా, బూసీ డేరాకు నడువుఁడు.

[అందఱును పరిక్రమింతురు.

రాజు.—ఇదె డేరాకడకు వచ్చితిమి. మంత్రిగారూ, మారాక వారికి తెలుప వలయును.

మంత్రి.—చిత్తము సర్కార్ నే నరిగి తెలిపెదను. [అని నేపథ్యమున కరిగి తానును హైదరుజంగును వెలికివచ్చి రాజుతో] వీరు హైదరుజంగుబహద్దరు గారు, బుస్సీగారికి దివాను.

హైదరు—సలాం మహారాజావార్కి.

రాజు.—సలాము హైదర్జంగుబహద్దరువారికి.

హైదరు.— మహారాజావారు మంత్రి సామంతుల్తో కూడా డేరా లోపలికి రావచ్చును. బూసీదొరగారు కచేహరిలో యున్నారు. [అందఱును పరిక్రమింతురు.

[అంతట బూసీ యథానిర్దిష్టముగా ప్రవేశించును.]

హైదరు.—వారే బూసీదొరగారు.

రాజు.—సలాము బూసీగారికి; సలాము వారిసర్దారులకు.

[బూసీప్రభృతులు లేతురు.

బూసీ—[టోపీ యెత్తి] సలాము మహారాగారికి.

సర్దారులు—సలాం మహారాజాగారికి.

సామంతులు—సలాము మూసాబూసీగారికిని వారిసర్దారులకు.

బూసీప్రభృతులు—సలాము మహారాజాగారిసర్దారులకు.

[రాజుకనుసన్నను పరివారజనులు బూసీ యెదుట నజరు లుంతురు; వానిని బూసీ పరికించును.]

హైదరు—మహరాజాగారు వారి సర్దార్లు అందరూ కూర్చుండవాలా.

[అందఱును కూర్చుందురు.

రాజు.—[బుస్సీతో] తమ సర్దారుల నామధేయ విక్రమాదికముల వినం గుతూహాలపడుచున్నాను.

బుస్సీ—మన్నె సుల్తానువారికి మన సర్దారులను తెలుపుము హైదరుజంగు బహద్దర్.

హైదరు—[ఒక్కొక్కరిని నిర్దేశించి చూపించుచు] వీరు సిద్దీబిలాల్, కల్బర్గీ కొట్టినవారు. వీరు మూసేపనాల్, మరాట్ భూములకి హతాహతం చేసినవారు. వీరు హసేక్ ఖాక్, ఆర్కాటికి కొట్టినవారు. మఱి వీరంతా ఏద్పుడితే అదీ కొట్టినవారు.

బూసీ.—మన్నెసుల్తానుగారి సర్దారులను ఒకరొకరినిగా మేము తెలిసికోవలయును. [రాజు మంత్రివైపు చూచును.

మంత్రి.—[ఒక్కొక్కరిని నిర్దేశించుచు] వీరు గోలగొండ యెఱ్ఱభూపతిగారు; వీరు కిమిడి నారాయణదేవగారు? వీరు అట్రగడ్డ హరిశ్చంద్రుడుగారు; వీరుమాడుగుల లింగారావుగారు; వీరు వంకమీసపు భూపతిరాజుగారు;

బుస్సీ.—మఱి మనము కూడినపని జరిగింతమా?

రాజు.—ఈపహరాలు దాటి తమ దర్శనము చేసికొనునప్పటికే మా పని మోడి యెత్తుట యైనది. ఇకను మాభాగ్య మెట్లున్నదో ? మా యేలినవారు గోల

కొండ పాదుషావారు మమ్ము బుస్సీదొరగారు హైదరుజంగుబహద్దరువారు యీరెండు కన్నులతో చూచుచున్నారు.

ఆ. చల్లచూడ్కి మీరు సాఁచిన మామీఁదఁ
బాదుసాహి మాకు భద్ర మొసఁగు.
వేఁడిచూడ్కి మీరు పెట్టిన మామీఁదఁ
బాదుసాహి మాకు భయ మొసంగు.

అ ట్లగుటంబట్టి;—

శా. అప్రత్యక్షునిఁ బాదుషాహరి నెదఁ ధ్యానించి, మీకుం దవీ
య ప్రత్యక్ష పరార్ధ్య మూర్తులకు మాయర్చల్ నుతుల్ భ
క్తిప్రానుగ్రహకాంక్షచే ముడుపులుఁ జెల్లించి, నిర్భీతి పూ
ర్వ ప్రాకామ్య వరంబు వేఁడెదను వీరవ్యాఘ్రులారా మిము

ఇచ్చట మాకు శుభసూచకములు కలిగిన నచ్చట మాకు శుభమే.

బుస్సీ.—మావలన నేమున్నది ? తమ భాగ్యమునకు గోలకొండ నిజాచిత్తము.

హైదరు —మేం వారి హుకుం సెరవేర్చే సౌఖర్లము. మాపని మీకీ తె వారికీకోపం.

పై కాము కట్టానీ పందాలకీ కర్కర్ నర్కి కుప్పల్ కూ
మాపనీ నర్కి కుప్పల్ కూల్చడం.
కళ్కళ్కల్లాడేటి గ్రామాల్కి పట్నాల్కి మల్మల్మ ల్మాడ్చెయ
మాపనీ మల్మల్మ ల్మాడ్చెయ్యడం.
కోటల్కి ఫీరంగీ యేటూలు దూటించి పాటీనేలల్ శెయ్య
మాపనీ పాటీనేలల్ శెయ్యడం.
దుర్గాలకీ పట్టి పుగ్గు లేక కొట్టి గిర్గిర్ దొర్లించడం-
మాపనీ గిర్గిర్ దొర్లించడం.
లూటీల్కితీస్కెల్లి యేకేట గోల్కొండ్లో కోశెత్తుపోగొం
మాపని కోశెత్తు పో గొయ్యడం.

ఖుస్రీ.—అది యుండుఁగాక; పాదుషాగారిచిత్తమునకు మీరే కర్తలు. వారి పేష్కషు సరిగా చెల్లుచుండిన, వారిచిత్తము మీరు కోరునట్లే యుండును. అట్లు జరుగనందున వారు మాకు పెట్టినపని యేమో హైదరుజంగు తమకు తెలుపనే తెలిసినాఁడు. మఱి తెచ్చినారా ఏడుసంవత్సరముల పైకమును?

రాజు.—తమరు అడిగినమాటకు ఉత్తరము ఇంచుకంత విస్తరముతో మనవి చేసెద. హైదరుజంగుగారు చెప్పినపని మావిషయమై తమరు పెట్టుకోవలసి యుండదు. అయినను చిత్తగింపవలయును. పింజారిదండుచేత మాదేశ మంతయు దోఁపుడు పోయినది. డెబ్బదిరెండు పాళెములలో నేమి; పండ్రెండు మన్నెములలో నేమి, ఎచ్చటను ఒక రాగిదమ్మిడీ అయినను కనులఁ జూచుటకు లేదు. దేశాంతరమునుండియేని తెప్పించి యొక మొత్తముగానో, అప్పుడు కొంత అప్పుడు కొంతగానో, చెల్లింత మన్నను—

సీ. నాగేంద్రుఁ డేలుచున్నాఁ డొకరుండు నా
  యండజమీను సహస్రఫణుఁడు;
నానాట నా పజ్జ నా ప్రజ మనసీఁడు,
  వానిఁ బట్టఁగలాఁడు వసుధ లేఁడు;
మఱి యాతఁడు వయ్యాళి మలయు మాసీమలఁ
  దద్విషాగ్నుల మింటఁ దగులుమంటఁ
బౌరులు కటకాన బ్రహ్మపురంబున
  రాజమహేంద్రవరమునఁ గాంత్రు.
తే. ధ్వానఁ జేసి బయటికొఠీదారులకడ
  నెట్టు వేఁడినను ఋణమ్ము పుట్ట దాయె;
భస్మపటలంబు లైన పరగణాల
  రైతు లేఁగిరి వలస లరణ్యములకు. ౮

గోదావరికి దక్షిణమందలి చిల్లర జమీనుల కప్పము లెల్ల క్షణములో మీకు చెల్లియుండఁగా, పైహేతువుచేత మాసంస్థానముది ఏడుసంవత్సరముల పైకము మీకు మునిఁగిపోయినది. ఇందులకై మాతో యుద్ధము పెట్టుకొందురేని, జనక్షయమే గాని పైకము రాదు.—మఱి.

(మత్తకోకిల)

మీకు లోఁగని మాసటీలను మేము కొట్టుట నేవయా;
మాకు లోఁగని వారి మీరును మట్టువెట్టుట బీరమా;
మీకుఁ జాగిన, వానినైకము మీరపోరి గ్రహింపుఁడీ;
యీకరాళిఁ దోలంచి మానతు లందుఁ దందుఁడు కప్పముల్.

అట్టిసాయము చేయుటకు మీరు సమకట్టరేని, కప్పము చెల్లింపుమని నిక్కచ్చి చేయుదు రేనియు, తత్సంస్థానము సెదిరించి పోరువారము గాము గావున, మీసంస్థానము మీకు వదలి, మేము కాశికిఁ బోఁదలంచుకొని యున్నాము మావిన్నప మిదియ. ఆటుపైని తమచిత్తము.

బుస్సీ.—ఏమి హైదరుజంగు? మహారాజుగారు ఇట్లు పలుకుచున్నారు?

హైదరు.—ఎవరు మహారాజా ఆనాగేంద్రుడు? మన్నెసుల్తాన్ వారి తాలూకాకే కొల్లగొట్టేవాడు, తగలబెట్టేవాడున్ను?

రాజు.—బొబ్బిలి రంగారాయఁడు.

బుస్సీ.—మీరు అతనితో సఖ్యమునకైన అతనిని దండించుటకైన, ప్రయత్నము చేసినారా?

రాజు.—చేసితిమి, ఏడుమాఱులు మేము అతని బొబ్బిలికి పోయి యుంటిమి.

బుస్సీ.—అంతట?

రాజు.—ఏడుమాఱులును జేటికి రాక మమ్ము బొబ్బిలినుండి విజయనగరము దాఁకను బాఱఁదోలినాఁడు. మేము పరారిచిత్తగించునపుడు, దిగఁద్రొక్కి వచ్చిన వట్టిపల్లకి మాకోట దర్వాజాకడకు తన బోయీలచేతఁ బంపినాఁడు. ఒక్కొక్కమాఱును మాయేనుఁగులను, లొట్టిపిట్టలను, గుఱ్ఱాలను, అనేకములను హరించినాఁడు.

సీ. *మామీఁద నతఁ డెంత మత్సరి యైనను,
విసువక సంధికై వెండి మేము
మారాజబాంధవు మాన్యునిఁ బంపంగ,
రాయఁ డాతనిఁ జేన రాటఁ గట్టి,

* పా. మామైత్రి నతఁడెంత మదిరోసియున్నను
విసువక సంధి గావింప వేడి,
మారాజబాంధవు మాన్యుని మేమంప,

మాపం డతనిప్రోల మాయించి, యాతని
మెడఁ గోసి, కననీక మేకుఁ జొనిపి,
దిసమొల గావించి, కసవుగోణం బిడి,
మోమున ఱొమ్మునఁ బొట్టమీఁద
తే. వీఁపునం బట్టెనామాలు వెట్టి, శవము
నందళంబునఁ గూర్చున్న యట్లు కట్టి,
విజయనగరంపు నడివీథి వింత లడరఁ
బగలె మాదేవిడీఁ జేర్పఁ బంపినాఁడు. ౧౦

ప్రకృతము వారి రాజామహేంద్రవరముమీఁదికి మేము దండు పంపినారము. మేము అటకు తరల నుండఁగా అచ్చటకి వారి దళవాయి తాండ్రపాపయ్య పోయినాఁ డని తెలియవచ్చినది. అంతట రాజాముదాడి మాని బొబ్బిలిమీఁదికే స్వయముగా తరల నుంటిమి. ఇంతలో మీకబురు రాఁగానే మీపేటికి వచ్చితిమి.

హైదరు.—తాండ్రపాపయ్యకి కోపం తమరు దాడీయెందుకి మానినార్?

రాజు.—తాండ్రపాపయ్య పేరు విన్న, వైరుల కెల్ల సింహస్వప్నము. అతఁడు చొచ్చెనా, యెదిరిదండు పులి చొచ్చిన గొఱ్ఱెలమందయే.

క. ఉండును రాయని నేనిక
భండనం దొడరువాఁడు; పాపయ్యను మా
ఱొండను నను వీరుఁ గానీ
దండును గానీ సృజింప ధాతయుఁ దలఁకేక. ౧౧

బుస్సీ.—ఏమి, మహారాజా, మీరు ఆతనిని పొగడువిధము చూడఁగా, మీసంస్థానమును ఆతనివలన బట్టుజాగీరుగా ననుభవించుచున్న ట్లున్నది గాని, గోలకొండవారి క్రింద జమీను ఏలునట్లు అగపడలేదే!

రాజు.—ఏల; త్వరలో మీకే తెలియును, చెంతకు వచ్చితిమి గదా?

హైదరు.—సరే గాని, రంగారాయడికి వేయి తలక్కాయలా యేమి? ఇతనేమి రాకాశిమన్నీడా? మన్నీ కాడా? మీ రావణాశురుడు వున్నాడే, రాముడి బీబీకి పకర్దేవు చేసినవాడు, వాడికి వాడితో గుణాకరించి, ఆవొచ్చిం దాన్కి, మళ్లీ వాడితో గుణించి, చేసినాడా మీ భ్రమాదేవుడు వాడ్కి?

బుస్సీ.—అతఁడు ఏల మాపేటికి రాలేదు?

రాజు.—నేనును హర్కారాలచేత జాబు పంపితిని. అతఁడేమో రాలేదు. అతఁడు మిమ్మును మమ్మును సరకు సేయువాఁడు కాఁడు.

[బుస్సీయు హైదరును మొగమొగంబులు చూచుకొందురు.

బుస్సీ.—మఱి మీ హర్కారాలు వచ్చి ఏమి చెప్పినారు?

రాజు —హర్కారాలు ఇఁకను రాలేదు. వారిని అతఁడు ఖూనీ చేయించినాఁడేమో యని మాకు భయముగా నున్నది.

దౌవారికుఁడు—(ప్రవేశించి) సలాం సర్కార్, దర్వాజాకాడ మహారాజావారి హర్కారాలు బొబ్బిలినుంచి వచ్చివున్నార్.

రాజు.—సంతోషము! సంతోషము!

హైదరు.—వహ్వా ! వహ్వా ! సమయానికి వచ్చినార్ ! రమ్మన్.

[దౌవారికుఁడు నిష్క్రమించును.

(అంతట హర్కారాలు ప్రవేశింతురు.)

హర్కా.—దండం దండం యేలినవారికి. అలాంటిచెంపపెట్లు మేము దప్పమఱెవ్వరును తినివుండరు. వీరభద్రుడిచేత దక్షప్రజాపతిసమేతా తినివుండడు మహాప్రభో.

రాజు.—మాజాబు రంగారాయనింగారి చేతికి ఇయ్యలేదా?

హర్కా.—వారి తమ్ములు వెంగళరాయనింగారు, విజయరామరాజుగారి జాబనగానే, మాచేతులలోనుంచి జాబు పెరుక్కొని, విజయనగరమువాడికి- [అనియర్ధోక్తిలో] మహాప్రభో, మన్నించాల, వారినోట వొచ్చినట్లే మానోటతోచ్చేసింది మహాప్రభో. [అని సాగిలఁబడి లేతురు.

రాజు.—అంతయు మన్ననయే, చెప్పుడు. వారినోట వచ్చినట్లే చెప్పుఁడు.

హర్కా— 'విజయనగరం వాడికి, మాకు జాబులు జవాబులు వున్నాయా' అని ఆజాబు చింపేశినారు. మఱి మేము గుండె నిబ్బరం చేసుకొని 'కాదు మహాప్రభో, పరాసు లొచ్చినారు, గోలకొండవారు లక్షాదబైభరాణవతో బూసీదొరగారిని, హైదరుజంగుగారిని, జమాబందికి పంపించినారు. అంత లేసి మరాటి ఖూములు హతముచేసిన ఆదొరలు రాజమహేంద్రవరంకాడ దండుదిగివున్నారు. మహారాజులుంగారు అక్కడికి వారిదేటికి వెళ్లితా తమరిని గూడ ఎదురుచూస్తావున్నారు. మునపటికోపాలు మఱిచి, యీసమయంలో దయచేసి రావలిశిందని తమరితో మనివి చెయ్యమన్నారు.' అనిచెప్పినాము,

బుస్సీ—హైదరు - రాజు.—తేర్వాత తర్వాత?

హర్కా.—తర్వాత రంగారాయనింగారు "ఏమిరా పరాసులూ, కరాసులూ, బూసులూ, పిసాసులూ, వచ్చినా రని మమ్మల్ని బెదిరిస్తా రంట్రా మీరు? ఇలాంటి బూసులకు మేము భయపడ మని చెప్పరా. ఇలాంటివి వొకటిగాదు వందలువందలు జంగుబిల్లులు మా అడివినిండా వున్నా యని చెప్పండ్రా. మరాటిభూములని కొట్టినా రంట్రా? కాదురా, బొబ్బిలిజ్వరానికి, మరాటిమొగ్గలు కషాయం పెట్టుకొన్నార్రా. వాళ్ల జేటికి మమ్మల్ని పిలవడానికి మీరాజుకూ బుద్ధి లేదు, మేము వొస్తామని తలవడానికి వాళ్లకీ బుద్ధిలేదు." అని కోపం చేసి పటపట పటపట పళ్లుకొఱికినారు మహాప్రభో.

హైదరు-బుస్సీ-రాజు.—[మొగమొగంబులు సూచుకొని] తర్వాత? తర్వాత?

హర్కా.—తర్వాత, మేము చేతులు జోడించుకొని 'మాయేలినవారికి ఏమి జవాబు మహాప్రభో' అని యడిగినాము. అంతట—'మేము మీవంటి పందలం గాము, మేము గోలకొండ నిజాముగారి కెదురు వెళ్తామేగాని, వారిసౌఖర్లకి, యెదురువెళ్లము, జరూ రుంటే, ఆసౌఖర్లు మా జేటికి రావొచ్చును; నిజాముగారి సౌఖర్లు గనక జేటీ యిస్తాము.' అని మేము శెలవిచ్చినామని మీరాజుతో చెప్పుకోండి.—అన్నారు. 'మహాప్రభో, ఏలినవారు ఆలాగ శెలవియ్యవలసిన సమయంగాదు. జేటికి వెళ్లకపోతే నానా చెరుపు వుంటుంది.' అని మేము మనివి చేసుకొన్నాము. "కబురుదెచ్చే జవాన్ గాడ్దలు మాకు బుద్ధులూ సుద్ధులూ చెప్తున్నారోయి." అని వారితమ్ములు వెంగళరాయనింగారు మమ్మల్ని చెంపలుగొట్టి తన్ని తగిలేశినారు, మహాప్రభో. ఆపైని యెకాయెకిని వొచ్చి యేలినవారిని ఇక్కడ కండ్లజూచినాము.

బుస్సీ.—వీరిని పొమ్మనుడు.

రాజు.—పొండిరా మీరు.

హర్కా.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమింతురు.

బుస్సీ.—మఱి మీ పైకమునకు ఏమిచెప్పెదరు?

రాజు.—ఇఁకమీఁద ఎన్నటికిని వారివలన మాకు ఉపద్రవము లేకుండునట్లు చేసితేనేగాని, మాకు డబ్బు పుట్టదు.

బుస్సీ.—ఏమి హైదరుజంగుబహద్దరు? మహారాజాగారు చెప్పినమాటకు ఏమి యుత్తరము? మనము ఇప్పుడు బొబ్బిలివారిని కొట్టి బాకీ వసూలుచేసికొని పోఁగలము గాని, జేపటికి వారు వీరిమీఁదికి రాకుండ మన మెట్లు చేయఁగలము?

హైదరు.—అందుకీకోపం వుపాయం యేమైనా తమరు ఆలోచించివున్నారా మహారాజా?

రాజు.—ఉపాయము సిద్ధమే; అయినను రాతిగోడలకే చెవులు గల వందురు, డేరాగుడ్డల మాట మఱి చెప్పవలయునా?

హైదరు.—అయితే యీలాగారండి. [అని రాజును అన్యులనుండి అవలికి తోడ్కొనిపోయి] ఇక్డ శెలవియ్యవచ్చును.

రాజు.—వినుఁడు మఱి; మీరు బొబ్బిలి కొట్టరేని మీకు బొబ్బిలిపైకము రాదు. కొట్టినను, సర్కారుపైకము సర్కారునకు దక్కును. మీకష్టము మీకు దక్కును. కావున, అట్లు గాక మీరు బొబ్బిలి కొట్టి బొబ్బిలివారికి పాలకొండమన్నెము నిచ్చి మాయన్నగారి కుమారుఁడు ఆనందగజపతికి బొబ్బిలిని పట్టము కట్టినయెడల బొబ్బిలిపైకము కూడ మేమే చెల్లించుట గాక, బుస్సీదొరకు తెలియనీక, మీకు లక్షవరహాలు కట్నము సమర్పించెదము. ఇట్లు మీరొనర్చిన, బొబ్బిలివారివలనియిడుమలు మాకుండవు; పైకము వసూలగుటకు మీకు ఏ చింతయు నుండదు. ఈసూక్ష్మమును మీరు అవధరింపవలయును. [హైదరు ఆలోచించుట నభినయించుచుండును.

రాజు— [స్వగతము] రంగారాయఁడు బ్రతికియున్నంతకాలము భూమిలో ఎంతదూరాన నున్నను మాకు రాజ్యభ్రంశంబు, ప్రాణాపాయమును, తప్పవు. ఈప్రయోగముచే రంగారావు మడియును. ఎట్లన, బొబ్బిలి వదలి పాలకొండ కేఁగ నతఁడు; ఒడంబడఁడు. దానంజేసి, పోరాటము తప్పదు. పోరాటములో పరాజయావమానము నొల్లఁడు ; అతనికి ఈపరాసులమీఁద జయ మసాధ్యము; కావున అతనికి రణమరణము నిశ్చితము. కాన, అతఁడు బ్రతికియుండి కాలాంతరమున మమ్ము బాధించునను భయము లేశ మయినను ఉండదు.

హైదరు.—[ఆలోచించుట నభినయించి] వహవ్వా! వహవ్వా! బాగాకుదిరింది. తమరు కోరినపని నేనుచేస్తాక్. నాకి లక్షవరాలకీ ఏమి జామీన్ ?

రాజు— మీరు మాపని నెఱవేర్చుటకు మాకేమి జామీను ?

హైదరు—[ఒరనుండి తరవారు దూసి] ఇద్గోయీ కైజారు జామీను.

మెచ్చీనారూ మాదీ మేహర్బానీకి చూచి ;
యిచ్చీనారూ మాకీ కైజార్.
యవ్రంటే ? గోల్కొండా యేలే పాచ్ఛాగారు,
యివ్రంగా మీకీ మేం చెప్తాం.
యిల్లిద్గో పాచ్ఛాహి యిచ్చిన కైజారు,
హల్లా సూస్తాడూ మేం అంటాం.

వీరబొబ్బిలి మీకుమార్ హానండానికి
    ఖరార్, ఖరార్, ఖరార్. ౧౧

రాజు.—[తనయుంగరఁ మొకటి చూపి]

సీ. ఢిల్లీశు నల్లా యుడీను రణస్తంభ
    పురినుండి హస్తినాపురము దాఁకఁ
బఱపి, యాసుల్తాను పగిడీని గొనివచ్చి
    పదపీఠమునఁ బెట్టి ప్రణతుఁ డైన
మాపూర్వునికిఁ జాహనూన హమ్మీర పృ
    థ్వీనాయకుఁడు తనవ్రేలినుండి
వ్రేలఁ బెట్టిన యంగురీయకం బిది, హరి
    యవతారములవెల్గు ; నందు నడిమి
తే. యింద్రనీలంపు శ్రీరామ చంద్రమూర్తి
    యెలుఁగ, బొబ్బిలి మాకు నీ విచ్చినంత,
లక్షవరహాలు నీకు వైళంబుగా వి
    రాళ మిత్తు ఖరారు, ఖరార్, ఖరారు. ౧౨

హైదరు.— మరి రాండి బుస్సీదొరగారికి తయారుచేద్దాం.

[అని ఇరువురును పోయి యథాస్థానముల కూర్చుందురు.

బుస్సీ.—ఏమి మంత్రాంగము?

హైదరు.— [బుస్సీతో అపవారించి] బొబ్బిలి కూడినట్టయితే ఈరాజాకి వర్తకులు అప్పుల్ యిస్తారంట. యేలాగయినా రంగారావుకి వైకంశోషరం కాక్పోతే మనమల్కి తుసాయించిన పొగర్ అణచడానికైనా మన్ము కొట్టవలిశిందే వుంది. అతను బేటికి రాక కారుకూతలు పలికినాడు. ఈరాజు మన్కి లోబడి బేటికివచ్చినవాడు. ఇతనికి పెద్దరాణ్యా వుంది. పదిరొండు మన్నె గాళ్లు డబ్బైరొండు పాళెగాళ్లు ఇతని కింద లడాయిచేస్తారు. పైగా ఇతడ్కి గొప్ప రాతికోటవుంది. ఇతణ్ని ఇక్డ పట్టినా, అంతటితో ఈపనితీరదు. ఇతనియన్నకొమారుడు ఆనందరాజు, విజయనగరంకోటలో హోయిగా వున్నాడు. అతడ్కి వేరే పట్టవాలా వుంటుంది. బొబ్బిలివారిది మట్టికోట, దానికి మట్టిలో కలపడం సులువు. ఇతనితో లడాయి పెట్టకుంటే మనకే జయం నిశ్చ

క్షంలేదు. ఈయనపైగా నిజాంగారికి, ఎక్వా మొహబత్తు చేసి ఎర్జీ వున్న జమీంకా దారుడు. ఇతనికి కొట్టడం వారికి సమ్మతం వుండదు. కన్క, ఈయన్ని మనపక్షం మే వుంచుకొని, ఇతడిసాయంతో బొబ్బిలికి కొట్టి, వెంటనే ఇత డియ్యవల్సిన పైకంకి వసూలుచేసికొని, శ్రీకాకుళం వెళ్లడం సరి యని నాకీ తోస్తుంది. మఱి ఇటుతర్వాత రంగారావు వల్ల ఇతడికి అపాయం తప్పించడముకి ఈయన చెప్పేది వుపాయం యేమ్టి అంటే—బొబ్బిలివారికి దూరాన పాలకొండసీమ ఇచ్చి, ఈయనకి బొబ్బిలి యిస్తే బొబ్బిలిపైకం కూడా తానే చెల్లిస్తా నంటాడు. అది సరి నాకీ తోస్తుంది. మఱి యితడిసాయం లేకప్పోతే మన్కా బొబ్బిలికి ఎక్వా మందికి మనసిపాయీలకి బలీ వెయ్యవాలా వుంటుంది. అటుపైని తమది చిత్తం.

బుస్సీ.—[అపవారించి] మీరు చెప్పిన దంతయు యుక్తియుక్తముగానే యున్నది. బొబ్బిలిని కొట్టుట యేమో సిద్ధమే; కాని ఒకరి భూములఁ దీసి ఒకరి కిచ్చుటకు మన కే మధికారము?

హైదరు—[స్వగతము] అబ్బ ! ఎక్కడికి వెళ్లినా యీఫరంగివాడితో ఇదే తంటా! [ప్రకాశము] కొట్టడాన్కి యేమీ అధికారమో భూములు మార్చడాన్కి అదే అధికారం. ఆలాగ చెయ్యకపోతే గోధారికి వుత్తరం పరగణాలన్ని మన్కా వొదులుకో వలిశిందే. ఈరాజున్ను ఆరావున్ను సఖ్యపడితే మన్కా యెనాక్కి తరలవలిశిందే. వీరిల్లో వీరికి కలతపడినందుకీచేత మనకీ అడుగు మోస్డానికి హావకాశం దొర్కింది. కన్క వీరిపగలు ఉన్నలాగే వుంచి, మనపని మనం నెరవేర్చుకోవాలా. బొబ్బిలి వీరికి యిచ్చి వారికి ధూరం తరిమితే, పగలు తీరవు, పైకం చెల్లుతుంది. నిజాంగారి ఖుద్దున మన్మఖజా నా రాశి పొయ్యవచ్చును. కన్క యీమార్పుకీ మన్మ వొప్పుక తప్పదని నాకీ నమ్మకం.

బుస్సీ.—మంచిది, మీరు ఈదేశమువారిని, మాకన్నఁ చక్కఁగా ఎఱిఁగినవారు; కావున మీరు చెప్పినట్లు ఒప్పుకొనియెదను.

హైదరు.—మహారాజా; మీరు చెప్పిన వుపాయాన్కి ధొరవారు వప్కన్నారు. తమరు కూడా బొబ్బిలిమీదికి మాతో రావాల.

రాజు.—సర్వసిద్ధము. మిక్కిలి సంతోషము. బూసీదొరవారికిని మీకును మిక్కిలి కృతజ్ఞుఁడను [ఆత్మగతము] ఆహా! యేమినాయదృష్టము! ఆహా! నాప్రక్క లోని బల్లెము ఊడినదిరా. బొబ్బిలిలో ఆవలి యెల్లుండి పగలు 50 పెండిండ్లు, రాత్రి యూరేఁగింపు. తాండ్రపాపయ్య రాఁడు. వచ్చినప్పటికిని వెంటనే రాజామునకు పోవును. ఆరాత్రి తెల్లవాఱునప్పటికి ముట్టడి పడిన, కరముజయకరముగా నుండును.

[ప్రకాశము] ఇంతకు పూర్వ మెప్పుడును మాకు జోస్యులు జయము చెప్పలేదు. ఈమాఱు అటావలి యెల్లుండి సూర్యోదయమునకు పూర్వమే బొబ్బిలివారి కెవ్వరికిం దెలియనీయక బొబ్బిలికి ముట్టడి వేయుదుమేని జయ మని మాజోస్యులు చెప్పినారు. అట్లు ఆతర్కితోపపతితముగా వారిమీఁదఁ బడుటకు, మీరు వలంతులేని నేను సాయము రాఁగలను. మనకు జయమని నిశ్చయము. విలంబము చేయఁదు రేని, మనకు జయము కలుగదు.

హైదరు.—ఆలాగే వెల్దాం, ఇందుకీ యోచన యెందుకి ?

రాజు.—మఱి మేము విజయనగరమునకు పోము. అందఱు నొక్కమొగిని రేయుం బవలు నడువవలయును ; మాతురుపులు దారి నడుపుదురు. మీరు త్వరగా ప్రయాణభేరులు కొట్టింపుఁడు. మఱి మాకు సెల వొసంగుఁడు.

బుస్సీ.—హైదరుసాహెబు, మహారాజాగారిని సాగ నంపి రమ్ము. సలాము మహారాజా. [అందఱును లేతురు. సలాములు మార్చుకొందురు. రాజు, రాజపరివారము, హైదరును, పరిక్రమింతురు.

బుస్సీ.—మనముపోయి మన పనులు చూచుకొనవచ్చును.

[బుస్సీ ప్రభృతులు నిష్క్రమింతురు]

రాజు.—మీరు చాల వ్యవహారసమర్థులు. పరంగివానిని క్షణములో ఒప్పించినారు. ఈ స్నేహమునకు బదులుగా, మాతాతగారికి ఢిల్లీసుల్తానుగా రిచ్చినది, రత్నాలు తాపిన యీ కైజారును, కమర్బందును, మీయొద్ద ఉండవలయును. మా ప్రక్కలోని బల్లెమును, కంటిలోని నలుసును, మీరు ఊడఁబెఱికిన వెంటనే, మేము ఒప్పుకొన్న పైకమును, పైగా మాకృతజ్ఞతను మీరే కందురు.

[నేపథ్యములో 'ఓంభాయి, ఓంభాయి.' అప్పన్న లోనుగా పరివారము, రాజును కలసికొనును.

రాజు.—[వినుట నభినయించి] అప్పన్నా, ఎవరిది ఆసవారి ?

అప్పన్న.—సామర్లకోట నీలాద్రిరాయనింగారిది.

రాజు.—పోయి, మేమిక్కడ నున్నా మని, వారు దర్శన మిప్పించిన సంతోషించెద మని, మర్యాదగా పలికి తోడ్కొనిరా. [అప్పన్న అట్లే చేయును.

రాజు.—ఓహో ; సంవత్సరకాలమునకు దర్శనము!

నీలాద్రి.—ఈదినము మాకు మహాపుణ్యదినము.

రాజు.—ఈరాక హైదరుజంగుగారి జమాబందికా ?

నీలాద్రి.—అవును.

3

రాజు.—మేము బొబ్బిలిమీఁదికి లడాయికి వెళ్లుచున్నారము. రాయనింగారు మాతో కలసికొందురా ?

నీలాద్రి.—

క. తోడల్లునిమీఁదికిఁ బో
రాడఁగ రమ్మనెదవె యుచితానుచితంబుల్
సూడవు, ముదుకవు, పండిన
మేడి ఫలంబవు, సువస్త్వమిత్త్రుఁడ, వెపుడున్. ౧౪

రాజు.—నీపాటియుచితజ్ఞత మాకు లేదందువా ? కానీ, బొబ్బిలి కొట్టి వచ్చి సామర్లకోటను దుమ్ముదుమారము చేసెదము.

నీలాద్రి.—

ఆయువుమీఁదను నాసలు గొంటే, నాలకింపు రాజా;
రాయనిమీఁదికి వెళ్లినవారికి రాక మ టెక్కడిది ?
నీటిబొట్టుకై వానకోయిల నిగిడి మొగులుఁ బొడువ;
మేటిపిడుగు భస్మీకరించుటే సాటి నీకు రాజా. ౧౫

రాజు.—[తెచ్చవడి ఆలోచించి స్వగతము] హా ! రంగారాయని శౌర్యమున నితని కెంత నమ్మకము! కానీ! ఇటు చెప్పి వంచించెదను. [మందహాసముతో, ప్రకాశము] రాయనింగారితో వేళాకోళముగా పలికితిమి. బొబ్బిలిమీఁదికి పోవుట గీవుట అంతయు వట్టిమాట సుమా!

నీలాద్రి.—కాక నిజమా? కాదని మా కప్పుడే తెలియును.

రాజు.—[హైదరుతో, అపవారించి] ఇతనికి బొబ్బిలి ముట్టడిమాట తెలియనీకుము. ఇతఁడే ప్రస్తావించినచో మామాట వట్టివేళాకోళ మని పలుఁకుము. సలాము.

హైదరు.—అది కూడాను మాకీ చెప్పవాలా ? సలాం. మా ఫిరంగియగాజే మేము తల్లినా మని మీకీ తెల్పుతుంది. [అని నీలాద్రిరాయనితో నిష్క్రమించును.

రాజు.—ఇతఁడిట నాకంటఁ బడుట మేలే అయినది. అప్పన్నా, మన దండును క్షణములో తరలింపుము.

అప్పన్న.—ఏలినవారి చిత్తము. [అని నిష్క్రమించును.

రాజు.—[పరిక్రమించుచు] అబ్బా ; ఊడినట్లేరా నా ప్రక్కలోని బల్లెము! వచ్చినట్లేరా నాకంటిలోని నలుసు! అయినను ఆదిలో అపశకునము. అంతములో ఈ

నీలాద్రిరాయని మాటయు అవశకునమే, కాని, అది నాప్రయోగమే. అయినను, తరలఁగానే వచ్చినది. [ఫిరంగియగాదు.

రాజు.—హా! [అని ఆశ్చర్యపడి] ఏమి యీ ఫిరంగి? అవశకునములే అని సిద్ధాంతము చేయుచున్నదా?

[నేపథ్యమున కలకలము వెంట.]

హడ్వీ హడ్వీగానే నడ్వీ యెల్లిందిగా, నడ్వీ యెల్లాంతాము మేమూ;
హడ్వీ వూరయితుంది, వూరుహడ్వయితుంది, మేమూనిల్చినా తాణా.
పడ్వా నడ్వయితుంది, నడ్వ పడ్వయితుంది, మేమూ దాటినా యేటా,
పడ్వా నడ్వా రెండు పామూవెడారిగానడ్వీ యెల్లాంతామూ మేమూ.

రాజు.—[చెవి యొగ్గి వినుచుండి] అప్పుడే సెంగఁలాయీ దండు కదలినదే! అబ్బా? ఏమి యీ తురకల దర్పము!

[నేపథ్యమున]

గోవిందా గోవిందా మాకు గొంతు గొయ్యకయ్యా.
రామా రామా మల్లీ యిల్లకి రానియ్యా వయ్యా.
కొండమీద కాత్రేడా నీకూ గండదీప మెడతాం;
ఆలుబిడ్డలకి మాకు ఆపతి అవల నెట్టవయ్యా. ౧౭

రాజు.—అరరే! బళీ; అప్పన్న మాదండును గూడ తరలించినాఁడే; ఇంక మేమును క్షణములో కదలెదము [అని నిష్క్రమించును.

(ప్రథమ ద్వితీయాంకముల నడుమ)

ప్రవేశకము

స్థలకము.—బొబ్బిలి రచ్చచావడి.

(పలువురు బ్రాహ్మణులును బ్రాహ్మణస్త్రీలును ప్రవేశింతురు.)

ఒక బ్రాహ్మణుడు.— ఒరే సుబ్బన్నా, ఈబొబ్బిలివారి భూరి సంభావనలో నీ కేమి దొరికిందిరా?

సుబ్బన్న.— నే నింకా లెక్కపెట్టుకోలేదురా, రామయ్యా. దోసెడు వరహాలు పోశారు నావాడిలో.

ఒక బ్రాహ్మణి.—[శిశువు నెత్తుకొని యుండి] ఇదుగోనండోయి మీకు మొగాళ్లకి దోసెడు వరహాలు ఇయ్యడం వొక ఆశ్చర్యమా ! మావంటి ముండాళ్లకి దోసెడు దోసెడు వరహాలు ఇచ్చాడు, ఆమహారాజెవరో ధర్మారావుట, రంగారాయనింగారి మామగారుట మా కియ్యడం ఏం విన్నారు! ఈ చంటిపిల్లకి ఒకదోసెడు.

రామయ్య.—చంటిపిల్లకి కూడా దోసెడే! [అని ఆశ్చర్యపడును.

బ్రాహ్మణి.—ఇందుకే ఆశ్చర్యమా? నాచెల్లెలికి ఒకదోసెడు వరహాలు ఇచ్చాడు. 'చాలాలండీ' అంటే- 'ఆ! అలాగా? యీగుంపులో పాపం చాలా శ్రమపడ్డది!' అని 'యిందాండి, అమ్మా, పుచ్చుకోండి, గర్భములోని శిశువుకోసం పుచ్చుకోండి;' అని బతిమాలుకొన్నట్టు కడుపులోపలిపిల్లకి ఒక దోసెడు ఇచ్చాడు మహారాజు. [తోడిస్త్రీలను ఉద్దేశించి] రండే గోపాలస్వామిగుళ్లో పడుకొందాము. [స్త్రీలు నిష్క్రమింతురు.

రామయ్య—ఔనుగాని, యీభోజనాలచేత నాపొట్ట పగిలిపోతూ వుందిరా! [దీనస్వరమున] ఏమోయి భీమశంకరం నీప నేలా గుంది?

భీమ.—నన్నా ? తిండికి పొట్ట పగలడ మేమిటిరా నాగమ్మా? ఆకాండికి నావీపు విరగొద్దుటరా, నాపృష్ఠపర్యంత భోజనానికి ? అలా అంటే తెలుసునా ? వీపుమీద గుద్దితే, క్రింద మెతుకులు పడాలి; మెడమీద కొడితే, నోట బూరెలు రాలాలి. నల్లీమనిషికి ఢోకా లేకుండా వుండాలి, భోజన మంటే. ఏమంటావోయి సోమయ్యా!

సోమయ్య.—అఘోరించావు లేవోయి! పృష్ఠాంతానికే యింత బడాయి అయితే నా నఖశిఖ పర్యంత భోజనాని కేమంటావు ? వత్తితే కాలిగోరు కూడ పప్పూ పప్పుళం కక్కాలి; ముక్కు నులిమితే పీశనెయ్యి జొత్తానా కొట్టాలి.

భీమ.—ఓయి సోమప్పా, నీనఖశిఖానికే యింత విజ్ఞపి గేమోయి? మా అన్న

భోంచేసిం తర్వాత జుట్టు మెలేస్తే, గంగాళం త్రప్పళం వస్తుంది. వొంటి చమట తుడిస్తే, మణుగు నెయ్యి అవుథుంది. పెదవి పిడిస్తే, బ్రిందెడు ప్రాయసం; నెత్తిమీద గ్రుద్దితే, రెంఘుముక్కులలోనుంచీ, దడదడ బూరెలు రాల్తాయి. క్షామదేవతలారా ! మీ దేం తిండిరా మా అన్నమందర?

సుబ్బన్న.—ఒరే ! ఆపంక్తిలో వాళ్లకంది ప్రీట లన్నీ ప్రగిలినవి ఎరుగుదువా? ప్రీటలు ప్రగులుథూవుంఛే, వెదురు నేసినఇల్లంచుకుంఛే, బొంగులకణుపులు కాలి ప్రగులఛూవుంఛే, ప్రటప్రటా, ప్రటప్రటా, అని యలాగ్గా అగాదో, అలాగ్గే అయిందిరా, చవులు గింగురు మని పోయినాయిరా?

రామయ్య.—మఱి అందుకే రెండువందలమంది వడ్రంగులు ఆపెద్ధ పెద్ధ అపధాన్ల గార్లకోసరం పీటలు మరమ్మత్తు చేస్తూ వున్నారు.

సుబ్బన్న—అది సరే గాని, ఆ శతబూరె సహస్రబూరె గాళ్ల పందిట్లో రెండువందలమందిని విస్తళ్లకాణ్ణుంచీ ఝుడ్డీపట్టి మోసుకొవెళ్లి చేతులు గడిగినారు, చూశావుషరా?

సోమన్న.—ఔనురా, కోటలో రాయనింగార్లకు పెళ్లిళ్లు. మనకి యిక్కడ నేలిపరదమూలంగా విస్తళ్లన్నీ యేకమై, ఒంటే బువ్వంబంతి అయిందిరా. పెద్ధపెద్ధ శాస్త్రుర్లవార్లంతా, తప్పులేదు తినమన్నారు. మేం, యెంగిలిమంగలంగా భోంచేశాం. వొకచేత్తో విస్తట్లు కొట్టుకొపోకుండా పట్టుకొని, వొకచేత్తో భోంచేశాం. అందరం యపరి విస్తట్లో వాళ్లమే భోంచేశా మని చెప్పలేము.

[అందఱు ఆశ్చర్యపడుచు నేపథ్యద్వారమువైపు చూతురు.

[అంతట ఒకబ్రాహ్మణుడు పొర్లుచు ప్రవేశించును.]

పొర్లు బ్రా.—[రొఁజుచుమూలుగుచు] హమ్మా ! హమ్మా !

ఇతరులు.—యేమయ్యా, దొర్లుథావు? యేడుస్తావు?

పొర్లు బ్రా.—[రొఁజుచు] ఖ ఖ ఖడుపునొప్పి !

సుబ్బన్న.—అయ్యా, నాదగ్గిర కడుపునొప్పికి మందు వుంది. యిందా, వొకమాత్ర మింగు, మింగు, త్వరగా మింగు. [అని ఒకమాత్ర తీసి యిచ్చును.

పొర్లు బ్రా.—మా-మా-మా-త్రకి స-స-సం-దుంఛే, మఱి రెండుభూ-భూ-భూ-రెలు తినసుషయ్యా

సుబ్బన్న.—ఓయి, నీయిల్లు బంగారంగానూ ! ఇదెక్కడి ఆబ ! భీమయ్యా, రామయ్యా, ఇతణ్ణి మోసుకొనివెళ్లి, మీ రిద్దఱు నిన్న యిలాంటివాణ్ణే ఒకణ్ణి వేడి వేడి అట్లు కడుపుమీద వెయ్యించి, లోపలినెయ్యి కరిగించి, కడుపు సళ్లించి, బ్రతికించాడే రాయనింగారి వైద్యుడు, అతడిదగ్గరికి పట్టండిరా; లేకపోతే, యితడిమూలంగా రాయనింగారికి బ్రహ్మహత్య వొస్తుందిరా !

రామయ్య, భీమయ్య.—ఔనురా ;

[అని బ్రాహ్మణుని ఝుడ్డిపట్టి మోచుకొని నిష్క్రమింతురు.

సుబ్బన్న.—[నిర్వర్ణించి] బూరెకు వరహా చొప్పున వెయ్యిన్నీ నూట పదహార్లు సంపాదించినాడే, ఓయి బాబో! ఆబకాసురుడు వెంకన్న వొస్తున్నాడు !

(అంతట వెంకన్న ప్రవేశించును.)

సుబ్బన్న.—వెంకన్నా, ఏమయ్యా, నీ వెయ్యిన్నీ నూట పదహార్లు మాకు రవంత చూపవయ్యా.

వెంకన్న.—అవి సాభోజనం మీద, కందాలు చెప్పిన కవికి, కందాలు చెప్పినవాడే కవిగదా, అని, ఇచ్చేశా.

అందఱు.—వహవ్వా!వహవ్వా! భోజనరాజవయినావే! ఏవయ్యా, ఆకందాలు? విందాం.

వెంకన్న.—వినండి మఱి:—

కం. వెంకన్న తిండి జూచిన,
నంకాళమ్మకును సైత మరగుండె వడుఁగా;
కొంకును బూరెలు మెక్కెడు
వెంకనకు జగములు మ్రింగు విశ్వాంతకుఁడుఁగా. ౧౭

అందఱు.—బళి బళి! ఇంకా మఱి;

వెంకన్న.—వినండి మఱి:—

కం. ఊటగల యావకాయలు
పూటకుఁ డెంకాయ బొండ్లములపాటివి నూ
ఱాటవు వెంకన్నకు నసి
పాటిత దధి గండ మిశ్ర భక్తంబునకుఁగా. ౧౮

అందఱు.—వహవ్వా! వహవ్వా! ఇంకా మఱి ;

వెంకన్న.—వినండి మఱి, దీనితోసరి.

కం. గారెలు బూరెలు వేనీ
నోరన్ నేఁ జూడ, నర్జునుఁడు సూడంగాఁ
బోర హరి విశ్వరూపపు
నోరుల నక్షౌహిణులు ఘనుల్ బలె వ్రాలున్. ౨౦

సుబ్బన్న—వెంకన్నా, పోగొట్టుకొన్నావు గదా యింత కష్టపడి తిని సంపాదించిన 1116 ట్లున్నా.

వెంకన్న.—రేపు మళ్ళీ తింటా. రోజూ తింటా. [అని కుడి రొమ్మప్పళించును.

అందఱు.—ఓర్నీ యిల్లు బంగారం గానూ! బకాసురుండవురా? [అని నవ్వుదురు.

[నేపథ్యమున ఘణీల్ ఘణీల్ ఘణీల్ మని ఘంటారవములు.

సుబ్బన్న.—[పరికించి] ఏం బరువులోయి, అవి? యేనుగలు, మోసుకొని కోటవైపు వెళ్లుతూ వున్నవి?

వెంకన్న—ఈరాత్రి వూరేగింపు కదా! అందుకోసం బాణసంచు చెన్నపట్టంలో చేయించి, విశాఖపట్టంరేవునుంచిన్ని, భీమునిపట్టంరేవునుంచిన్ని రప్పించారుష.

సుబ్బన్న—వహావ్వా! వహావ్వా! యీయుత్సవాలు ముగిశిందాక నేను యీవూరిఖ వదలనయ్యా. రాత్రంతా మేలుకొని వూరేగింపు చూలాం. అందుకోసం యిప్పుడే గోపాలస్వామి గుళ్లోకి వెళ్లి పడుకొండాం రండి.

ఇతరులు— అది మంచి పని. [అని అందఱును నిష్క్రమింతురు.

ద్వితీయాంకము.

స్థలకము:—బొబ్బిలికోట - అంతఃపురము.

[అంతట రాణియు పెండ్లికొమార్తలును దాసీజనమును ప్రవేశింతురు.]

రాణి.—[నిర్వర్ణించి] ఆహా! ఊరేఁగింపు మహాలుదర్వాజాకడకే వచ్చినది! ఓహో యెంతరమణీయముగా నున్నది! [పెండ్లికొమార్తలను ఉద్దేశించి] నాబంగారు కొండలారా, మీ రందఱు కిటికీలకడ నిలిచి కనులపండువు గావించుకొనుఁడు. (చిఱునవ్వుతో) మఱి మీరు వెలమకన్యలు, ఒక్కొక్కతయు తనభర్తను మాత్రమే చూడ వలయును.

కొందఱుకన్యలు—[చిఱునవ్వుతో] వెలమకన్యలకంటికి ఇతరులుఏల యగపడుదురు? ఇతరులకంటికి వా రేల యగపడుదురు?

[అని అందఱును పరిక్రమించి ఊరేఁగింపు చూచుట నభినయింతురు.

రాణి.—ఓసీ; వేంకటలక్ష్మీ, నీకు ఏలినవారు చదువులు చెప్పించి పెద్దదాసి యధికార మిచ్చినందులకు తగినట్లుగా ఈముద్దరాండ్రకు ఈయూరేఁగింపులోని విశేషములను వర్ణించి విశదపఱుపుము.

వేంకట—దేవిగారియానతి. మఱిచిత్తగింపుఁడు.

క. ఆకాశబాణము లవే
యాకాసంబునకు నెగసి, యమరులచెంతన్
రాకేందువులుగ, బాల ది
వాకరులుగఁ, బేలి, కలయఁ బర్వెడుఁ గనుఁడీ. ౨౧

మఱియు;—

శా. ఏయే వన్నె సులోచనం బిడుదుమో యీ చుట్టుపట్లప్పుడే
యాయావన్నెవిగాఁ గనంబడుఁ గదా; యామాత్రమే గాకివే
స్ఫాయద్వర్ణము లౌమతాబులు ప్రకాశం బొంద నాతేజులన్
త్స్నా యొల్లన్ స్ఫుటదృశ్యతావిభవమున్ గాంత్యుచ్ఛ్రియంబుం గనెన్.

పెండ్లికొమారితలు.—వేంకటలక్ష్మి మహాకవీశ్వరురాలుగా నున్నదే!

వేంకట.—మఱియు వినుండు:—

శా. ఊరేఁగింపుని కొన్ని యెట్టెదుట నచ్ఛోచ్ఛాంబరాదర్శబిం
బారూఢంబులొ, యుత్సవేక్షణముకై నాకంబె యేతెంచెనో,
నా, రంభోర్వసులన్ మహేంద్రసభ మందారంబు నింద్రాశ్వముల్
భూరిత్విడ్రథము నింద్రసింధురముఁ జూపున్ బాణసంచా యిటన్.

మఱియు,—

ఉ. బంగరువన్నెపాము లురువర్ష్మక్రమము లుర్వరనుండి లేచి, త
త్సంగముఁ బాయకే దివికిఁ జాఁగి, దిశాతతి మూయ, వాని దీ
ర్ఘాంగము లడ్డుగాఁ గడుపులం దుఱురేకులుఁ బద్దు వేకయై
బంగరుగాదెలో నడుగుఁబట్టినకైవడిఁ బోగిలు గ్రాలెడిన్. ౨౮

రాణి.—సరసురాలవే వేంకటలక్ష్మీ. గద్యరూపమున నించుక మాకు శ్రవణముల నమృతముం గురియింపుము.

వేంకట.—మహాలక్ష్మియాజ్ఞ.—చపలం జేలియాడు నీ దీపపుగుమ్మటములు కాగితంపులోనివలనం గల చిత్తరువులు బయలికి వెలుంగుచుండ, ఉత్సవ దిదృక్షు సౌవర మిథునాధిష్ఠిత విమానంబుల చందంబున నందగించుచున్నవి. సమలంకృతంబులును ఉపరి విస్తీర్ణోభయపార్శ్వలంబమాన రత్నకంబళవిరాజితంబులును వరాద్యధిష్ఠితంబులు నైన యీయేనుంగులు ఈవీథిపొడుగున మిన్నంటుచు నూరేఁగింపు నడచునొప్పిదము-మహాగిరులు సపక్షంబులు శ్రీరాయనింగారి ప్రాపున ఇంద్రుని సరకుసేయక సిద్ధవిద్యాధరాద్యధిష్టితంబులై జ్యోతిష్మత్యాది దేదీప్యమానంబులై యథేచ్ఛసంచార భాగ్యంబు ననుభవించుటయో నాఁ-గన్పట్టుచున్నది. [నేపథ్యమును బరికించి] మహాలక్ష్మీ, ఊరేఁగింపు మన నగరిదర్వాజాకడకే వచ్చి నిలిచియున్నది ; మేజువాణి జరుగుచున్నది.

పెండ్లికొమారితలు.—వేంకటలక్ష్మీ, ఆ మేజువాణీలోని పాట మాకు తెల్లము గాక యున్నది. దానిని నీవు యథోచితముగ అభినయ పూర్వకముగా ననువదించి మావీనులకు విందొనర్పుము

వేంకట.—దొరసానులయాజ్ఞ. చిత్తగింపుఁడు- ఈ గేయము నాయకుని మ్రోల విరహిణీదూత్యుక్తి. [అని యిట్లు పాడును.]

[గేయము]

బిత్తరి నీమీఁదఁ జిత్తమిడిన యాతత్తఱము వినరా !

నాసామి, ఆ తత్తఱ . . .

చిత్తజుని కాఁక హత్తి సొలసి సోలి, మిత్తిని దలపోసెరా!
నాసామి, ఆ మిత్తిని దల ...
"వల్లభు నిమది కల్లని యెఱుఁగక చెల్ల! కల్లనైతి నే!
ఓ చెల్ల! తాఁజెల్లఁ గల్ల ...
ఇంత కాలము నేను జింతించి నవి యెల్ల గొంతమ్మ కోర్కులఁ జేఁ?
ఓ చెల్ల! ఆ గొంతమ్మ కోర్కు ..."
సారసాక్షి యిట్లు *కేరుచు నే నిన్నుఁ గోరుచు నున్నదిరా!
నాసామి, నిఁక గోరుచు ...
మత్తచకోరాక్షి గుత్తంపు గాజులు గుత్తిగ రాలెనురా!
నాసామిగా గుత్తిగ రా ...
ఉంగరాలు కేల ముంగాము రాలైన సింగారిఁ గందువురా;
నాసామి, ఆ సింగారిఁ గం ...
వన్నెము త్తైసరాలు సున్నమ యినయా కన్నియఁ గందురారా
నాసామి, ఆకన్నియఁ గందు ...

[పిరంగి యగాదు. స్త్రీలు వాల్లకల్లోలపడుదురు. నేపథ్యమున] ఇదేమి తమ్ముఁడా కోటిబయటినుండి యెంత విపరీతపు ఫిరంగిమ్రోతఁ వినఁబడుచున్నది!

వేంకట [ఆలకించి నిర్వర్ణించి, రాణిని ఉద్దేశించి] అమ్మా, పిలినవారు వెంగళ రావుగారితో ఇక్కడికే వచ్చుచున్నారు.

[వేంకటలక్ష్మి తప్ప అందఱును నిష్క్రమింతురు.

[అంతట రంగారావును వేంగళరావు సంభ్రాంతులుగా ప్రవేశింతురు.]

రంగ.—

క. దిక్కులవియఁ బాతాళము
గ్రక్కదలఁగ గడ్డ గడ్డగా ఘూర్ణిల్లినా
యక్కుగవి సొచ్చి సరవిఁ
దక్కుఁడు తక్కుఁడయిమ్రోత తడవుగ డిందెఁ. ౨౬

వెంగళ.—ఇదేమో విపరీతముగా నున్నది.

* పా. దూరుచు.

రంగ.—వేంకటలక్ష్మీ, పన్నీరు తెమ్ము కన్నులు కడుగుకొనవలయును.

వేంకట.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

రంగ.—తమ్ముఁడా, ఈ డాబామీఁద చల్లగాలిలో కూర్చుందము.

[ఇద్దఱును ఆరోహణ మభినయించి పరిక్రమించి కూర్చుందురు.]

వేంకట.—[ప్రవేశించి] ఇదిగో పన్నీరు.

[అని పన్నీటి కూజాను రంగారాయనిచేతి కిచ్చును.

రంగ.—[కయికొని, చల్లుకొని, కడిగికొని, పన్నీటిగిండిని వేంకటలక్ష్మి చేతి కిచ్చి] వేంకటలక్ష్మీ, నీపని నీవు చూచుకొనుము.

వేంకట.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

రంగ.—ఏమి తమ్ముఁడా, ఈరాత్రి కర్పూరములు వేసినను అత్తరువులు పోసినను, కాగడాలు మసకమసకగానే మండినవి ?

వెంగళరావు.—అన్నయ్యగారూ, నిద్రలేమిచే మనకనులు మసక లైనందున అట్లగపడి యుండును.

రంగ.—కాదు తమ్ముఁడా ; జ్వాలలు రాత్రి యెల్ల చీలికలు చీలికలుగానే అగపడినవి.

[నేపథ్యమున నౌభత్తు వాయింపఁబడును.]

రంగ.—ఏమి తమ్ముఁడా, నేఁడు మననౌభత్తు రోదనమువలె వినఁబడుచున్నది !

[ఫిరంగియగాదు. ఇరువురును అడిచిపాటుతో శ్రవణ మభినయింతురు.

రంగ.—(ససంభ్రమము) ఇదేమి తమ్ముఁడా! ఊరిబయటనుండి వెండియు ఇట్టి ఫిరంగిమ్రోఁత వినఁబడుచున్నది ! తమ్ముఁడా, ఇది—

సీ. కల్పాంత కాలంపుఁ గాలిమొగు ల్లెల్ల
నొక్కుమ్మడిగఁ గూడి యుఱుముటొక్కొ ?
క్షయమున విశ్వంబుఁ గాల్చుకాలాంతకు
గళగహ్వరపు మహాగర్జయొక్కొ ?
కంబాననుండి రక్కసునిపైఁ బడు దంభ
హార్యత్తు ఘోరాట్టహాస మొక్కొ ?
బెడిదంపు బడబాగ్ని వెడఁదఫిరంగి యై
మొత్తంబుగా మ్రోఁత మ్రోయుటొక్కొ ?

తే. ఎత్తి వచ్చెనో కూళరా జిట్టిహదన ?
నింతటి ఫిరంగి యాతని కేడఁ జెపుమ ?
తమ్ముఁడా, రమ్ము మనమె బేతాళబురుజు
నెక్కి కనుఁగొంద మీవింత యేమొ యిపుడు. ౨౭

రా, తమ్ముఁడా, రా, బేతాళునిబురుజెక్కి ఇదేమో చూతము.

[అని బురు జెక్కుట నభినయింతురు.

వెంగ.—ఆహా ! ప్రొద్దు పొడుచుచున్నది ! చీఁకటి చెదరుచున్నది. [నలుగడలం బరికించి] అన్నయ్యగారూ, ముట్టడి ! ముట్టడి ! ఆ యేనుఁగు లేమి ! ఔరా ! ఆగుఱ్ఱము లేమి ! అబ్బా ! ఆ ఫిరంగుల బారు లేమి ! ఎన్ని డేరాలు ! ఎన్ని డేరాలు! ఎంత కొల్బలము ! దేవ అవధారు ?

సీ. వీరబొబ్బిలి యిదే పేరుపొందినలంక,
యీ రాణువే యకూపార మౌర !
కాల్బలంబులె యుదకంబులు, మేల్తురం
గంబులే ఘనతరంగంబు లౌర !
వాటంపుడేరాలె వట్టిమేఘంబులు ,
మత్తేభములె నీరుమబ్బు లౌర !
కడిఁది ఫిరంగులే కాలకూటంబులు,
సైదువులే భుజంగంబు లౌర !
తే. అవలిదరి లేదు, గణుతికి హద్దు లేదు,
కనము, విన, ముట్టిముట్టడి కలల నైన !
నెవరొ? పీ రేల వచ్చిరో ? యెఱుఁగవలయు ;
దిగుచునే యున్న దింక నల్దెసల దండు. ౨౮

రంగ.—[పరికించి]అవును తమ్ముఁడా ! ముట్టడియే ! ఇంతదండు విజయరామునికి లేదు. మఱి, మన కెవ్వరును పగవారు లేరు. వీ రెవ్వరు.

ప్రతీహారి.—[ప్రవేశించి] జయం జయం శ్రీరణరంగమల్ల బొబ్బిలిమహారాజ రంగరాయమహాప్రభువారికి. వేగులు వచ్చినారు.

రంగ.—వేగులకు నేఁడు తెలుపుడు లేకయే, ప్రవేశము కలిగింపుము.

ప్రతీ.—చిత్తము మహారాజ. [అని నిష్క్రమించును.

[అంతట రోజుచు వేగులు ప్రవేశింతురు.]

వేగులు.—మహాప్రభో, జయం జయం యేలినవారికి. విజయరామరాజుగారు బొబ్బిలిమీదికి పరాసులని తెచ్చి ముట్టడేయించినారు. లక్షా డబ్బైఛవేలు గోలకొండ దండు, 24 వేలు రాజు సిబ్బంది. లోపలిపురుగు బైటికి వెళ్లడానికి, బైటిపురుగు లోపలికి రావడానికి లేదు.

రంగ.—ఇంక నే మయిన మాట తెలియునా?

వేగులు.—మఱేమీ తెలియదు మహాప్రభో.

రంగ.—మఱి పొండి, మీపని చూచుకోండి. [వేగులు నిష్క్రమింతురు.

రంగ.—తమ్ముఁడా, నాయెడమబుజము పట్టుకొమ్ము, ఎట్లు త్రుళ్లి పడుచున్నదో చూడు.

వెంగ.—[పట్టుకొని పరికించి] అన్నయ్యగారూ! మన కిది శుభశకునము, విజయరామునికైన దుశ్శకునము. కావున మనకు వీరస్వర్గ మునకు ఇది సూచకము. ఇందుకై చింతింప నేల?

రంగ.—కాదు తమ్మయ్యా. ఇ దేమి నాగుంస్థలు కొట్టుధ్వని కోటతలుపును గొడ్డండ్లతో కొట్టినధ్వనివలె వినఁబడుచున్నది! నీకు వినఁబడుట లేదా?

వెంగ.—తమరు దిగులు పడుచున్నారే అన్నయ్యగారూ!

రంగ.—హా! ఈ సమయమున పాపయ్య లేకపోయెను గదా? తమ్ముఁడా, అతఁడు లేమి ప్రాణము లేమియే గదా!

వెంగ.—ఏమి అన్నయ్యగారూ! ఎన్నఁడు లేనిది తమరు ఈ దినము దిగులు పడుచున్నారు.

రంగ.—దిగులు గాకేమి తమ్ముఁడా! సమయ మట్టిదిగా నున్నది నాతమ్ముఁడా! మన మేమి-

శా. పారావారముఁ ద్రాగివైతుమొ? గిరివ్రాతంబు భక్షింతుమో?
తారెక్ బొబ్బిలి వీడి శ్రీ యిపుడు నిర్దాక్షిణ్య చిత్తంబునన్.

అయినను దిగు లనఁగా నేమి తమ్ముఁడా!

బీరం బేదుదుమో? దురాన నరికిన్ వెన్నిత్తుమో? నముద్రఁడా
వైరిం గావమొ? యెట్ట కే నొరులచేఁ బ్రాణంబు కోల్పోదుమో.—ఇన

వాస్తవస్థితి నరసికొంట తెల్వి గాని దిగులు గాదు తమ్ముఁడా! మఱి, మన మిక్కడ కాలహరణము చేసికొనఁ గూడదు. క్షణములో నామతీర్థము కానిచ్చి,

మంత్రాలోచన సభకు రమ్ము. తమ్ముఁడా నాచేరువకు రమ్ము. [అని రంగా కవుంగిలించి] వేపు ఉందుమో, ఉండమో ? ఒకతల్లికడుపునఁ బుట్టితిమి, ఒక్కటే మనస్సుగా ఆత్మగా బ్రతికితిమి. తమ్ముఁడా, ఎన్నఁడైన నీయుత్సాహములకు భంగము చేసియుంటినా? నావలన నీకే మయినం గొఱంత కలదా తమ్ముఁడా?

వెంగ.—ఏమి యన్నయ్యగారూ ! ఇట్లు పలికెదరు ! తమవలనను నాకు భంగమా ? తమవలన నాకు కొఱంతయా ? బాలుఁడ నైన నాదుండగములను, తప్పులను మన్నింపవలయును.

రంగ.—నీవంటి తమ్ముఁడు నాకుఁ బైపుట్టువునం గలుగునా ?

వెంగ.—నేనే మెఱుఁగుదును ? ఎట కైనను తమశుశ్రూషకు గాక నేను మాత్రము వెనుకఁ దగ్గుదునా ?

రంగ—రమ్ము తమ్ముఁడా, రమ్ము. (అని కవుంగిలించి, ముద్దుగొని) దైన్యమని తలంపకుము, వీరుల మయినను మనుష్యులమే గదా ?

[అంతట వేగులు వేగముగ ప్రవేశింతురు.]

వేగులు.—జయం జయం ఏలినవారికి ! మహాప్రభో, ఎదిరి దండులోని తలమానుసులని తెలుసుకొని వచ్చినాం, మహాప్రభో !

రంగ.—ఎవ రెవరు ?

వేగులు.—మహాప్రభో, ఒకడు విజయరామరాజు.

రంగ.—[స్వగతము] అతఁడు కూడ నొక తలమానిసి యఁట? ఈ చేంతకత్వలలోనే తలలేనిమానిసి అగును [ప్రకాశము] ఇతరులను చెప్పుఁడు.

వేగులు.—గోలకొండవారి యీఫౌజు కంతా మొనగాడు మూసా బూసీ అనే ఫరంగిదొర. వారి ఫిరంగీకి దొర్లని కోట యీదేశంలో లేదట. హైదరుజంగు సాయెబు అతనికి దివాను. సర్దార్లు మరాటి భూములు, కల్బర్గసంస్థానము, భువనగిరిసంస్థానము కొట్టిన ఖానులంట ఇంతేనండి యిప్పటికి తెలిసింది.

రంగ.—సరే పోయి రండి.

వేగులు.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమింతురు.

రంగ.—ఏడు మాఱులు ఇతనిని నేను జయించితిని. ఈ మాఱు నన్ను ఇతఁడు త్రొక్కివైచినాఁడు. గోలకొండవారికి నేను ఏమియు ఇతనికన్న అపరాధము చేయులేదు. పేష్కస్సు ఇతఁడును చెల్లింపనివాఁడే గదా ? వీరు ఇతనిని మాని నన్ను ముట్టడించుట చూడఁగా, ఇతఁ డేమో కుట్రచేసి వీరిని నామీఁదికి తెచ్చినాఁ డనుట నిశ్చయము. ఈరాజు సమయము వేచి నన్ను చిదుగఁ గొట్టినాఁడు. పెండిండ్ల సమయ మిది

తనకు మంచిసమయ మని ఆలోచించి, యిప్పుడు ముట్టడి తెచ్చినాఁడు. నిద్రలో సింగ మును పట్టినట్లు నన్ను తెలియనీయక పట్టినాఁడు. ఆహా! బయట వీరు ముట్టడి వైచు చుండఁగా లోపల ఊరేగింపులు ఉత్సవములు చేయుచుంటిమి. హా ! దైవ మతనికి ఇప్పటికి ఇంతమాత్రము అనుకూలించినది. కానీ యుద్ధమే జరుగనీ, ఈ పరాసులు నాపోటు నొకమాటు రుచిచూతురు గాక. కానీ! వీరిసంఖ్య హెచ్చయిననేమి?

వెంగ.— అన్న గారికి విన్నపము నే నుండఁగ తమరు పూనుకోనేల ? ఇప్పుడు తమసెల వైన-

వసుధ నిండినయీ ఫౌఁజుచీ కటికి నేఁ బట్టపగల నయ్యేద!
ఎడలేక పెరిఁగిన యీ దండు కాటికి నెరగలి నే నయ్యేద! [ద!
చలియింప కున్న యీ సైన్యమే ఘుములకు ఝుంఝూవా యున నయ్యే
అద్దరి లేని యీ యరిసేనాం భోధికి నగస్త్య ముని నయ్యేద?

సెల వీయవలయును.

రంగ.—నీ వుండఁగా నాకేమి పని తమ్ముఁడా ? కానీ, ఆగడియ రానీ. మఱి నీవు పోయి త్వరగా రమ్ము.

వెంగ.—అన్న గారి యాజ్ఞ. [అని నిష్క్రమించును.

రంగ.—హా ! ఇంతకాలమునకు నాచేతికి అటిన సమరము పొసఁగినది. విజ యరాముని గెల్చిన నేమి కీర్తి? నాపోటు ఢిల్లీగోలకొండలలో మాఱుసెలంగును గాక ! పెండ్లికి తరలు రీతిగా పోరికి తరలెద. [నిశ్వసించి] హా ! నిన్న పెండ్లిండ్లు నేఁడు మరణములు!

ఆ. కన్నెవలపుతోడి యన్ను మిన్నల వీడి
కైఁ గొనంగ వలసెఁ గైదువులను ;
పెండ్లి కంకణంబు వీరకంకణముగా
వెలమ యువలచేత విధి దవిల్చె. 30

ఏమి యీమానవ జన్మము !

ఆ. అంతలోన నెలయు నంతలో మ్రబ్బును;
నంతలోన వాన యంతఁ బిడుగు ;

బంటి నిండి పఱచి గండిలోఁ బడినట్లు
పడియె నౌర ! పదవి బాలికలకు. ౩౧

హా ! కోటలో ఊరేగింపు బయట ముట్టడి !

ఆ. మధువు లాని, యూంద వఱచి, మత్తాగొని,
యాటపాటలందు నసఁగి పెనఁగి,
తేఁటిమూఁక గండ్లు గూఁటిలో సుఖముండ
బయటఁ *గారుచిచ్చు ప్రబ్బికొనియె ౩౨

ఏమి యీ దైవమాయ ?

ఆ. అకట ! నిన్నఁ బెండ్లియైన యిందరు బాల
లేమి వెలితి నోము నోమినారొ !
అంతిపురములోని హల్లకల్లోలంబుఁ
బౌరజనుల గోడుఁ బట్ట వసమె ? ౩౩

[ఆకాశమున చూపు నిలిపి] విజయరామఁడా, ఇంతపని చేసిన నీవు నాచేత నేమి గతి పొందుదువో ? త్వరగా నామతీర్థము కానిచ్చి,- ఆహా ! ఏమి !

ఓరోరీ, నానగండా యుదురుమిడుకనీ
యూరి కెచ్చైతి వట్రా?
క్రూరా, మే ముత్సవ వ్యగ్రుల మగుటను నీ
కుఁకా జయం బబ్బు నట్రా ?
పోరా, మా కొల్చువేల్పుల్, పొడుచు కయిదువుల్
పొల్లు లై పోయె నట్రా ?
చోరా ? మామీఁదికిఁ ఘాతింసులను బదములం
జొచ్చి రేఁ దెచ్చి తట్రా ? ౩౪

ఈరాత్రి యిట్లు ముగిసినది:—ఆస్థానము చేరెదను. [అని నిష్క్రమించును.

---

* పా. దావవహ్ని

[ద్వితీయ తృతీయాంకముల నడుమ]

విష్కంభము.

స్థలకము:—పెద్దచెఱువు నీరాట రేవు.

[కతిపయ బ్రాహ్మణులు యథోచితముగ ప్రవేశింతురు.]

వేదాంతి.—శాస్త్రులుగారూ, అవు నయ్యా, నీమాట నిజమే! ఎంత దండు ఎంతదండు! నీరు ఈచెఱువును ఈప్రక్కనుగూడ చుట్టవేసినయెడల ఊరికి ఇప్పటికి ఈనీళ్లు దొరకకపోవును.

శాస్త్రి.—వేదాంతిగారూ, ఈమాఱు రాజు మంచిరాజనీతిని ప్రయోగించి నాఁడు. పెండ్లిసమయ మగుటచేత మనదొరలు ఎదిరి పోరనేర రని, మనయూరిమీఁదికి ఈగోలకొండసిద్దీలను పోఁజును తెచ్చినాఁడు. [అందఱ నుద్దేశించి] అయ్యా, బ్రాహ్మణోత్తములారా, మనప్రభువునకు జయము కలుగునట్లుగా ఈసమయములో మనబ్రాహ్మణో పాయములు ఎవరికి తెలిసినవి వారు చేయరాదా? పురుష ప్రయత్నముచే గ్రహ దోషములుకూడ తొలఁగి మేలు కలుగును గదా?

ఆ. వ్రాఁత దైవ మండ్రు, చేఁతఁ బౌరుష మండ్రు;
వ్రాఁత ప్రబలమేని చేఁత నడఁచు;
చేఁత ప్రబలమేని వ్రాఁత నడంచును;
గానఁ గడిఁది జతన మూనవలయు. 3 ॥

అయ్యా, జోస్యులుగారూ, ప్రశ్న చెప్పండు.

జోస్యుఁడు.—యుద్ధప్రశ్న, శీఘ్రమే. హా! ఈరాత్రియే యుద్ధము జరుగును.

ఇతరులు.—ఎవరికి జయము? ఎవరికి జయము? రాజునకా రాయనింగారికా?

జోస్యు.—ఎవరికిని లేదు. గ్రహములు చాల గందరగోళముగా నున్నవి.

[అని నిష్క్రమించును.

విద్యార్థి.—నేను రంగారాయనింగారికి జయము కలుగునట్లుగా నాపాఠములను మానుకొని సుందరకాండ పారాయణము చేసెదను. [అని నిష్క్రమించును.

కవి.—అది దినములపని. నేఁడే యుద్ధము జరిగిన నది కార్యకారి కానేరదు. కావున నేను రాయనింగారికి జయము కలుగునట్లుగా అమృతబీజములను, విజయరామ రాజునకు కీడు కలుగునట్లుగా విషబీజములను, పెట్టి పద్యాలు చెప్పెద. [అని నిష్క్ర].

మాంత్రికుఁడు.—ఈసమయములో ఆపని చేయరాదు. పోరంబోటున విషబీజము లిందును అమృతబీజము లందును పడినయెడల క్రొంప మునుఁగును; ఇప్పుడే మఱియొక మంత్రప్రయోగము చేయవలయును.

శాస్త్రి.—మంత్రాలకు మామిడికాయలు రాలవు. ఈసమయములో ఇంద్రజాలము అక్కఱకు వచ్చును.

వేదాంతి.—శాస్త్రులుగారూ! ఈపెండిండ్లు ఈముట్టడులు చూడఁగా లోకవృత్త మంతయు ఇంద్రజాలముగానే అగపడుచున్నది! అయ్యో,

ఆ. సుఖము లెల్లఁ గలలు, శోకంబులును గలల్;
తా ననెడు తలంపు హానిఁ దెచ్చు;
అరయ నింద్రజాల మఖిలప్రపంచంబు,
నిత్యసత్య మాత్మ నెగడు నొకటి. 32

శాస్త్రి.—అవును వాస్తవమే! ఇట తడయఁజనదు.

[అని అంపఱు నిష్క్రమింతురు.

తృతీయాంకము.

స్థలకము:—రంగారాయనింగారి యాస్థానిః

[అంతట రంగారావు, వెంగళరావు, ధర్మారావు, గుమాస్తాలు, వేగులు, పరివారంబును ప్రవేశింతురు.]

రంగారావు.—చెప్పండు మాకన్నలారా, మీరు ఇంక నేమి కనిపట్టి వచ్చితిరి?

వేగులు.—మహాప్రభో! పాపారాయనింగారు వస్తే కనిపెట్టడానికి రాజాం దారిలో విడిసినాడు విజయరామరాజు; తనదండంతా తనకాణ్ణే పెట్టుకొనున్నాడు. దానెంబణ్ణే హైదరుజంగుడేరా; బూసీడేరా దానెంబణ్ణుంది. సిద్దీబిలాలున్ను కడమ గొప్పసర్దార్లున్ను దానెంబణ్ణే. మాలపిల్లికాణ్ణుంచి వరసగా కొండబోటు దాకా ఫిరంగీలబారు నిలిపినారు. దానికీ బుస్సీడేరాకూ నడమ మందు కొట్లు. ఊరి చుట్టూరా అడివిలాగ సిద్దీలని, ఫరంగీలని, బుడతకీసులని, ఇంగిలీసులని, వళాందులని, తురకలని, ముట్టడి నిలిపినారు. వారివారి సందుల్లో, వారివారి పడాళ్లు కుదురుకొని వున్నారు. పరాసుల దండంతా ప్రతివాడికిన్ని తుపాకీలు, సన్నీలు, కత్తీ కఠారీ, బల్లెం బాకు; గోలకొండ తురకదండులో ప్రతివాడికి ఇవే గాక డాల్ తర్వార్, ఈటె ఇవిన్ని, విల్లు ఊచలున్ను. రాజుదండులో విల్లు ఊచలు లావు, తుపాకులు కొంచెం; బల్లెం బాకు ఈటె లావు. రాజు మన్నెసిబ్బందీని యుద్ధానికి పెట్టక చాకిరీకి పెట్టినాడు.

ప్రతీహారి—[ప్రవేశించి] జయం జయం ఏలినవారికి. హైదరుజంగు బహద్దరు కాడినుంచి రాయబారి సర్దార్ హసేనాలిగారు వచ్చివున్నారు.

రంగ.—ధర్మారావూ. నీవు ఎదురు పోయి వారిని తోడ్కొనిరమ్ము.

ధర్మ.—చిత్తము. [అని ప్రతీహారితో నిష్క్రమించును.

రంగ.—(వేగులతో) మీరు మరలి పోయి ఇంక నేమయిన తెలిసికొని రండి.

వేగులు.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమింతురు.

[అంతట హసేనాలిని తోడ్కొని ధర్మారావు ప్రవేశించును.]

ధర్మా.—వారే రంగారాయనివారు. తమరు ఇటు చెంతకు దయచేయవలయును.

హసేనాలి.—[సమీపించి] సలాము రంగారావు బహద్దరువారికి.

రంగ.—[లేచి]సలాము హసేనాలి సాహెబుగారికి. ఇట్లు కూర్చుండుడు.

[అని కుర్చీని జూపును. ముగ్వురు కూర్చుందురు.

హసేనాలి.—గోలకొండ నిజాముగారి యాజ్ఞచేత ఉత్తరసర్కారుల పేష్కస్సులు వసూలుచేయుటకు వచ్చిన సర్వాధికారి బూసీదొరగారి దివాను హైదరుజంగు బహద్దరువారు పంపఁగా మేము మీకడకు వారిరాయబారము తెచ్చినారము. వారి సర్దారులలో మే మొకరము. మేము వచ్చినపని హైదరుజంగు బహద్దరు వారి ధోరణిగానే వినుండు.—"మీరు గోలకొండ నిజామువారికి ఏడుసంవత్సరముల పేష్కస్సును ఎగవేసినారు. విజయనగరమురాజుగారి తాలూకాలు దోఁచుకొనుట, ఊరులు తగులఁబెట్టుట, లోనగు నేరములు ఎన్నియో చేసియున్నారు.

రంగ.—[ఆత్మగతము] హా; ఏమి ప్రయోగము ! ఎంతపని చేసినాఁడు రాజు! [ప్రకాశము] తర్వాత, తర్వాత?

హసేనాలి.— "మఱియు, మారాకను రాజు మీకు తెలిపినను 'నౌకరులచేటికి మేము రాము' అని మమ్ము తూల నాడినారు. పైగా మేము పంపిన ఫర్మానాను సరకుగొన్నవారు కారు.

రంగ.—[ఆత్మగతము] ఆహాహా ! ప్రయోగము విషమువలె ఎట్లు ఎక్కిపోయినది ! [ప్రకాశము] మఱి?

హసేనాలి.—"అది యెల్ల నటుండ-

(ఉత్సాహ)—

నేము వచ్చి కాచి యుండ, నీకు లెక్క లేదొకో?
దీమసాన నౌఖ తడిచి ధిక్కరింతువా మముక్ ?
హోము మాని, యీక్షణాన నాఁపి దాని, నీగడిక్
జాములోన ఖాలి సేసి, సాగు కట్టువల్లతోక్, 32

ఇట్లు చేయనిపక్షమున మరల సూర్యుఁ డుదయించులోపల, మీపుట్టకోటను మట్టిలో కలిపి, మీజాతము నెల్ల రూపుమాపెదము." ఇ దయ్యా తమకు హైదరుజంగు బహద్దరువారు పంపిన రాయబారము. మేము వచ్చినపని అయినది, మఱి మేము మరలెదము.

రంగ:—అయ్యా ! మామాటయు కొంచెమువిని మరలుఁడు.

ఆ. సత్యవంతు లెపుడు సత్యదూరులఁగూడ
సత్యవంతు లనుచు సమ్మతింత్రు;
సత్యదూరు లన్న సత్యవంతులఁ గూడ
సత్యదూరు లనుచు సంశయింత్రు 33

హసేనాలి.—వాస్తవము. పార్సీలో అట్లే యొకసామెత కలదు. దానికి తెలుంగు—
''కల్లరి కందఱు కల్లరులే, నిజమరి కందఱు నిజమరులే.''

రంగా.— వీరులరు మీరు సత్యదూరులరు కానేరరు. మఱియు వివేకులకు విస్తర మనపేక్షితము కావున సంగ్రహముగా వ్రాసెద.

హసేనాలి.—అట్లే చేయుండు.

రంగ.—మీరు తెచ్చినరాయబారములో అసత్యవాదము విశేషముగా నున్నది. మేము, విజయరామరాజు భూములలో అడుగుపెట్టలేదు. అతఁడు మమ్ము రూపుమాపను, మాబొబ్బిలి యేలను, దలఁచుకొన్నవాఁడై యెన్నిమాఱులైనను మాతో పోరియు న్నాఁడు. మేము, ఓడనందున, మామీఁద మీహైదరుజంగుగారికడ కుట్ర చేసి, మాయింటిమీఁదికి ముట్టడి తెచ్చినాఁడు. నిన్న పగలు మాయింట పెండిం డ్లయినవి. రాత్రి ఊరేఁగింపు అయినది. కంకణాలువిప్పలేదు. ఈసమయ మెఱిఁగి మామీఁదికి ముట్టడి తెచ్చినాఁడు.

హసేనాలి.—[ఆత్మగతము] నృశంసుఁడు! [ప్రకాశము] మఱి?

రంగ.—మమ్ము కోట వదలి పొ మ్మనుట చూడఁగా, మాజమీనును తనకు ఖరారు చేయించుకొన్నాఁ డని తలంపనై యున్నది. అది యుండుఁగాక ! ఎన్నిమా ఱులో మమ్ము సఖ్యార్థ మని బేటికిరావించుకొని సంఘాతసంహారము గావింప సమకట్టి నాఁడు. దానంజేసి, అతనికిని మాకును, జాబులు జవాబులు కూడ నిలిచిపోయినవి. కావున వారివలన మీరాక మాకు తెలియ దాయెను. ప్రత్యేకము మీకడనుండి మాకు జాబు రాలేదు.

హసేనాలి.—[ఆత్మగతము] అతఁడుమా ఫర్మానా వీరికి అందనీకుండ హరించి నాఁడా? ఆహా! ఆ హర్కారాలదంతయు పట్టినాటకముగా నగపడుచున్నది. ఏ మాశ్చ ర్యము ! [ప్రకాశము] కానిండు.

రంగ.—ఈకారణముచే మేము మీబేటికి రాజమహేంద్రవరమునకు రామైతిమి. ఎప్పుడును, నౌకర్ల బేటికి మేము రా మని పలికిన వారము గాము. మా తెలుపుకోనుట ఏమనఁగా?

క. నైజాముపారి కట్నము
హాజీ లేడేండ్ల కైనయది చెల్లింతుర్

మీరాక తెలియమియే హేతు వైనను, మేము మీబేటికి రానందులకై,—

రాజమహేంద్రవరము మొద
లోజన్ బ్రతిమజిలి కిత్తు నొకవేయివరాల్.

మఱియు;—

క. శస్త్రము లయినవి గాఁగ
రస్తుల నెంతైన సరఫరా గావింతుఁ;
హస్తులనుఁ హయములనుఁ
బిస్తీలను దోలి పంపి ప్రియ మొనరింతుఁ. ౪౦

క. నౌబత్తు మేము మానము;
నౌబత్తును మాకు ఢిల్లినాథుఁ డొసంగెఁ
ఈ బసను మేము విడి పో;
మీ బస నిర్మించికొంటి మేము వసింపఁ. ౪౧

రాయబారము వచ్చిన గొప్పవారికి, మీకు మావాస్తవస్థితి విశదపఱిచితిమి. గోలకొండనిజాముగారికి మామీఁద ఆయాసము కలుగకుండునట్లు హైదరుజంగునకు సత్పత్యావలంబము నేర్పుట, వీరులకు మీకు ఉచితము. వినునేని ఎల్లవారికి క్షేమము. వినఁడేని మేము యుద్ధమునకు సిద్ధముగా నున్నాము. ఏది యెట్లయినను, ఈయడావిడిలో తప్పని దొక్కటికలదు; అది విజయరాముని మరణము.

హసేనాలి — రాయనింగారు చిత్తగింప వలయు. విజయరామరా జే మయిన నగును గాక, మీబొబ్బిలి మా కేల?

ఆ. నిజము మింటి నడిమి నీరజాప్తుని భంగి
మబ్బు * డాఁచుమాత్ర మాసిపోదు;
కల్ల పూఁతపసిఁడిగతి మెఱుం గగుఁగాక,
యొరసి చూచినంత విరిసిపోవు. ౪౨

నన్ను తమరు ఇంతగొప్పచేసి ఇంత విశదముగా సకలవృత్తాంతములను సెలవిచ్చితిరి. గావున, నేను మీకు కేవలము అపరిచితుఁడ నైనను మీసౌజన్యమందు పక్షపాతి నై హైదరుజంగుం గూర్చిన నాయెఱుకం బురస్కరించుకొని తమకు హితైషి నై చెప్పెద. హైదరుజంగు మహామూర్ఖుఁడు; తప్పైనను, ఒప్పైనను, పట్టినపట్టు వదలఁడు. మీరు నౌబత్తు నిలిపి జాముసేపు కోటవెలుపల నుండినం జాలును; వానిదురాగ్రహము తీఱును. నేను మీన్యాయమును మాసర్వాధికారికి బుస్సీదొరకు తెలిపి మిమ్ము మరల కోటలో ప్రవేశపెట్టెద. యుద్ధమేల ! లక్ష దెబ్బదివేలతో పిడికెఁడుమందికి ఎంతవీరులకైనను పోరాట మననేమి?

---

* పా. గ్రమ్ముమాత్ర.

సీ. లక్ష దెబ్బది వేల లష్కరుతోఁ బోరు
　　పిడికెఁడు మందికి బెడద గాదె?
బెడిదంపుఁ బిడుగు లేసెడు ఘనాఘన మైనఁ
　　బెనుగాలి కెదు రెక్కి పెనఁగఁగలదె?
ఒక్క ఫిరంగికిఁ దుక్కు దుమారమై
　　మట్టిలోఁ గలియదే పుట్టకోట?
విండ్లుఁ జువ్వలు మందుగుండ్లను గెల్చునే?
　　యాటుబారల కెన యానె దోంట్లు?
తే. ఎరగలిం బడు మిడుతల కీడు గాఁగఁ
　　దెలిసియును గోదగోని పోయి పొలియుటయును,
బాలవృద్ధుల సతులఁ దుపానులోని
　　పిట్టలను జేతయును, వెఱ్ఱిపట్టు గాదె? ౪౩

అయ్యా,

క. అల వచ్చినఁ దల వంపుము,
　　పులి వచ్చినఁ జెట్టు నెక్కు, పోయిన దిగుమా! ౪౪

అన వినలేదా ? తుపానులోఁ మహావృక్షములు నిట్ట నిగిడి వే రూడును, తుంగ ంగియుండి అనంతరము తల యెత్తును. మీకు, ఇపుడు, పోరాటమునకు కాలము గాదు, పెండ్లియుత్సవము లింకను ముగియలేదు.

ఆ. రేయి గూబ వచ్చి మాయించుఁ గాకిని;
　　పగలు కాకి గూబఁ బట్టి చంపు;
　　కాలబలము; దీని గణుతించి పోరెడు
　　వీరుఁ డెల్లయెడల విజయ మొందు. ౪౫

కాలానుకూల్యమును చూడవలయును గదా ? ఇప్పుడు ఈయవాంతరమును, ట్లయినను దప్పించుకొని యనంతరము గోలకొండకు తెలుపుకొని యపరాధులను ండన చేయింప వచ్చును. కనుక, నన్ను మీతమ్మునిఁగా భావించి నాప్రథమప్రణయ మునకు భంగము చేయక, అతఁడు కోరిన యారెండుపనులను చేయుఁడు. క్షణము సేపు కారి వెళ్లితి మని తలంపుఁడు.

రంగ.—సాహెబుగారూ; మీరు చెప్పిన దెల్ల మాహితము గోరినమాట గాని, మఱి వేఱుగాదు. మీ రెవరో మాకు అకారణబంధువు లనుటకు సందేహము లేదు. మీయుపదేశముయొక్క సారము, మాకు దాని యాదిలోనే తెలిసినది. మీతోడి సద్గోష్ఠిని సంక్షేపింప నొల్లక మీమాటలను అంతము వినుచుంటిమి. మీరు చెప్పిన నీతిపద్యము, మాకు వెలమకులమువారికి పాఠాంతరముగా నుపదిష్టము ఎటు లన-

క. కలి వచ్చిన నడి గట్టుము,
పులి వచ్చిన నీఁటఁ బోదువు, పొలియుదు నోలుమీ;
వెలమలతోఁ బోరాడకు;
వెలమలసిరి కాసపడకు, విస మది నీకున్. ౭౮

హసేనాలి.—రావుగారూ! ఇది ఖడ్గమార్గము గాని కావ్యమార్గము గాదు.

రంగ.—అగుఁగాక.

(స్రగ్ధర.)

ప్రాణంబు ల్తీపులౌ ద్రాబల కగునయముల్
భాయి, మా కేల నేర్పన్?
ప్రాణా బన్నుం దృణప్రాయ మగు వెలమ వీ
రాళికిం గూర్ప వేలా?
నాణెం బౌకప్ప మిత్తున్, నగరు వెలువడన్,
నౌబతు న్మాన; హైదర్
నాణెంబు న్దప్పనేనిన్, నరహరి యొసఁగున్
నా కిహంబో పరంబో. ౭౯

సారమింతే, సాహెబ్ సలామ్. ఎంతటి పుణ్యము చేసిననోగదా రణమరణము దొరకును? [తమ్మునినుద్దేశించి] తమ్ముఁడా! సాయబుగారు మనయందు అకారణమైత్రి వహించి, చాలసేపు మనకు సాంగత్యమొసంగినారు; నీచేతులతో స్వయముగ వారిని సత్కరింపుము.

[నౌకర్లు అత్తరు పన్నీరు చందన తాంబూలములం దెచ్చి వెంగళరావుకడ నిలుతురు.

హసేనల్లీ.—అయ్యా! మీకు కోపము వచ్చిన వచ్చునుగాక! నాకుఁ దోచిన మాట పలికి పోయెదను. నాకు మీ పరువు వెఱ్ఱిగా నగపడుచున్నది. మీ బీరము ఏనుఁగు తనతలను తానే మన్నుకొట్టుకొనున ట్లున్నది! అయ్యా,

క. మీకు శుభమేని రణమృతి,
మీకులపాలికలు కూళ మ్లేచ్ఛులపాలై
చీకాకగుటయు శుభమా?
యీ కానిమతంబు మానుమీ వెల్మదొరా. ౪౮

[వెలమదొరలు ఉగ్రముగా చూతురు.

రం.—హసేనాలీభాయి, వేయేల?

క. మాకులము సతులు పుణ్య
శ్లోకలు, తముఁ జూచు పాలసులపాలిటికిన్
భీకర దర్వీకర దం
ష్ట్రాకర విషవహ్ని కీల లని వినవె సఖా. ౪౯

[వెంగళ్రావు సాహెబును సత్కరించును.

రంగ.—సలాము హసేనల్లీ బహద్దరుగారికి.

హసేనాలి—మఱి ఇఁక నేమి చేయవచ్చును! సలాము వెల్మ జమీన్దారుగారికి.

వెంగ.—తమ్ముఁడా! వారిని సాగనంపి రా!

వెంగ—అన్నగారి చిత్తము. [హసేనాలీ వెంగళ్రావు నిష్క్రమింతురు.

రంగ—ఎవరోయి అక్కడ?

ప్రతీహారి.—(ప్రవేశించి) ఏలినవారియాజ్ఞను శెలవియ్యవలెను.

రంగ.—మాజోస్యులవారు ఈక్షణము దర్శనము ఇప్పింపవలయును.

ప్రతీ.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

రంగ.—[సభ్యులనుగూర్చి] అయ్యా! మనమును మనమీఁద తప్పు లేకుండుటకై రాయబారము పంపవలదా?

సభ్యులు.—అవశ్యము పంపవలయును

రంగ.—ధర్మారాయఁడా మాబావగారిని పాపయ్యను పంపవలసినపనికి నిన్ను పంపుచున్నాను. మీయక్కగారిని మాకు రాణిగా మీతండ్రిగారు వివాహము చేసినపుడు అరణముగా నీప్రాణమును నీవే ఇచ్చుకొంటివి. ఇంతకాలము మాకు దివానవై మాకు సకలవైభవములం గూర్చుటయే గాక, విజయనగరమువానిని మాజమీనువైపు కన్నెత్తి చూడకుండ చేసితివి. నీ కన్న మా పరువును, మాభాగ్యమును, కాపాడువాఁడు మఱెవ్వఁడు కలఁడు? కావున, నీవు పరాసుదొరకడ కేఁగి, హసేనాలీతో మేము పలికిన విధమునకు వెలితి రాకుండ, నీమతివిభవముప్రకారము, కాయయో పండో, ఏర్పరించు

కొని రావలయును. పైక మెంత యడిగినను, గోలకొండసర్కారునకు, అంగీకరింపుము లంచ మడిగిన తమలపాకుతొడిమ నైనను ఒప్పుకొనకుము.

ధర్మా.— రాజేంద్రా! పాపయ్యగారు చేయవలసినపనికి నన్ను పంపితి మని తామే అనుగ్రహించితిరి గదా ; అంతకన్న వేఱు గౌరవము నాకుం గలదా ? కార్యము పండే అగునట్లు ఎంతయేని మెలంకువతో వ్యవహరింతునుగాని, వారు తూలంబలికిన, వెలమపోటు రుచిచూపి వచ్చెదను. అది సమ్మతమయిన నన్నుం బంపుండు.

రంగ.—మాకు అదే కావలసినది. కనుక నీవే వెళ్లిరావలసినది. మఱి లేచి, నూటికి సిబ్బందిని వెంటంగొని, సంధికి పోవుటగా, తెల్లజెండాతో తెల్లతొడుగులతో, పడవాలురామయ్య సహాయుండుగా, పోయి రమ్ము.

ధర్మా.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

[అంతట వెంగళ్రావు ప్రవేశించును.

రంగ.—తమ్ముండా, హసానలీ కోపముతోనే పోయినాండా?

వెంగ.—అన్నయ్యగారికి ఏమని మనవి చేయుదును అతని పరితాపమును ! కడపట నాచేతులు పట్టుకొని, 'అయ్యా, సాభత్తు అయినను మాన్పుండు. దానిం దెలిపి మీ సౌమ్యతనే చెప్పి, మీవెట్టి చెప్పక, కోట ఖాలీ చేయవల దని జాములోపల మీకు బూసీదొరవారికడనుండి కబురు పంపం గడంగెద.' అని చెప్పినాండు.

రంగ.—నీ వేమంటివి తమ్ముండా?

వెంగ.—మీ రన్నమాటయే అంటిని.

రంగ.—అంతట?

వెంగ.—అంతట దీనతతో సలాము లిడి వీడుకోలు వడసినాండు.

సభ్యులు.—ఇతండు మిక్కిలి సౌమ్యుండు, మిక్కిలి సజ్జనుండు; తురకలలో తప్పం బుట్టినాండు. ఇతండు ముందు పోయి మనలనుగూర్చి మంచిమాట చెప్పుట మంచిదే.

రంగ.—అవును. [సభం గాంచి] ఏం డయ్యా మాకరణము రామయ్య ?

రామయ్య.—[లేచి] అయ్యా! ఉన్నాను.

రంగ.—మేము వ్రాసినట్లుగా పాపయ్యకు జాబు వ్రాసి తెమ్ము.

రామయ్య.—ఏలినవారి చిత్తము. [అని నిష్క్రమించును.

రంగ.—[వెంగళరావు నుద్దేశించి] తమ్ముండా, నీకు నేను పెట్టెడుపనికి నామీఁద కోపము చేయకుము. నీ వయిన మిగిలియున్న విజయరాముని వంశమునకుం గానీక, మరల బొబ్బిలిని, మనవంశములోనే నిలుపుదువు. నాతోఁగూఁడ నీవును పోర

సమసిన, నిఁక భూమిలో మన పే రెక్కడిది ? కనుక నీవు మనస్త్రీలను పరాసుల చేతబడి యవమానపడకుండ, వలస తీసికొని పాలకొండ మన్నెమున కేఁగుము.

[వెంగళ్రావు భ్రాంతుఁడై దిగులుపడి రంగారాయని చూచును.

రంగ.—ఏమి లేవవు? ఎప్పుడును నా నోటిలోని మాట నా నోట నుండఁగానే పని నెఱవేర్చువాఁడవు. ఇంతవరకు యుద్ధములో నెప్పుడును ముందుమొన నడపించినవాఁడవు. ఇపుడు వెనుకకు పంపినందులకు నాపై కోపమా ? సమయమట్టిదిగా నున్నది? ఈజన్మములో నంత ఈదినమున ఉందుమో ఉండమో ? ఇట్టి సమయములో నాయాజ్ఞ నెఱవేర్ప త్వరపడ వేమి ?

వెంగ.—హా ! కొజ్జాలు చేయవలసినపనియా నాకు సంభవించినది ! ఏమి యీ దైవవిలాసము !

రంగ.—హా ! ఎట్టికాలము వచ్చినది !

వెంగ.—అన్నయ్యగారూ, రాణివాసములను తరల్చి మరలి తమ దర్శనము చేసికొనియెద. వారితో వేఱొకరిం బంపవలయును. [అని నిష్క్రమించును.

రామయ్య.—[ప్రవేశించి] ఇదిగో జాబు ; రెండు నకళ్లు వ్రాసి తెచ్చితిని.

రంగ.—చదువు రామయ్యా చదువు.

రామయ్య—[చదువును.]

"స్వస్తి శ్రీ బొబ్బిలి నేలు రావు గోపాలకృష్ణ రంగారావు బహద్దరువారు, మా బావగారికి, తాండ్రపాపారాయనివారికి, కడపటి దండములు మ్రొక్కి వ్రాయుట.— విజయరామరాజు రాజాము సీమలో పితూరీలు చేయించుట మిమ్ము వెంగళరాయని పెండ్లికి రానీయకుండుటకోస మని మోసపోయితిమి. అందులకు కానే కాదయ్యా. బొబ్బిలిని ఱెక్కలులేని పిట్టను జేసి చిదుగఁగొట్టుటకు, అని యెఱుఁగమైతిమి. ఇప్పుడు తెలిసినది. మఱే మున్నది బావా ! రాజు మనయింటిమీఁదికి గోలకొండ పరాసు పౌఁజును ముట్టడి దెచ్చినాఁడు. రెండు లక్షలకు కాకిపూఁక పరాసుమూఁక కమ్ముకొని యున్నది. రాత్రి దొంగప్రొద్దున దొంగతనముగా ముట్టడివేసినారు. వేగుప్రొద్దునఫిరంగి వేట్లు వేసి తెలిపినారు. గడియకో అఱగడియకో ఫిరంగివాతను బొబ్బిలిని వేసికొందురు. మేము పాపకారి పెండిండ్లు చేసితిమి. కోటలోపల చుట్టాలు వచ్చి నిండియున్నారు. స్త్రీలను కోటలో నుంచి, జగడ మాడుట సరిగాదు. మాకు కోటలోపల రస్తు లేదు. వలసలు తరలుటకు త్రోవలు లేవు. బావా, వెంగళ్రాయఁడు ఇంకను, కంకణాల చేతులతోనే యున్నాఁడు. మా కందఱకు సంఘాతమరణము సిద్ధమైన దయ్యా. పెద్దల నాఁటి బొబ్బిలికోటకు మాకు ఋణము చెల్లినది. ఇక్కడ స్త్రీలు, పురుషులు, బాలురు,

వృద్ధులు అందఱు నీపేరు వల్లించుచు, అంగలార్చుచున్నారు. నీవు వచ్చిన, మాకు ఈ సంఘాతమరణము తప్పును. ఏడేడు పదునాలుగేండ్లకును బొబ్బిలికోటను ఆ యముండును పట్టలేఁడు; జయము కీర్తియు క్షేమమును కలుగును. నీవు రాకున్న, రాజామునకు తరలిననాంటి చూపులే నీకును నాకును కడసారి చూపులు సుమా ! పెండ్లికి రావైతి వని చింతిల్లుచుంటిని. ప్రాణము గావ రావేని చెప్పవలయునా? ఈజాబు చూచిన తక్షణము, బావా, రాజామునకు బొబ్బిలికి సందున విజయరామరాజు దండు విడిసి యున్నాఁడు, ఆతని దండును విఱుగఁబొడుచుకొని కోటకు రావయ్యా. ఇన్నాటితో వెంగళరాయని నీకు ఎదురు పంపెదను. నీకోసము దిడ్డితలుపు తీసి యుంచెదము. నీవును మిరియాలసీతన్నయు, మాలపల్లిమీఁదుగా, కొండబోటు తిరిగి, ఆదారిలో హైదరుజంగుడేరా యున్నది, ఆ హైదరుజంగును విడిదలలో నఱికి, రావలయును. ఈరాత్రి వత్తువేని, నీకును నాకును చూపు లుండును. ఇవే బావా ; నాకడసారి దండములు.—

ధాతు— ఫాల్గున-శు. ౩ సోమవారము.

రంగ.—దివ్యముగా వ్రాసితివి. మేమే చెప్పిన ఇంత చక్కఁగా కుదురదు. ఇదిగో మొహరు. [అని యుంగరము తీసి రామయ్యచేతి కిచ్చును.

[రామయ్య మొహరు వేసి, మొహరు రంగారావుచేతి కందిచ్చును.

రంగ.—ఈజాబులు పగతురచేతఁ బడకుండ పాపయ్యకు ఎట్లు చేరఁగలవు?

రామయ్య.—మహాప్రభూ, నేను వెళ్లి ఆసంవిధానము చేసెదను.

రంగ.—మంచిది పోయి అట్లే చేయుము. [రామయ్య నిష్క్రమించును.

ప్రతీహారి—[ప్రవేశించి,] జయము జయము ఏలినవారికి? మహాప్రభో, జోస్యులవారు కాశీకి వెళ్లినారు ; వారి సిషుపుడు ఏలినవారి సభకు రాను భయపడి [అని వ్రాఁతయొకటి రంగారాయని మ్రోల నిడి,] ఈరాత తన గురువుగారు ప్రశ్నవస్తే యేలినవారికి అందించుమని తనచేతి కిచ్చి వెళ్లినా రని యిచ్చినాడు.

రంగ.—[కైకొని, ఇట్లు చదువుకొనును.]

*మ. అమృతాహారులసంగడి న్వలచి కాయంబూడ్చి స్వర్వాటికిన్
గమనించున్ సకళత్రబంధుసచివాక్రందప్రమోదంబుగా
సమదారాతి చమూ మహోదధి నగస్త్యక్రీడఁబెంపొంది రం
గమహీనాథుఁడు ధాతుఫాల్గునవలక్షున్ దుర్యవేఁబ్రొద్దునన్. ౫౦

---

* ఈపద్యము మదీయము. ఏతత్‌స్థానమున ప్రథమముద్రణమందుండినట్టిది, మదీయము గాదు. వే. వేం.

[ఆత్మగతము] హా ! ఇందువలననే వారు నాకుం జెప్పక యేఁగినారు. హా! ఇట్టి వ్రాఁత బ్రహ్మవ్రాసియుండఁగా నరుఁ డేమిసేయఁగలఁడు ? హాహాహా ! పుట్టలోని యిసుళ్ల నన్నిటిని కిరాతుఁడు పట్టినట్లు కోటలోని మాజాలమునంతయు ఒక్కమొగిని పట్టినాఁడు, విజయరాముఁడో, యముఁడో ! ఈ జోస్యము చూడఁగా, జాబు పాపయ్యకు చేరదు, రాణివాసముల వలనయు జరుగదు, రాయబారంబును ఫలింపదు.

వెంగ.—[ప్రవేశించి] విన్నపము. తమయాజ్ఞను తెలుపఁగానే, రాణిగారికి, చాల కోపము వచ్చినది. జవాబు చెప్పుటకు వారే తమకడకు, అదె వచ్చినారు.

వేంకటలక్ష్మి.—[అపటీక్షేపముగా బ్రవేశించి] జయజయం ఏలినవారికి. దేవి గారు వచ్చియున్నారు.

[అంతట కూఁతునుం గొమరునిం దోడ్కొని రాణి ప్రవేశించును.]

రంగ.—(సంభ్రాంతుఁడై) ఏమి యిది; స్త్రీలు ఆస్థానికి వచ్చుటా? ఎన్నఁడైన కలదా? ఇ దేమి సాహసము ! ఏమి యీదురాచారము ! మతిపోయినదా ? ఘోషా ఏ మయినది? [సభ్యులు మొగమొగంబులు సూచుకొని తటాలున నిష్క్రమింతురు]

రాణి.—ఇంటికప్పు తెగఁ గాలి, నెత్తిమీఁద పడుచుండఁగా, నిఁక నేమి ఘోషా? ఇంతకాలమునకు పూసపాటిరాజు నన్ను రచ్చకెక్కించి, తమతో తెగువ మాట లాడించినాఁడు. ఇన్నాళ్లకు మీ కేమి వెలమబుద్ధి పోయి రాచబుద్ధి వచ్చినది! మమ్ము నందలను పాలకొండకు వలస పంపిన, ఆపాలకొండకు ఆణిదారుఁడు గదా ఆపూసపాటిరాజు, అతఁడు లోలోపల, దండు పంపఁడా మామీఁదికి ఆక్కడికి? సిపాయి కొక్క వెలమస్త్రీని గట్టఁడా విజయరామరాజు ? పరులచేత చచ్చుటకు మా కేమి కారణము? మీ రేమి ఏలినను, అనంతకాలము రాజ్యము లేలెదరా? యుగములు జగములు గలంత కాలము భూమి పాలించెదరా ? చచ్చిన పేరు బ్రతికిన లేదు. మీరు చావను మేము బ్రతుకను ఆలోచించితిరా? చచ్చినను మేము కోటలో చావవలయును గాని, పరులచేత మేము చావము.

రంగ.— ఈమాట మాతమ్మునిచేత చెప్పి పంప రాదా ? స్వయముగా ఏల రావలయును?

రాణి.—ఏల యనఁగా, ఈబిడ్డలను మీయొడిలో ఉంచి వారికి మీకు కడసారి చూపు లందిచ్చుటకు తెచ్చితిని. (అని కొమారితను తండ్రి ప్రక్కను నిలిపి) రావమ్మా! సుందరమ్మా ! మీనాయనను, కడసారి చూపు చూచుకోవమ్మా. (పుత్త్రునింగూర్చి) నాకొండా ! మీనాయనగారియొడిలోఁ గూర్చుండుము.

[అని పుత్త్రుని రంగరాయని యొడిలో కూర్చుండఁబెట్టును.

రంగ.—రావమ్మా అమ్మా, అమ్మా రా. కడసారిచూపా యిది ? [అని కూఁతును కవుంగిలించి, ముద్దుగొని] ఇవే అమ్మా మేము నీ కిచ్చిన సారెచీరలు! (శిశువును లాలించుచు)

ఉ. నాయన, నీదు నెన్నొసట నల్వ లిఖించెను మాకుఁ గాలకూ
టాయిత మౌ దురంతము హఠంబునఁ ; బున్నెము లిట్టు లుండ, మా
నాయనసాటి వాఁడ వని నమ్మితి నా చిఱుపాప; యౌర సీ
పాయికొ రాచపాదలికొ బానిస వాఁడవె రావువంశజా? ౫౧

బాబూ, పూసపాటిరాజునకు ఏమియూడిగము చేయుందువో తండ్రీ ! ఇందులకా నీవు బ్రతుకుట? [అని ముద్దుగొని కత్తిదూసి నఱకఁబోవును.

సుందరమ్మ.— (కనులు మూఁతబడి) 'బాబయ్యా ; పాపయ్యా.'

[అని తండ్రి కాళ్లు పట్టుకొనును.

రాణి—(కత్తి పట్టుకొని) ఏమి ! వెలమదొర లిట్లు వెఱ్ఱిదొర లైతిరి! ఆకూనయే గదా విజయనగరముమీఁద మీపగ తీర్చుకోవలసినవాఁడు ? ఆతనిని మాచెల్లెలు జగ్గమ్మ కడకు సామర్లకోటకు పంపఁదగును. వానివలన మరల మీవంశము, ఆ సూర్యచంద్రు లున్నంత కాలము, వర్ధిల్లును; వానిని కాదు మీరు నఱకవలసినది. శత్రువులకంటెఁ బడ కుండ వెలమరాణులను మమ్ము నఱకవలసినది.

రంగ.—చక్కఁగాఁ జెప్పితివి; మెడచాఁపు.

[రాణి రంగారాయని పాదములకు ప్రణమిల్లి మెడ చాఁచును. రంగ. నఱక సుంకించును.

సుందరమ్మ.—[తండ్రికాళ్లను చుట్టుకొని] అయ్యో! బాబూ! బాబూ!
[అని అంగలార్చును. శిశువు కత్తి కడ్డముగా తల్లిమెడను కౌఁగిలించుకొనును.

వెంక.—ఇప్పుడేల అన్నగారూ ? ఇంకను సమయ మున్నది అంతకు వచ్చి నప్పుడు చూచుకొందము.

రంగ.—అటయిన మీరు ముప్వురు సెలవు పుచ్చుకొండు.
[రాణియు, బాలుఁడు, సుందరమ్మయు, వేంకటలక్ష్మియు నిష్క్రమింతురు.

[సభ్యులు ప్రవేశింతురు.]

రంగ.—నేను అనుకొన్నట్లే అయినది. రాణివాసములవలస జరుగదాయెను. మఱి మా వంశపరంపరగా మాదొరతనమును కాపాడుచు వచ్చిన దళవాయులారా—

[నేపథ్యమున.]

ఏలినవారు కొలువుతీరియే యున్నారా ? ఉన్నారు ప్రభో.

[అంతట ధర్మారావు, నెత్తుటం దోఁగుచుఁ బ్రవేశించును]

[అందఱు సంభ్రాంతులై కందురు.

ధర్మారావు.—దండములు బావగారికి, దామర్ల ధర్మయ్యను తమయానతి నెఱవేర్చి వచ్చినాఁడను.

రంగ.—మేము సంధి కని తెల్లయుండుపుతో పొమ్మనఁగా మీరు ఎఱ్ఱయుండుపుతో నేల పోయితిరయ్యా.

ధర్మా.—ఇది తెల్ల దుస్తే; పరాసుల నెత్తుటిలో నెఱ్ఱ నైనది.

రంగ.—కూర్చుండుము. ఏమి? ఏ మయిన దచ్చుట? వివరముగా చెప్పుము.

ధర్మా.—(కూర్చుండి) మేము గోపాలస్వామిని సేవించి, మ్రొక్కులు ముడుపులు గావించి, పోయి, బుస్సీకచ్చేరికి తెలుపుకొని చొచ్చితిమి. చొరఁగానే, విజయరామ రాజు, అకచ్చేరిలో నున్నవాఁడు, నన్నుఁ జూచి, చివుక్కున లేచి, హైదరును కన్నుగీటి తోడ్కొనిపోయి, తనవ్రేలియుంగర మొకటి అతనివ్రేల నుంచి, చెవిలో ఏమియోచెప్పి, చేతిలో చేయి వేయించుకొని పోయినాఁడు. 'సంధి పొసఁగనీయకు' 'ఎంతమాత్రము పొసఁగనీయను' అన్నమాటలుగా, పెదవుల కదలికచేత తెలిసినది.

రంగ.—అంతట? అంతట?

ధర్మా.—అంతట,—బూసీ కొలువులో లేఁడు. సర్దారులు ఇతరులును, ఇరువది నలుగురు ఉండిరి. హైదరు తనతావునకు అరుదెంచెను. నేను, 'సలాము' అనఁగానే, హైదరుజంగు దెబ్బదిన్న పామువలె, నామీఁదికి ఎగిరి- 'ఏమి నీ పాళెగానికి దిమాఁణ మన్న లక్ష్యము లేదా? నౌబత్తు మానఁడు, కోట వదలఁడు, తాను భేటికిరాఁడు; తన నౌకరును నిన్నుఁ బంపినాఁడు, మాకడకు? చూడు; కన్ను మూసి కన్ను తెఱచులోపల నీపాళెగానికోట ధూళిధూళిగా ఎగురఁగొట్టి, మిమ్ముల నందఱను మహమ్మాయి చేయించెద.' అని బొబ్బరించి, నౌభత్తు నిలిచిననే గాని మాకు వేఱు కార్యము వినం బడదు? అట్లనిపోయి మీవేఁటకానితో చెప్పుకో.' అన్నాఁడు.

రంగ.—అంతట?

ధర్మా.—అంతట, నేను 'మాదొరను తూలనాడెదవా!' అని కత్తి దూయఁగానే, హైదరుజంగు గడగడ వణఁకి ఖానులవెనుకకు దాఁటినాఁడు. ఖానులు, 'ఇటువంటివెల

మలు కాఁగానే రాజునకు లోఁగరు' అని యొకరితో నొకరు అనుకొని, గలగల పలికి, లేచిరి. కొందఱు పోయి బుస్సీని దెచ్చిరి.

రంగ.—తర్వాత ? తర్వాత ?

ధర్మా.—బుస్సీ వచ్చి-'అయ్యా, మీ రెంతశూరులయినను దివాణమునకు వచ్చి కత్తి దూయ వచ్చునా?' అని నన్ను అడిగెను. 'నేను శ్రీ బొబ్బిలిజమీన్దారు రంగారాయనింగారి దివాన నై రాయబారము వచ్చి, ఈ హైదరునోట తూలుమాట మోయించెదనా? ' అని నే నడిగితిని.

సభ్యులు.—బళి! బళి!

ధర్మా.—అంతట, బుస్సీ 'మేము ఇంతచెంతకు వచ్చియుండఁగా నైన మీజమీన్దారు స్వయముగా మాచేటికి రాక, రాయబారము పంపుట యుచితమా?' అని యడిగినాఁడు.

రంగ.—సరి. అందులకు?

ధర్మా.—అందులకు, సత్యమున హరిశ్చంద్రుఁడు, ఔదార్య సాహసముల విక్రమార్కుఁడు, విద్యలో భోజుఁడు, ఈవిలో కర్ణుఁడు, కోపమున రుద్రుఁడు, నగు మా దొరగారు మీచేటికి మర్యాదలలో హెచ్చుతక్కువలు కలుగు నేమో యనియే రాలేదుగాని, వేఱొండు గాదు. అట్లు వారు శంకించుట సరియే యని నా కైన మర్యాద చేతనే తమకు విశద మాయెఁ గదా? ఇపుడు వారి కేమియు మరియాద లోపము చేయమని మీరు సెలవిత్తురేని, ఈ యుత్తరక్షణములో వారిని చేటికిం దెచ్చెద. వారిని కని వారితో క్షణము భాషించినచో, వారి మైత్త్రిని మీరు వదలరు. వారి పై కుట్ర చేయు వారిని చేర్పరు.' అని జవాబు పలికితిని.

రంగ.—అంతట?

ధర్మా.—అంతట, బుస్సీ— నన్నుఁ గూర్చుండు మని, తాను గూర్చుండి, నేనుం గూర్చుండి, ఇతరులుం గూర్చుండఁగా, నన్నుం జూచి,—'పోనీ ! ఆమాట కేమి? మీ న్యాయ మెల్ల హసేనల్లీవలనఁ దెలిసినది. మీరు రాజమహేంద్రవరమునకు మాచేటికి విదేశము రామికి, కారణము తెలిసినది. మీరు కట్టనొప్పుకొన్న యగ్గావులవలన, అందులకు సమాధాన మైనది. మా దివానుమాట తప్పించుట మాకు శక్యముగాదు. అతనిని గోలకొండ నిజాముగారు స్వయముగా నియమించినారు. అతనిసలహాప్రకారము మేము వ్యవహారించునట్లుగా, మాకు హుకుము చేసినారు. కనుక, నాభత్తుకోటల విషయమున మీరు లోఁబడనియెడల పోరు తప్పదు. లోఁబడిన, మీకు పాలకొండసీమను బొబ్బిలికి బదులుగా మే మిచ్చెదము. అందులకు మీరు అంగీకరించిన, పోరు తప్పి, మనము

భాయి భాయిగా పోవచ్చును.' అని వక్కాణించెను. అంతట 'మీతో రాయబారము వలనఁ బ్రయోజనము లేదు.' అని నేను లేవఁగా, ఖానులు గీనులు,అందఱును, కనుసైజ్ఞఁ జేసికొని, కత్తి దూసికొని, 24 గురును నన్ను పొదివిరి. హైదరు నన్ను అడ్డగింపుఁడని పండ్రెండు పహరాలకును, పహరాలో పెట్టింపుఁ డని ఖానులకును, ఆజ్ఞచేసెను.

సభ్యులు.—ఏమి యాగడము !

రంగ.—అంత ?

ధర్మా.—అంత, నేను 'సిపహరాలో నిలిచితినేని నేను వెలమబిడ్డనంటరా?' అని కేక వేసి,—

[పంచచామరము.]

తటాలునన్ బటాలు దూసి తన్నుఁ గాచు సామునన్,
బటాన్ మొగల్ ఘుటాఘుటీలు భ్రాంతులై ననుం గనన్,
బటాలు తెక్క, లేఁ దిమిన్, సపత్నవార్ధి దూఁటి, బల్
హుటాహుటిన్ హుటుమాపయిన్ దదుక్తిఁ జెప్ప వచ్చితిన్. ౫౨

నా పరిజనములును, జవ్వన ఈఁటెలు పంచి, అడ్డ మయిన సిపాయిమందల నెల్ల తెగఁబొడిచి, కూల్చుచు దారి చేసికొని, తమ పోటు రుచిచూచినవారు చూడని వారును, దిగులుపడి నిశ్చేష్టులై పడుచు లేచుచు తమ్ముఁ గనుచునుండ, నావలెనే అక్షతశరీరులై నావెంటనే వచ్చియున్నారు. నేను జేసినపని తప్పో ఒప్పో తమరే ప్రమాణము.

రంగ.—ధర్మారాయఁడా ? మాపరువు నిలిపితివి. శత్రువులకు వెలమపోటు రుచి చూపించి, అక్షతశరీరుఁడ వై వచ్చి మాకు కనులపండువు గావించితివి. ఇంతకన్న ఒప్పేమి యుండును ? చాలును, అలసితివి. పోయి సేదదేఱుము.

ధర్మా.—మహాప్రసాదము. [అని నిష్క్రమించును.

రంగ.—[సభ్యుల నందఱి నుద్దేశించి] అయ్యా, ఇంక నే మున్నది ! పోరు పొసఁగినది.

క. ఈసమయంబునఁ బాపయ
మాసమ్ముఖమందు నున్న, మార్కండేయున్
బాసటయి హరుఁడు గాచిన
వాసిగ, మముఁ గావఁడే యవనయమునలనన్! ౫౩

[ఉత్సాహ.]

గడియలోనఁ గోట నింకఁ గాడుసేయఁ బన్నుదుర్
గడి ఫిరంగిమోహరాలు కందకంబు చుట్టు రాఁగ;
కొడిని దివిచి పాదుసాహి కొడిని— (కాదా)
విజయరాము కొడిని—గొత్తళంబుపై
నిడెడుకొఱకు లగ్గయెక్క నిడుదు రుడుపనిచ్చెనల్. ౫౪

ఆ. అన్నలార, కూడియాడిన చెలులార,
విందులార, వినుఁడు విన్నపంబు:—
ఆలుబిడ్డలందు నాసగొందురు మీరు,
తల్లిఁ దండ్రి భక్తిఁ దన్పుచుంద్రు. ౫౫

ఆ. ఇట్టిప్రళయమందుఁ గట్టు నేయము మిమ్ము,
మమ్ముఁగూర్చి మీరు మ్రంద నేల?
మీర లిపుడె పోయి వారిఁ గాచికొనుండు;
మాకు వచ్చె మారి, మమ్ము విడదు. ౫౬

దళవాయులు.—మహాప్రభూ! మాకొలిచిన వేలుపా! [మానోద్రేకముతో]
ఎంతమాట సెలవిచ్చినారు మ మ్మేలినదొరవారు!
ఈఁకెకొక్క మొఖాసా తింటిమి యిందఱము మేము.
ఏలినవారి యన్నముచేత నెదిగిన దీ యొడలు;
ఏలినవారికి దీని నియ్యక యేఁగుదుమా మేము?
మీరు పెట్టిన దండకడెములు మేము ధరించితిమి,
మీ చేతుల మీ రిచ్చిన దుస్తులు మేము ధరించితిమి,
పెద్దలనాఁటి నెత్తురుకోకలు పిలిచె మమ్ము రంగ,
పరుల నల్ల రుచిగన్నపటాలు పైకెఁ ద్రుళ్లె రంగ.
ప్రాణము మీరు, దేహము మేము, రావు రంగరాయ;
ప్రాణముఁ బాసిన దేహము నెవరు బసలకు రానీరు.
బంటు వెళ్లలము మేమే గామా? యొంటర్లము గామా?

బంటు గంటు తెలగాలము గామా? యొంటర్లము గామా?
విలయము వచ్చిన సమయమునందు వెనుకకుఁ దగ్గుదుమా?
చచ్చిన పేరు, బ్రతికిన లేదు, సాహసాంక రంగ.
మీ రణభేరి మ్రోఁగినప్పుడే మీకె యెఱుక గాదా?
గుభేల్ ! గుభేల్ ! గుభె ! లరులకు, మాకు
శుభము ! శుభము ! శుభము !
ఘణులు ! ఘణులు ! ఘణు ! లరులకు, మాకు
మణులు ! మణులు ! మణులు !
భయము ! భయము ! భయ ! మరులకు, మాకు
జయము ! జయము ! జయము !
మీరు పోరను మేము నిలువను మీరు తలఁచినారా?
మీతోడిదె మాలోక మన్నది మీరు మఱచినారా?
అడ్డుమాటలు సెలవు లియ్యక యాదరించి మమ్ము,
పనిగొనవయ్యా, పనిగొనవయ్యా, ప్రభువ రంగరాయా. ౫౭

7/69

[అని ప్రాంజలు లగుదురు.

రంగ.—దళవాయిలారా ! మీ యనురాగమునకు మిక్కిలి సంతోషము. ఆటయిన యుద్ధమునకు సన్నద్ధుల రగుఁడు. మహావీరులారా ! మీరు ఒకొక్కరును పగతురతో కలయఁబడుదు రేని నూర్గను వేలను రూపుమాపఁ గలవా రగుట లోకవిదితమే! అయినను పరాసుమూఁక, అనంతముగా నున్నది. మీ చేతులకు నయితము తఱుఁగునదిగా నగపడదు. సముద్రమునకు ఏతము వేయుటగా నున్నది. పైగా మనము ముఖ్యముగా ఊఁచతోను, ఈఁటెతోను, కూల్చువారము. వారు ముఖ్యముగా గుండుతోఁ గూల్తురు. మఱి వారిపాల నున్న నల్లమందు నూరమ్మతో పోరుట కష్టము. కోటకాపున, మాటుల నుండి మనము పోరితిమా, వారిగుండు మన్నపైఁ బాఱదు, మనయూఁచ వారినికూల్చును. నల్లమందు ఘూరమ్మ మనమీఁదికి రాఁజాలదు. ఫిరంగులు మోర్జా చేసి కోటను గూల్పం గడంగుదురు. మీరు ఫిరంగివాని నెల్ల ఊఁచవాత వేయుదురేని, వారి యాపని నెఱవేఱదు. మనము బయటికేఁగితిమా, వారు సులువుగా కోట పట్టుదురు. అనంతరము మనము రెండునిప్పులనడుమ మాడిపోవలసినదే. కోటలో నున్న ట్లయిన, నా నియమించు సేనావిన్యాసమును నెఱవేర్పుఁడు. ఏమి? నాయూహ సరిగా నున్నదా?

దళ.—మిక్కిలి సరిగా నున్నది.

రంగ.—ఏమి? పడవాలు రామయ్యా?

పడవాలురామయ్య.—కోటలో పరాసులు చొచ్చినచో, మనయాఁడువారి దుర్గతి నూహింపఁగలమా? కోటనుండి, ఎంతమాత్రము మనము వెలుపడఁగూడదు. ఏలినవారియానతి సర్వోత్తమముగా నున్నది.

రంగ.—బేతాళుని బురుజుమీఁద, మాజెండాను నౌభత్తును కాపాడుట, ముత్యాలపాపయ్యవంతు ; 200 మంది సిబ్బంది.

ముత్యాలపాపయ్య.—మహాప్రభూ, దండములు. మహాప్రసాదము ! ఇప్పుడు నేను ఏలినవారినౌకరను, ఇంతవరకు ధర్మానకు మీ యుప్పు తినుచుంటిని.

రంగ.—హనుమంతునిబురుజు మావెంగళరాయనివంతు; 200 మంది సిబ్బంది.

వెంగ.—మహాప్రసాదము ఇప్పుడుగదా నేను యువరాజను, ఏలినవారి తమ్ముఁడను.

రంగ.—కోమటి పేట బురుజు మాబావమఱఁది ధర్మారావువంతు; 200 సిబ్బంది. పడవాలురామయ్య బలిజెబురుజు, 200 సిబ్బంది.

పడ-రామ.—మహాప్రసాదము! న న్నేలినదొరా !

రంగ.—కడమ 1200 కాల్బలము, 250 గుఱ్ఱమును చెలికాని వెంకయ్యక్రింద సిద్ధముగా నుండవలసినది. మఱి, మీరందఱు ఇండ్లకు వెళ్లి క్షణములో మీతావులు చేరవలసినది. ఇంతలోనే పరాసులఫిరంగులు వినఁబడెనా, ఆక్షణమే మీతావులకు పోవలసినది. మా ధర్మారావుతో ఆయనవంతునకు మే మిడిన తావును చెప్పవలసినది.

దళ.—ఏలినవారియాజ్ఞ.

రంగ.—ఊరిలో వారివారి యాత్మసంరక్షణ వారువారు చేసికొనవలయుననియు, మావశము తప్పిన ప్రళయము వచ్చిన దనియు, చాటింపు చేయింపవలసినది.

పడ-రామ.—ఏలినవారియాజ్ఞ.

రంగ.—వారు ముందుమిగులవలసినదేగాని, మీరెవ్వరును ముందుమిగులకుఁడు. మఱి యిఁక ఏగడియకు నెవర మే మగుదుమో గావున, మాకును మీకును ఇదియే కడపటిచూపు. [అందఱు రంగారాయనిం జూతురు.

రంగ.—మఱి మనము తడయఁజనదు.

దళ.—జయ బొబ్బిలి రంగారాయ మహావీర!

[అందఱును నిష్క్రమింతురు.

చతుర్థాంకము.

[రాణి పురోహితభార్య వేంకటలక్ష్మి వేగుయువతులును ప్రవేశింతురు.]

రాణి.—[పురోహితభార్యను నిర్దేశించి] అవ్వగారూ ఈదాసీయువతులను ఇరుపురను బయటివృత్తాంతములు తెచ్చుటకై పంపుచున్నాను. [అని వారింగని] ఓధన్యురాండ్రారా మీరు పోయి మీయన్నదమ్ములద్వారాన రాజువిడిదలలోని వృత్తాంతములం దెలిసికొనివచ్చి నివేదింపుఁడు.

వేగుయువతులు.—మహారాణి తల్లిగారి చిత్తము. [అని నిష్క్రమింతురు.

రాణి.—అవ్వా, అరుంధతీదేవిగారూ. తాతగారేమయిన మాకు ఈయుద్ధము తప్పు నని చెప్పినారా?

పురో-భా.—ఏమిచెప్పుదును తల్లీ, మీపురోహితులవారికి నాతో పలుకుటకు తీఱలేదు. నిరంతరము శాంతిక పౌష్టికములకు జతనములు చేయుటగా నున్నారు.

రాణి.—వారి యాశీర్వచనము లైన ఇపుడు ఫలింపరాదా?

వేగుయువతులు.—[ప్రవేశించి] దండం దండం మహారాణి తల్లిగారికి.

రాణి.—బాలికలారా, ఏదేని చల్లనివార్త తెచ్చితిరా ?

వేగు.—చల్లనివార్త లెక్కడివి ! మాతల్లీ, ఆపాపాత్ముడి హృదయం ఏమిచెప్పుదుము మహారాణిదేవీ ?

రాణి.—వివరముగా చెప్పుఁడు.

వేగు.—ఆరాజు తనకూ మన దొరగారికీ వున్నపగలు బొబ్బరిస్తావున్నాడంట బొబ్బిలికోట దున్నించి, ఆముదపు తోట వేయిస్తాడంట, ఆ పాటిపోగాకు పుచ్చుకోక తనపగలు తీరవంట. రాయనింగారి శిరస్సు గోసుకొని పోతాడంట. తనయన్నకుమారుడికి ఆనందరాజుకి బొబ్బిలికోట పట్టం కడతాడంట. ఈలాగ గర్జించి ఇంకను పాడుమాటలు పలికినాడంట తల్లీ.

రాణి.—వానిని గూడ వినిపింపుఁడు. ఇప్పుడు మాకాలము అట్టిది.

వేగు.—మఱి రంగారాయనింగారి బంగారపు మంచముపై పఢుంటేనేగాని, తన పగలు తీర వని అరుస్తావున్నాడంట.

రాణి, పురో. భా.—హరీ ! హరీ !

రాణి.—బాలికలారా మీయనురక్తిని మఱవను. [వేంకటలక్ష్మి బాలికలకు పసద నంబిచ్చును.]

వేగు.—రాయనింగారికి జయంకలిగితే మాకేమితక్కువ.

రాణి.—మంచిది పోయిరండి. [వేగుబాలికలు నిష్క్రమింతురు.] కానీ: ఇందులకు బదులు నేను గోపాలస్వామి సన్నిధిలో పలికెద. అవ్వగారూ, ఇఁక మాకు స్వామియే దిక్కు. గోపాలస్వామిని కడసారి సేవించుకొని మేము సిద్ధముగా నుండెదము. వేంకటలక్ష్మీ, మాబాబును, మాకొమార్తను, తెమ్ము. పెండ్లికొమార్తలను, దాసీజన సమేతముగా తోడ్కొని వచ్చి, గోపాలస్వామికి పూజచేయించి, మాకు దర్శనమునకు సిద్ధము చేయింపుము.

వేంక.—దేవిగారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

రాణి.—[ఒకదాసిని ఉద్దేశించి] ఓసీ ! కామాక్షీ ! నీవు బ్రాహ్మణవీథి కేఁగి పేరయాంధ్రను గుడికి తోడ్కొనిరా.

కామాక్షి.—దేవిగారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

[అంతట సుందరమ్మ, చిన వేంకట రాయఁడు
పెండ్లి కొమారితలు, దాసీజనమును ప్రవేశింతురు.]

వేంక.—[వచ్చి] దేవిగారు ఆజ్ఞాపించినట్లు స్వామికి ఆచార్యులచే పూజచేయించితిని. మఱి తమ రందఱు దర్శనము చేయవచ్చును.

రాణి.—రండి, నాబంగారు కొండలారా ; మావంశాంకురము లారా, రండి; [అని కొమారితను కుమారునిం జేరఁ దివిచి.] రండి నన్నుఁగన్న తల్లులారా ! రా రండి గోపాలస్వామికి కడసారి సేవచేసి కొందము.

[అందఱు మల్లమ్మదేవి వెంట దేవళములోనికి ప్రవేశ మభినయింతురు.

రాణి.—ఆహా !

తే. పరమపురుషునింటికి పట్టుసొచ్చిన మాత్ర
నాత్మ యెంత శాంత మయ్యె నహహా !
జాగిలంబులట్లు చాఁజీల్చితిను వగల్
కలయుఁబోలె విరిసి తొలఁగి పోయె. 82

[ఆత్మగతము] అయినను మరల దిగులు మిగులుచున్నది.

[కామాక్షియు పేరంటాండ్రును ప్రవేశింతురు]

రాణి.—[పేరంటాండ్రను ద్దేశించి] అమ్మారండి: మాకడపటి పూజను కైకొండి. [అని వారికి పసుపు కుంకుమ పువ్వులు ఇచ్చి] ఈనూలిపోగును గైకొండి.

[అని వస్త్రాభరణములిచ్చి మ్రొక్కును.]

పేరంటాండ్రు.—ఈ మీ యిడుములో సత్కారము లెట్లు కైకొందుము తల్లీ!

రాణి.—కమలాక్షీ, ఈవస్తువులను, గొనిపోయి వీరియిండ్లలో నప్పగింపుము. [వారింగూర్చి] అమ్మా, మీకు ఉద్దేశించినవి మేము మరల ఎట్లు ఉంచుకొందుము? అమ్మా, నిరాకరింపకుఁడు.

రాణి.—పిల్లలారా? రండి స్వామికిని అమ్మవారికిని మీకోర్కి చెప్పుకొండి.

బాలికలు.—[ఇట్లు వేఁడుకొందురు.]

పరమ పురుష, నీదు పాద పద్మముల
శరణుఁ జొచ్చితిమయ్యా; సామీ! నిన్నుశ...
కరుణతో మా ప్రాణేశ్వరులకై యీ యొక్క
గండము తప్పింపు; సామీ! ఈయొక్కగండము...
బాలల ము మే మే పాపమె ఱుంగము
ప్రాపని నిన్నే న మ్మితిమి; సామీ ప్రాపని...
ప్రాలితి మి నీదు పాద ప ద్మములందుఁ
పాలింపు మని వేఁ డితిమి. సామీ పాలింపు...
ఎల్లలోకముల తల్లిరో లక్ష్మి, నీ
పిల్లల కు దిక్కు గమ్మా; అమ్మానీపిల్లలకు...
ఉల్లము మామీఁదఁ జల్లఁగఁ జేసి మా
వల్లభు లను గావ వమ్మా. అమ్మామావల్లభు...

రాణి.—స్వామిమ్రోలను నా మొఱ వెట్టుకొనెద. స్వామీ, మాదొరల పాలిటికి ఈయొక్కగండము నైనకావలేవా? ఈమాఱు రాయనింగారి కోట విడిచి కొండ లోనికి వలస వెళ్లితివా? ఎక్కడికి స్వారి వెళ్లితివయ్యా గోపాలస్వామీ.

ఉ. భావజుతాత; మాదొరల పాలిటి వాఁడవ; వారి నిత్తఱిన్
గావుము దేవ; మాకు నలికంబునఁ గుంకుమ నిల్పు మాధవా.

ఈవిలయంబుఁ ద్రోచెదవ యేని యొసంగెద నీకు హైమముల్
సీవిరు లాతపత్రములు సింగపుద్వారము తార్క్ష్యయానముల్. ౬౦

మామీఁదనే పగలు పట్టితివా గోపాలస్వామీ ? మాదొరలు పోయిన శుక్రవారపు టారగింపు నీకు ఎవ్వరు చేయుదురు స్వామీ ?

[స్వామి మెడలోని పూదండలు ధరణిం బడును. కిరీటము గిఱ్ఱునఁ దిరుగును.

రాణి.—ఆహా అవశకునము ! [అని ఇట్లు పాడును.]

అవశకు నంబులే చూపెను!
అక్కటకటా! అవ॥
సామీ మనకు
దివిజ శ రణ్యుఁడు దీనల పాలిట- అవశ-ను॥
తపులనీఁ డాయె నె దను గని కరమును,
దిపురుద మమ్మతో దీనిఁ దెల్పుకొనంగ- అవ॥

రాణి.—బాలికలారా, అమ్మవారికి మొఱపెట్టుకొందము. అమ్మా ! తల్లీ ! ఈ పెండ్లికొమారితల కంకణాలు స్వర్గములో విప్పింతువా?

బాలికలు.—[ఇట్లు పాడుదురు.]

నమ్మిన మముఁ గావవమ్మా !
అమ్మా తల్లీ, నమ్మి॥
అమ్మా నీ వైన మా యంగలార్పులు విని, నమ్మి॥
ఇమ్మహి నీకన్న నెవరు దిక్కు మాకు ?
నెమ్మి మా కిమ్మా మా యమ్మా లక్ష్మమ్మా, నమ్మి॥

రాణి.—హా! అమ్మవా రేమియు సూచన చేయదాయెను. కానీ, స్వామి యొకటియు, అమ్మవారొకటియుఁ అనుగ్రహింతురా ? మఱి, యిఁక గుడి వెలువడుదము. [అని పరిక్రమించి] ఇదిగో, పీఠిమన్ను [అని మన్నెత్తుట నభినయించి] ఓ దేవతలారా ! నా పూర్వజన్మపుఁ గొఱనోముల చేత నిపుడు నాపై కరుణింప రేని, ఓ గోపాలస్వామీ, ఓ మహాలక్ష్మీ, [ఊర్ధ్వ మవలోకించి] ఓ సూర్యనారాయణమూర్తీ, ఓదిక్పాలురారా, నేనే వీరపతివ్రతనేని, మీకు నేను ఈపుట్టువున త్రికరణశుద్ధిగా సేవలుచేసి యుంటినేని యు, ఇది యైన నగుఁగాక:—నా యార్యపుత్త్రునికే, ఈ విజయరామునివలన మరణ మగునేని, అపూఁడవసాఁడే వీనిగతియు [అని మన్ను తూర్పారం బట్టుచు] ఇట్లు

అగుఁగాక. ఈ పాపాత్ముఁడు నాయార్యపుత్త్రుని పసిండి మంచముపై పరుండునయేని దానిమీఁదనే వీనికి చిత్రవధ యగుఁగాక. [పెండ్లికొమారితల నుద్దేశించి] మఱి, మనము పైయాలోచన చేసికొందము. [ఒక దాసిని] ఓసీ కమలాక్షీ, నీవు పోయి సరాబును మే మడిగితి మని చెప్పి, [ఉంగరము దీసి యిచ్చి] యీగుర్తు చూపించి వేయి వరహాలు తెమ్ము.

దాసి.—దేవిగారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

రాణి.—వేంకటలక్ష్మీ ; ఈ స్వామియెదుట, ఈ యమ్మవారియెదుట ఈనారాయణమూర్తియెదుట, నిన్ను మావంశమును నిలుపఁబెట్టునట్లు వేఁడుకొనుచున్నాను. మాకుఁ గల 33 దాసీజనములలోను నిన్ను పెద్దదాసిగా గణనచేయుచుంటిమి. నీవు మాసంస్థానమును నిలుపఁగదే వేంకటలక్ష్మీ. సామర్లకోటలో మాచెల్లెలు జగ్గమ్మకడకు వేంకటరాయని నీవు కొనిపొమ్ము. మేము బలిమిచావులు చత్తుమని మాచెల్లెలితో చెప్పకువే వేంకటలక్ష్మీ.

వేంకట.—అమ్మా! మీరు చావను మేము బ్రతుకనా? [అని కన్నీరు నించును.

రాణి.—[అశ్రులు దుడుచుకొని] కాదే ; మా వేంకటరాయఁడు బ్రతికిన, మేము బ్రతికినట్లే గదే ; వేంకటరాయని పెద్దవాఁడగుదాఁక, నీవు పోషింపుము. ఆ తర్వాత, మానాయనయే నిన్ను పోషించును. మాకుమారుఁ డని తెలిసినచో, మానాయనను పగవాండ్రు బ్రతుకనీయరే. అడ్డగించువారితో బాపనవారి యచ్చమ్మకొడుకని చెప్పవే. ఓసి మా బాబయ్యను మొలకు నులకత్రాఁడు తెచ్చి మొలత్రాఁడు గట్టుఁడు.

[ఒక దాసి పోయి త్రాఁడు తెచ్చి కట్టును.

రాణి.—అరత్నాలమొలత్రాఁడు తీసివేయుఁడు. [తీసి వేయుదురు.

రాణి.—ఆభరణముల నెల్ల నూడ్చివేయుఁడు. [అట్లే చేయుదురు.

రాణి.—[బాలు నెత్తుకొని] అయ్యో! నాయనా!

క. దారులు గొట్టుకిరాతులు
ఘోరాటవిలోన నధ్వగుల కిడునిడుమల్
క్రూరను దల్లిని జోరిని
గారాబుఁగుమార నీకుఁ గావించితిరా! ౬౩

[అని యేడ్చి] ఓసీ ; మానాయనకు విభూతి తెండు. [ఒక దాసి పోయి తెచ్చును.

అవ్వ.—ఇటు తెమ్ము. [అని చేకొని తాను పూయును.

రాణి.—నాయనా, తండ్రికంటె యోగశాలి వని పెదలు చెప్పిరిగాని, యిట్లు

పకీర సౌదు వని యెవ్వరును చెప్పకైరి నాకొండా! [అని అశ్రువులు తుడుచుకొని] ఓసీ; మానాయనకు ఒక జందెము తెండు.

[ఒకతె దారము తెచ్చును. అవ్వ దానిని జందెమువలె చేసి బాలునికి వైచును.
రాణి.—పుత్త్రుని నిర్వర్ణించి] నాయనా !

క. ఏ పేద తల్లి కడుపున
నో పుట్టితివేని హాయి నుందువు తనయా !
యీ పాడు మల్లి కడుపున
నే పట్టి, పుట్టి యిట్టి యిడుమఁ బడితివే ! ౬౪

వేంకటలక్ష్మీ; 'వడుగైనదా?' అని యెవరైన నడిగిన, 'కాలేదు, అయిన కుఱ్ఱవాండ్రను చూచి యేడ్చి తాను జందెము వేయించుకొన్నాఁడు.' అని చెప్పవే.

కమలాక్షి.—[ప్రవేశించి] దేవీ, ఇవిగో 1000 వరహాలు, ఇదుగో తమ యుంగరము.

రాణి —వేంకటలక్ష్మీ, ఒడిపట్టు. [కమలాక్షి నుద్దేశించి] ఓసీ, ఆవరహాలు ఆ యొడిలో పోయుము. [అట్లే చేయుదురు. వేంకటలక్ష్మి గట్టిగా కట్టుకొనును.

రాణి.—ఈపదార్థమున కాశింపకే వేంకటలక్ష్మీ. కోట తరలఁగానే సోలుజర్లు, సిపాయీలు, రౌతులు, చుట్టవేసికొందురు. వారికి నీయొడిలోనిపదార్థము నంతయు వెదచల్లుము. దానిని వారు ఏఱుకొను సందడిలో నీవు తప్పించుకొనిపోవే; [అని శిశువును ముద్దాడును. శిశువు కన్నీళ్లు విడుచును. తల్లి మరల కన్నీళ్లు ఇదుకొని, బుడుతని కన్నీళ్లు దుడుచుచు తనకన్నీళ్లను తుడుచుకొని] అయ్యో! అయ్యో! నీవును ఏడ్చుచున్నావా! నాయనా! నిన్ను నేనెట్లు ఎడఁబాయుదును నా కూనా ! [అని బాలుని కన్నీళ్లను ముద్దులతో తొలఁగించి] వేంకటలక్ష్మీ, వీఁడుగో నీబిడ్డఁడు; మాబిడ్డఁడు గాఁడు. [అని వేంకటలక్ష్మిచేతికి వేంకటరాయని ఇచ్చి కన్నీళ్లతో] వేంకటలక్ష్మీ, ఈదిడ్డివాకిటినుండి వెలువడుము.

వేంకట.—ఇదే దేవిగారికి నాకడసారి దండము. [అని శిశువును దింపి, రాణికి మ్రొక్కి లేచి కైజారు ఒడిలో సముదాయించుకొని, కన్నీళ్లుబుకఁగా అడఁచుకొని] తల్లీ!

ఉ. వేవురు సోలుజారు లరివీరులు వచ్చిన, నీకటారితోఁ
జావఁగఁ గ్రుమ్ముదాన, నెడసందునఁ బట్టిని బట్ట నీను ; దాఁ
గేవల మింద్రజాల మనఁ గీడ్వడనీయక కాతు నాదొరన్ ;
జీవము మాకు నిల్పఁగ వశీకృతమాయుని సంస్మరించెదన్. ౬౫

[ఆకాశము చూచుచు] స్వామీ ! నారాయణమూర్తీ, ఈనాయనను జగ్గమ్మకు ఎట్లు చేర్పించెదవో ! [రాణి నుద్దేశించి] నాతల్లీ,

ఉ. రావులవారు నేర్పిన పరప్రతిఘాతనవిద్య లెల్ల బా
గా వినియుక్తి గొల్పెద ; నపాయము లేని యుపాయ యుక్తిమై
నేవగ నైనఁ జేరిచెద నీకొడుకుఁ బినతల్లిసంనిధిఁ,
భావజ బాలభావ పరిభావుక రూప మహః ప్రభావునిఁ. ౬౬

[అని శిశువును ఎత్తుకొన్నదై నేపథ్యద్వారము వఱకు రాణి లోనగువారు కూడవచ్చి చూచుచుండఁగా నిష్క్రమించును.

రాణి.—[మోమున చేలాంచల ముంచుకొని యేడ్చి] మానాయనకు నాకును ఈవిధమున ఋణము తీఱిపోయినది. [అందఱు ఏడ్తురు.

పురో. భా.—అమ్మా ! ఏడువకు. నీబిడ్డఁడు నీచెల్లెలికడ క్షేమముగా వర్ధిల్లును. ఏడువకు మాతల్లి, ఏడువకు.

రాణి.—[మఱియు మఱియు ఏడ్చి కనులు తుడుచుకొనుచు] అవ్వా ! తమకును మాకును గూడ నిటనే యిట్లు ఋణము తీఱెనఁగా ?

పురో. భా.—కాల మట్లు వచ్చినది నాతల్లీ ! అయినను ఇప్పుడైనను పరమేశ్వరుఁడు మనలను గావరాడా?

రాణి. అవ్వా, ఎప్పటికైనను, మన మెడఁబాయవలసినదే గదా ? తమరు ఈపేరఁటాండ్రతో వెళ్లవచ్చును.

పురో. భా.—ఔను మాతల్లీ.

[అని దుఃఖదుఃఖముగా ఆవిప్రపురంధ్రులతోడ నిష్క్రమించును. కామాక్షి చత్త్రములం గొని వెంట నేఁగును.

రాణి.—బాలికలారా, వీరపత్నులకు మనకు ఈ దీనత్వము తగదు. మనము మన ప్రాణేశ్వరులు పోవుతావునకు వారికన్న ముందే పోయి అచట వారికి స్వాగతము చెప్పవలసినవారము. అందులకు సిద్ధపడుదము రండు. [అందఱు నిష్క్రమింతురు.

(చతుర్థ పంచమాంకముల నడుమ)

ప్ర వే శ క ము.

(అంతట పలువురు పౌరులు ప్రవేశింతురు.)

ప్రథముఁడు.—ఒరెయ్యోయి సన్నాసీ, కోటలో నేమోయి చెవులు గింగురనే లాగ యీరోజల్లా ఖణీల్ ఖణీలు ఖణీల్మని మోగుతూ వుంది ?

ద్వితీయుఁడు.—ఓహో అప్పడా ! మఱేమీ గాదు ; కత్తులు, కఠారీలు, ఈటెలు, బల్లాలు, బాకులు, ఈలాంటి వస్నీ చికిలీ చేయిస్తూ వున్నారోయి.

అప్ప.—ఏమి చికిలీ అయినా చేయించేరుగాని, ఈకత్తులూ కఠార్లు, ఆ నల్లమందు మారెమ్మ ముందర అక్కఱకు రావురా. నేను పెద్దలు చెప్పగా విన్నాను కొన్ని విశేషాలు.

సన్నాసి.—నాకు చెప్పరా ఆవిశేషాలు.

అప్ప.—వినుమఱి. ఈ నల్లమందు మారెమ్మ అనే ఆమె కాళికాదేవి, అదే కాళరాత్రట. కాగానే మనకళ్లకి నల్లగా బొగ్గువర్ణంగా కనబడుతుంది. ఆమెకి కిట్టని వాళ్లు దగ్గిరికెళితే భగాలు మని మంట మండి అంతర్ధానమవుతుంది. వాళ్లు కాలి చచ్చిపోతారు.

సన్నాసి.—అవునురా, అవునురా.

అప్ప.—మఱి మన యీ దేశాల్లో నుంచి మంత్ర తంత్రాలకి పలాయమానమై పోయిన భూత ప్రేత పిశాచ బ్రంహ్వరాక్షస శాకినీ ఢాకినీ శాకినీ తాకినీ పినాకినీ బుడబాకినీ గోడదూకినీ పాడెపీకినీ నింగినాకినీ నేలదేకినీ నీడగోకినీ దయ్యాలు ఆమెకి పరివారము. అవి ఆమెతో కూడా యెప్పుడూ అంతర్ధానంలోనే వుంటవి. యుద్ధంలో ఆమెకి కిట్టనిపక్షం వాళ్లని తెలియనీకుండ మీదబడి చంపి రక్తం తాగేస్తవి.

సన్నాసి.—తినేస్తవట కూడా.

అప్ప.—అవును మఱి. మఱీ-ఆమెయెప్పుడున్ను పరంగు లింగిలీసులు వొళందులు బుడత కీసులు సిద్దీలు వున్నారే, వాళ్లపక్షము. ఆమె వీళ్లకి గొట్టాలూ వుండలూ యిస్తుందే అవే తుపాకులు ఫిరంగులూ యినపగుళ్లున్ను. ఉండలవెనక తానేవుండి వూత్తుంది

పౌరులు.—ఈళ్లల్లోబుడతకీసు లన్నావే అ దేం పేరండీ ?

అప్ప.—వాళ్లు గుఱిగా చూస్తే బుడతలు, అనగా కుఱ్ఱవాళ్లు, కెవ్వున కేకేసి కీసుకీసుమంటూ లగువు వేసి చచ్చి పడిపోతారు.

పౌరులు.—నిజమేనా నిజమేనా ? ఏ మాశ్చర్యము!

అప్ప.—అవుతే అబద్ధం చెప్పుతానా ?

పౌరులు.—అబ్బా ! యీళ్లచేత మనపని యేమౌద్దో గందా ?

పౌరులు.—వొళందు లన్నారే వొళందు లేంటయ్యా?

అప్పన్న.—వాళ్లవొళంగులు- వొద్రంగులు- అనగా కంసాల్లు. సముద్రం కింద వూళ్లు, యిళ్లు, మైదానాలు, ఆకాశం, అన్నీ కట్టుకొని, తిమి తిమింగిలాల మందలని గేదెమందలలాగ పాడి చేసుకొంటూ, ఆపాలు బడబానలంలో కాచుకొని తాగుతూ, హాయిగా వుంటారు అందుకోసం వాళ్లకి వొళందు లని పేరు.

ఒక కుఱ్ఱవాఁడు.—[బ్యా అని యేడ్చుచు] నాకు బయ మేస్తావుంది. నన్నుమా యింటికాడికి తీసకెల్లండి. [అని ఒకపౌరుని పట్టుకొనును.

ఆపౌరుఁడు.—తీసకెల్తాలే, మాకాడుండు, భయ ముండదు.

కుఱ్ఱ.—అబ్బా ! నానుండను. [బ్యా అని యేడ్చుచు పరువున నిష్క్ర).

సన్నా.—బాగా నరుకుతావురా. మఱికొందరిపేరు పరంగు లన్నావే అదెందు కొచ్చింది ?

పౌరులు.—కుఱ్ఱోడు యెల్లిసాడు లెండి, మఱి శెప్పండి.

అప్ప.—పిరంగిలు కాల్చడంలో అంతటి వాళ్లు మఱి లేరు. కడమవా ళ్లంతా తుపాకీలు యేలాగ యెత్తి రొమ్మున పెట్టుకొని కాలుస్తారో, వీళ్లు యెంత పిరంగీ అయినా ఆలాగే యెడమచేత్తో యెత్తి రొమ్మున బెట్టుకొని కాలుస్తారు. అదీ కారణం ఆపేరు రావడానికి.

పౌరులు.—ఇంగిలీసు లేంటండీ?

అప్ప.—వాళ్లమతంలో 'యేంజెల్సు' అంటే దేవతలు. వీళ్లు దేవతల అవతార మని ఆపేరు వచ్చింది. ఆలాగే వీళున్నచోట అధర్మం జరగ దంటారు.

పౌరులు.—మరి యీళ్లందఱు తెల్లగా వుంటారే, అదే మండీ ?

అప్ప.—పూర్వము హనుమంతుడు మొదలయిన వానరవీరులు సీతాదేవిని చూచి వచ్చి మధువనంలో చొచ్చి తేనె లన్నీ తాగేసి, దధిముఖుణ్ణి అవమానపఱిచినప్పుడు అతడి మొఱ్ఱని సుగ్రీవుడు వినకపోతే, దధిముఖు డంటే అతని మొఖుం పెరుగులాగ తెల్లగా వుండుఁను దన్నమాట, అతను అలిగి దేశాలమీద పాఱిపోఁగా, అప్పట్నుంచి ఆదేశాలన్నీ గడ్డగడ్డగానే, చెట్లు, చేమలు, కొండలు, అడవులు, ఆకాశం, నదులు, జీవరాసులు, అన్నీ కాలమానంలో కూడ, పెరుగుగడ్డలలాగ తెల్లబడి పోయినవి. వీళ్లు ఆదేశాల వాళ్లు.

పౌరులు.—ఏమి శిత్ర మండీ? మరి సిద్దీలో?

అప్ప.—వాళ్లు ఏపనిమీద వెళ్లినా అది సిద్దే; అందుకోసం సిద్దీలు. పూర్వాం వాళ్లు బొమ్మరాకాసు లట. వాళ్లకి మేకలు పొట్టేళ్లు ఆటవు. ఒక్కడొక్కడూ పూటకి ఒక యెద్దుని తినేస్తాడు.

సన్నా.—కొంద రంటారు పూటకు ఒక పెద్ద శిద్ది నెయ్యి వీళ్లకి అన్నంలోకి కావాలట. అందుకోసం ఆపే రొచ్చిందట.

పౌరులు.—ఓయిబాబో ఓయిబాబో! ఏమి యింతండీ!

అప్ప.—ఆమాట కేం గాని, నా కొక స్వాములవారు చెప్పినారు; రొండు పాదాలు రొండు శిద్దెలు, రొండు పిక్కలు అంతకన్న రొండు పెద్ద నిలువు శిద్దెలు, తొడలు అంతకన్న రొండు పెద్ద నిలువు శిద్దెలు, పిఱ్ఱలు మఱీ ప్యాద్ధ రొండు శిద్దెలు, కడుపు వొక ప్యాద్ధ అడ్డ శిద్దె, ఱొమ్ము ఆలాంటివే రొండు నిలువు శిద్దెలు, బుగ్గలు రొండు శిద్దెలు, తలకాయ ఒక శిద్ధె, ఈలాగ పుట్టినా డట వీళ్ల మూలపురుషుడు. ఆమూలంగా వీళ్లకి శిద్ధీలని పేరట.

పౌరులు.—అటయితే యీళ్లకి మనోరు సాల్లే రంటారా?

అప్ప.—మనవారికే ఈపరాసులు చాల్లే రంటాను.

సన్నా.—అది యలాగ? వివరంగా చెప్పు.

అప్ప.—యలాగంటే, మనదొరలు భేతాళుడి వంశస్థులు.

సన్నా.—అయ్యో నీతెలివి! భేతాళనాయు డని వీరి మూలపురుషుడురా; భేతాళుడు గాడు. ఆయన వోరుగంటి ప్రతాపరుద్రమహారాజుకాడ ప్రధాన సేనానాయకుడుగా వుండి, తురకలని పారదోలి, వోరుగంటి యాంధ్రరాజ్యాన్ని స్థాపించినవాడు.

అప్ప.—అ దెంతమాత్రం గాదు. భేతాళుడు భేతాళుడు భేతాళుడే. ఆభేతాళుడు ఈకోటలోనే నివాస ముండి, పిశాచాలని యేలుతూ వుండేవాడు. అప్పుడు హనుమంతుడు ద్రోణపర్వతం తేవడానికి వెళ్లుతూ, మంచి తిండి వుంటే మోయడానికి బలము వుంటుం దని, భేతాళుడియింటికి చుట్టంగా వొచ్చినాడు. తన బురుజు తమకి యిద్దఱికీచాల దని, భేతాళుడు ఆక్షణాన పిశాచాలచేత హనుమంతుడికి వేఱె బురుజు కట్టించి, అది ఆయనకి బస యేర్పరిచి, అందులో తిండి పెట్ట్యాడు. అందుచేతనే యీ బురుజుకి భేతాళబురు జని, ఆబురుజుకి హనుమంత బురుజని, పేళ్లు వచ్చాయి.

సన్నా.—వహవ్వా! వహవ్వా! మంచి సొరకాయలురా! పోనీ మని విన్నకొద్దీ నరుకుతున్నావు. కానీ, ఇంకా నరుకు. సీకు. తగిన వినేవాళ్లే దొరికినారు!

పౌరులు.—ఇంకా శెప్పండయ్యా, శెప్పండి; మనదొరలు పరాసులని యలాగ గెలుస్తారో ?

అప్ప.—వినండి మఱి. వెలమదొరలలోనే మఱి కొందఱు నరిసింహమూర్తి వంశస్తులు. అందు చేత వెలమదొరల ముందర, యాభూలోకంలో, మ రేవీరులున్ను తల యెత్తలేరు.

సన్నా.—ఓయి నీతెలివీ ! సర్వజ్ఞ శింగమ నాయనింగారని మఱి నొక మూల పురుషుడు రా. ఆయనికి తెలియని శాస్త్రంగాని విద్యగాని లేనందున, ఆయనికి సర్వజ్ఞ బిరుదు వొచ్చింది. ఆయన వేంకటగిరిరాజధానిగా తూర్పుసీ మంతా యేలిన దొర.

అప్ప.—అన్నా ! సన్నాసిగాడు ! మాటమాటకీ పుల్లేస్తాడు !

[అని సన్నాసిని చిటమట లాడుచుం జూచును.

సన్నా.—ఏమిటీ ! అప్పిగాడు మనిషిలాగ రేగుతున్నాడు! [అని కోపించును.

[అంతట వెట్టివాఁడు ప్రవేశించి యిట్లు దండోరా వేయును.]

ఆశివిగాని పెళ్యం వొచ్చింది. (డుండుం.) పరాసులు గడెకో గడెకో కోట మీది కొస్తారు. (డుండుం.) వూరిజన మంతా యెవరిసొత్తులు, పానాలు, వారిశాత నైనలాగ కాపాడుకోవలిశింది. (డుండుం.) యీలా గని యేలినవోరు సాటించ మన్నారు.—(డుండుం.) [అని నిష్క్రమించును.

పౌరులు.—[దిగులుతో] ఈసాటింపుకి గుండె నొటుక్కు మంటున్నది బాబో!

అప్ప.—నా కేమో భయంలేదు. నా కింకా 2000 బ్రాహ్మణార్థా లున్నా యని జోస్యుడు చెప్యాడు.

పౌరులు.—వవ్వా వవ్వా! మంచి జోశ్శమయ్యా. మాకంతా సావూ, పరాసు కూడూ, తప్పదు. ఏం శేతాం బాబూ ?

(అంతట కోమటి చెలువలు నీళ్లబిందెలతో తిరిగి తిరిగి వెనుకకు చూచుచు వడివడిగా నడచుచు ప్రవేశింతురు.)

సన్నా.—ఏ మమ్మా, కోమటక్క లంతా వడివడిగా గుంపుగా వొస్తున్నారు?

ఒకతె.—ఎందుకా అన్నా ? సిద్దీలు అక్కడక్కడ పొంచుండి ఆడవాళ్లకేసి తప్పుడు చేష్టాలన్నీ చేస్తున్నా రన్నా. [అని వడిగా పరిక్రమించును.

అప్ప.—నేను వెళ్తా; నా కీరోజు బ్రాహ్మణార్థం వుంది. [అని నిష్క్ర.

సన్నా.—బలే తండిపోతు ! నేను రేపు వుంటానో వుండనో? అందుకోసం అరు వేడవడం యెందుకు ? గోపాలస్వామిగుడి నంబ్యాచార్లు నాకు చక్కెర పొంగలీ దధ్యోధనమూ పెడతా నన్నాడు. వా ట్నెందుకు పోగొట్టు కోవడం ?

ఒకపౌరుఁడు.—అయన్ని తిండిపోతన్నావే, మరి నువ్వేంటయ్యా ?

[సన్యాసి పలుకక నిష్క్రమించును

ఒకతె.—(ఇతరలతో) అక్కోవ్ హో అక్కా, యీపరాసులు సిద్దీలు వీళ్లంతా మనరాయనింగారి యింటికి పెళ్లిళ్లకి వొచ్చిన చుట్టాలే గదా. వారికి చుట్టాలైతే మనకీ చుట్టాలే గదా. కడమ చుట్టాలకి వారు విందు చేస్తే, వీళ్లకి విందు మనం చేతాం. వీళ్లు నువపేటకొస్తే ;

రెండవది.—వేడి వేడి నూనంటి, అక్కో హో అక్కోవ్.

మూడవది.—వేడి వేడి నీళ్లోసి, ,, ,,

నాలుగవది.—పలసని యంబలి పెట్టి, ,, ,,

ఐదవది—అందులోకి నంచుకోను మిరపగుం డేసి,

ఆఱవది.—తాగడానికి తెగబారెడు చుట్టిచ్చి,

ఏడవది.—తలకీ సన్నెకళ్లూ పాత్రాలూ ఇచ్చి,

ప్రథమ.— పెద్దనిద్ర పొమ్మాని పండుకోబెడదాం.

వారందఱు.— ,, ,, [అని నిష్క్ర.

పౌరులు.—యీళ్లెగో డేంటో మనకి తెలలేదు. రండి. రాయనింగారు మన మల్ని కాసేకాలం తప్పితే, మన మెల్లి రాయనింగారిని కాయాల, మనం కత్తులతోను కటారులతోను పొడవలేక పోతే, పొడిచేవోళ్లకి కావలిశినయి అందిత్తాం, నౌకరీ చేతాం; అందుకు రాయనింగారిని అడుక్కుందాం. [అని నిష్క్రమింతురు.

ప్రవేశకము సమాప్తము.

HYDERABAD-DN.

పంచమాంకము.

స్థలకము.—బుస్సీ డేరా.

(హైదరు, విజయరామరాజు, బుస్సీయు యథోచితము ప్రవేశింతురు.)

బుస్సీ.—ఏమి మహారాజా? ఈరాత్రివేళ కట్టు పంచెతోను కాలినడకతోను వచ్చినారు? హైదరుం గూడ తెచ్చినారు?

హైదరు.—ఈఛనము బొబ్బిలికోటమీదికి నడిస్తిమా, కోట పడతా మంట; ఈ రాత్రి తప్పితే బొబ్బిలి మనవల్ల గా దంట.

బుస్సీ.—అది యెట్లు మహారాజా?

రాజు.—డొంకలోనిపులి పొదలో చేరినది; తాండ్రపాపయ్య కోటలో లేఁడు, రాజాములో నున్నాఁడు. హర్కారాలచే రంగారాయఁడు అతనికిఁ బంపిన జాబు ఇదిగో. ఎటయినను మనరాక ఈగడియకో పైగడియకో అతనికి తెలియక మానదు; తెలిసినంతనే అతఁడు రాక మానఁడు; వచ్చినంతనే మనల నందఱను రూపుమాపక మానఁడు.

బుస్సీ.—[అప్రియముగాఁ జూచుచు] ఇసీ! ఆ హర్కారా లిట నున్నారా? వారివలన నింక నేమయినం దెలిసికొందము.

రాజు.— ఆహర్కారాలు ఇరువురు బికారివేసముల బిచ్చమెత్తుకొనుచు 11 పహరాలు దాఁటినారు. 12 వ పహరాలో మీరాసాహెబు వారిని అడ్డగించి, సోదా చూచి, వారి గోధుమరొట్టెలను విఱువ నుండఁగా, వారు ఆరొట్టెలను పెఱుకుకొన యత్నించి, వాని చేతినుండి తీసికోలేక, అజులుముచేత లేచిన మన సిపాయీలమీద, తమ కాసెకోకలలో దాఁచుకొనియున్న బాకుమాత్రముతో కలియఁబడి, సాయుధులను నూర్గురను పొడిచి, తాము పొడుచుకొని చచ్చినారు. మీరాసాహెబు నాకు ఆ రొట్టెలలోని యీజాబులను తెచ్చి యిచ్చినాఁడు.

బుస్సీ,— [ముక్కుపై వ్రే లిడుకొని] ఆహా! ఈబొబ్బిలిలో హర్కారాలే ఇంత పని చేసినారు! బంట్లు దొరలు ఏమి చేయుదురో! అయ్యా, ఇపుడు అంధకారము; తెల్లవాఱ నిందు. హర్కారాలు దొరకిరిగదా? ఇంక తాండ్ర పాపయ్యకు కబురు అందు ననుభయము లేదు గదా?

రాజు.—అయ్యయ్యో ! దొరగారూ ! ఏమి యిట్లు సెల విచ్చెదరు ! ఇట్టి హర్కారాల నందఱ నెన్ని దిక్కులకు వారు పంపినారో ? ఎందఱు తప్పించుకొని పోయియుందురో ? అంధకారమునకు 12000 మన్నె ఫౌజు చేతను ఇలాయీలు వేయించి పట్టపగలు గావించెద. ఎట్లును మీవలన నిపుడు కా దందురేని, నాకు సెల విండు ; నేను నాయూరి కేగి మీపేరు చెప్పుకొని బ్రతికి యుండెద.

హైదరు.—సర్దార్, రాయభారి అంతాపనిచేసినాడు! ఈహర్కారాలు ఇంతా పని చేసినారు. ఇంకా జోదులు దొరలు ఏమి చేస్తారో ! కన్క మన షిణేహితులు చెప్పేలాగ వారిని ఏమఱుపాటుగా కొట్టడం షరీ పని నాకీ తోస్తుంది.

బుస్సీ.—ఎవరురా అక్కడ?

దౌవారికుఁడు.—[ప్రవేశించి] ఏమి సర్కార్ ఆజ్ఞ ?

బుస్సీ.—పోయి క్షణములో సర్దార్ల నందఱను తోడ్కొనిరా ?

దౌవా.—చిత్తము సర్దార్. [అని నిష్క్రమించును.

(నేపథ్యమున కాహళము నూదుదురు.)

బుస్సీ.—ఏమి తంట తెచ్చెదరు రాజా మీరు ?

రాజు.—తంట తీర్చుపని నేను తెచ్చినది.

[సర్దారులు ప్రవేశింతురు.]

బుస్సీ.—కూర్చుండుఁడు. [అందఱు కూర్చుందురు.

బుస్సీ.—ఇప్పుడు మీరు బొబ్బిలిమీఁదికి నడువవలయును.

సర్దా.—ఏమి సర్కార్ ! ఇలాగ హుకుం చేసారు ! ఈ చీకటిలో ఈ నిద్ర మబ్బులో యలాగ నడుస్తాం ?

హైదరు.—మామూల్ లేనిమాట వచ్చిం దేమి మీనోట ? మన్కి చదుర్న ధిక్కరించిన పోగరుబోతులకి మన్మా ఏమఱుపాటమే కొట్టవాలా లేదూ!

రాజు,—నా 12,000 మన్నె సేనచేత, ఇలాయీలు, కాగడాలు, మతాబులు వేయించి మీకు పట్టపగలు చేసెదను.

హైదర్.—శబాశ్ ! అదీ షరి ! బలే మెహర్బాన్.

ముసేపనాల్.—[గాయము చూపుచు] ఆరాయభారిది వఖ్పోటు ఇద్దో సర్కార్ ; నేను నఖుజ్జాను బొబ్బిలిమీదికి. తెల్లవారేలోపల, వాడ్కి వాడిదొర్లకి నేను కర్కర్కర్కర్ కొయ్యవాలా వుంది. బొబ్బిలిజెండా తెగ్గొట్టి, మనజెండా ఎత్తకుంటే నాపేరు ముసేపనాల్ గాదు: నాకీ ఫిరంగివాత వెయ్యండి నేను బొబ్బిలి కొడితే నాకీ యేమీ యిస్తార్.

బుస్సీ.—6000 వరహాలు ఇప్పించెదను.

ముసే.—6000 వరహాలు నాకీ వద్దు. నేను బోనగిరి కొట్టినాకే, కల్లికోట కొట్టినాకే. ఇట్వంటి బీసాదిజీతానికి నేను కోటలు తియ్యలేదు. బొబ్బిలి ఏడుగడియలు దోపు ఇయ్యవాలా, ఇస్తే బొబ్బిలి కూలుజ్గాకే.

రాజు.—బళీ! బళీ! సర్కారుకు వరహాలు లాభము. ఇది మఱియు మంచిదే.

బుస్సీ. హైదరు.—అలాగే కానీ ;

ముసే.—మఱి నాపని చూజ్గాకే. సలాం, సలాం. [అని నిష్క్రమించును.

సర్దార్లందఱు.—సలాం ; సలాం ; [నిష్క్రమింతురు.

బుస్సీ.—లాల్ఖాకే, మఱి, ఏక్షణాని కాక్షణము సమస్తవృత్తాంతము మాకు చూచి వచ్చి స్పష్టముగా చెప్పుటకు సమర్థు లగువారిని అయిదార్గురను నియమింప వలయును.

లాల్.—చిత్తం. సలాం. [నిష్క్రమించును.

రాజు.—నేను వేషము మార్చుకొనెదను. నా సేన కేర్పాటు చేసెదను.

బుస్సీ.—ఈ రాత్రి నమ్ము చంపుటకు వచ్చితివి రాజా సీవు.

రాజు.—సలాము. [అని నిష్క్రమించును.

(నేపథ్యమున వెలుతురు.)

బూసీ.—ఆహా ; ఎంత వెల్తురు !

హైదరు.—ఘనంలో వేయించినాడు మహాల్ రాజా ;

[నేపథ్యమున బాకా ఖేరి, డంక నగరా, నౌబత్తు.]

ప్రథమ నివేదకుఁడు.—[ప్రవేశించి] సలాం, సలాం. ముసేవనాల్ కొలు చెప్పినారు. ఆయానసర్దార్లకింద 12,000 సిపాయిలు, 6000 పరంగులు, 6000 ఇంగిలీసులు, 13000 చట్కార్లు, 6000 వలందులు, 3000 బుడతకీసులు, 4000 గోసంగులు, నడుము గట్టినారు. వీరుగాక హిందూ తురక సిపాయీలకు లెక్క లేదు. కోట మీదికి నడుస్తున్నారు.

బుస్సీ.—మంచిది. [నివేదకుఁడు నిష్క్రమించును.

ద్వితీయ నివేదకుఁడు.—[ప్రవేశించి] సలాం, సలాం, మందుకొట్లకే శెల్వు అయింది. తోటాలు గీటాలు, పంచి పెడ్తావున్నారు.

బుస్సీ.—మంచిది. [ద్వి. నిష్క్రమించును.

(నేపథ్యమున)

[ఓరోరి, అహోబిళాన్ని, భూతనాథుణ్ణి, పెద్దగుండ్లతో మట్టకోట మీదికి మోర్జా చెయ్యండి. రామసింగును, లక్ష్మనసింగును, భేతాళున్ని, అనుమంతుణ్ణి, చిల్లపెంకులు, చిట్టిపురాళ్లు, మంగలకత్తులు, డబ్బుల తిత్తులు, ఏగానులు, గులకరాళ్లు గట్టించి వెలమలమీదికి మోర్జాచెయ్యండి. జంట ఫిరంగులు, జబరజంగులు, బోకుమారులు, జేటుఫిరంగులు, మగరదిండ్లు, అన్నీ తయ్యారు చెయ్యండి. కంచుఫిరంగులు గట్టించండి. చెకుముకి బారులు, 13000 తయ్యారు చెయ్యండి. 6000 జజ్జాయిబారులు, అనుపు దిద్దండి.]

ప్ర.—[ప్రవే.] విజయరామరాజాగారు యుద్ధం చూడడానికి ఏనుగ మీదికి దివాన్ హైదర్జంగుగారిని పిలుస్తున్నారు.

బుస్సీ.—పోవోయి; పోయి, తమాషా జూచిరా. [హైదరు నిష్క్రమించును.

ప్ర.—సర్కారు, తమ పటాలం వారందఱు తిరగబాటు చేస్తున్నారు.

బుస్సీ.—ఆశ్చర్యము ! ముందు నడవ వలసినవారే !

ప్ర.—కైపు లేనిదీ వారు ఏమీ చెయ్యలేరంట.

బుస్సీ.—అవును. మామాటగా బొడ్మిక్‌తో వారికి సారాయి మామూలుకొలత ప్రకారము ఇమ్మని చెప్పుము. [ప్ర. నిష్క్రమించును.

ద్వి.—[ప్రవేశించి] సర్కారు ! తమ పోల్జర్లు సారాయి తాగి కఫరు తప్పి ఒకరిమీదికి ఒకరు సనీలు దూసుకొంటున్నారు. ఇఖ క్షణమయినా ఆలశ్యం చెయ్యడం షరి గాదు. గుండు పారించడానికి ముసేఫనాల్ మూడో నెలవు అస్తుతారు. ఆకాశమంత కాగడాల పట్టపగల్ అయివుంది.

బుస్సీ.—వారిగుండు ముందు మిగిలిన బాగుగ నుండును. [గడియారము చూచుకొని] 12 గంట లయినవి.

(నేపథ్యమున ఫిరంగి మ్రోత.)

బుస్సీ.—[దద్దిరిల్లి శ్రవణ మభినయించి, కోపముతో] ఎవరురా మా కడపటి సెలవు లేకయే ఫిరంగియగాదు చేయించినాఁడు ?

ద్వి.—కోటలో జాముఫిరంగీ వేశివుంటాదు సర్కారు.

(అంతట హైదరు రాజును తత్తఱమునం బ్రవేశింతురు.)

రాజు.—[స్వగతము] ఈ ఫిరంగిచేత నాపని సాధించెదను [ప్రకాశము] ఏమి [illegible]రగారూ ! ఇఁక నేమున్నది ? వచ్చి పడ్డారు మనమీఁదికి బొబ్బిలివారు. ఫిరంగులు. [illegible] వ్రేసి కొట్టుచున్నారే !

బుస్సీ.—అది వారిఫిరంగి యని నిశ్చయమా ?

రాజు.—ఇంకను సందేహమా? ఎదుట నున్న, మమ్ము గుఱి పెట్టెదు రని మేము పరారి చేసి వచ్చినారము.

బుస్సీ.—ఓయి సిపాయి, ఇదే నాకడపటి యాజ్ఞ, [ద్వి. నిష్క్రమించును.

[నేపథ్యమున— కోలాకోలాలు.

ఫిరంగి ప్రముఖాగ్న్యేయాస్త్ర ధ్వనులు.—

మార్ ! మార్ ! ఫైర్ ! ఫైర్ !

ప్ర.—[ప్రవేశించి] మనఫిరంగీలు పేలినవి. కోటబురుజు లంతట మనుష్యులని పేలింది, సిబ్బందీలని పేలింది. మనవాళ్లు అన్ని పక్కలా ఒక్కమాటే కోట కూల్చడానికి ఫిరంగీలు కాలుస్తున్నారు. [అని నిష్క్రమించును.

ద్వి.—[ప్రవేశించి] సలాం సర్కార్, ధర్మారావుకీముందు మిగిలి ఆడంగులు లడాయి చేస్తున్నారు. బకాల్ బీబీలు సర్కార్ ! ఆళ్లు కొప్పులు విప్పి వెనకసిగలు దట్టంగా వేసి, పైటచెంగు నడుంకట్టు కట్టి, రాళ్లు రప్పలు వళ్లో కట్టుకొని, రోకళ్లు తీసుకొని, బోవారి స్త్రీలు కలపటమైనారు. రాళ్లు మనరాణువమీదికి గిరవాట్లు యేస్తారు. ఒడిశాలలతో కొడుతున్నారు. దగ్గిరికి యెల్లిన షోల్జర్లని మండీ యేసుకొని రోకళ్లతో పండబెడుతున్నారు. ఆళ్లమీదికి యెల్లినాడే సిద్దీబిలాల్ అఘూమర్గయా. సగము మంది సర్దార్లు బకాలుపేటమీదికి ఉడాయించినారు. కద్మ అందఱు బురుజులకాడ, క్రింద లడాయిమాని, ఈళ్లలడాయి తమాషా చూస్తావున్నారు. కోట మీద ఆళ్లకి దీపాలు లేవు. మనరాజాదీపాలు ఆళ్లకీ వెన్నెల వుంది. దానిచేత ఆళ్లు మనసర్దార్లకీ గురీపెడతారు. వఖ్ గురికి టకీసుల్తాన్ మర్గయా. మనగురికి ఆళ్లు కొంచెంకొంచెం అందుతారు ; ఎక్వా అందడం లేదు. సలాం. [అని నిష్క్రమించును.

బుస్సీ.—స్త్రీలు యుద్ధము చేయుటా ! సిద్దీబిలాల్ వారిచేత చచ్చుటా ? కోమటి స్త్రీలా ! టకీసుల్తాను దోరినాడా ! మేము ఎక్కడను ఇట్టిది యెఱుగము ! ఏమి యీగడ్డ బీరము ?

రాజు.—ఏమి ! నేను ముందే చెప్పలేదా ? నన్ను బట్రా జంటిరే మఱి ?

బుస్సీ.—ఏమయ్యా రాజా ? మావు స్త్రీలతో లడాయి చేయించెదవు నీవు ?

రాజు.—[సమందహాసము] ఓడిపోదు మని భయమా ?

బుస్సీ.—బలే జిత్తులమారివిగా నున్నావయ్యా ? ఆడువారితో జగడము అపమానము కాదా ?

రాజు.—[సమందహాసము] గెలిచిన మానమే.

బుస్సీ.—నీవు మానిసివి గావోయి ?

రాజు.—ఏ మన్నను సరియే.

హైదరు.—సాహెబు, నాకీ శెల్వు ఇయ్యండి, నేను ఆ తమాషా చూచి వొస్తాక్.

బుస్సీ.—చూచి వచ్చి మాకు చెప్పుము. [హైదరు నిష్క్రమించును.

బుస్సీ.—[రాజు నుద్దేశించి] ఏమి రాజా యీ స్త్రీలు ఇజార్లు అంగీలు తొడిగి డాలు తర్వారు పూని పోరుదురా ?

తృతీయ నివేదకుఁడు.—[ప్రవే.] సలాం సర్కార్, బకా ల్బీబీలు, వజ్రాల్ కెంపుల్ బంగారు జవాహరీ యేస్కొని, కాశ్మీర్ బనారస్ చీరల్ ముస్తీబుతో జిగ్జిగ్గా మెరుస్తా కోటబురుజుమీద కంటికి చూపడగానే, వారికీ పసారీలు తల్చుకొని మన తుర్కి సిపాయీలు వఖరికి వఖరు యెన్కకి మోచేతి పోట్లతో నెట్టుకొని తోసుకొని లగ్గలెక్తా వున్నారు. ఎక్డం తొందరలో సగం మంది కింద ఖందకం వుందీ లేదూ, అందులో పడ్డారు. తతిమ్మాసగం...[అను నర్ధోక్తిలో]

బుస్సీ.—స్త్రీలు త్రోయఁగా క్రింద పడి చచ్చినారు, ఇంతే గదా ;

తృ—బస్ సర్కార్. [అని నిష్క్రమించును.

బుస్సీ—మనమును చూతము వచ్చెదరా మహారాజా ?

రాజు.—నాకు క్రొత్త గాదు. మీరే చూడుఁడు.

ద్వి.—[ప్రవే.]సర్కార్ సలాం, బకాల్బీబీలు లగ్గలు యెక్నారే ఆసిపాయీల మీద తెర్లుతావున్న నూనె ఉడుకుమకు నీళ్లు, కాగుతావున్న అంబళ్లు పోసి 1000టికి, కళ్లల్లో మిరపగుండ గంపల్ గంపల్గా కుమ్మించి 15000టికి,కూల్చిన్యార్. తప్పించుకొని ఎక్కి కలియబడినవాళ్లని నోటీలో రోకళ్లతో గుమ్మి పడదోసిన్యారు. సన్నెకళ్లు, రోళ్లు, వేసి ఎందరినో, తల్కాయలు పగల్గొట్టిన్యారు. [నిష్క్రమించును,

[బుస్సీ ముక్కుపై వ్రే లుంచుకొనును.

చతుర్థ నివేదకుఁడు.—[ప్రవే.]సర్కార్, మనివాడు చంద్రోలు మహమ్మదు ఆ బీబీలతో కలియబడి మిరపగుండ మారెమ్మ కన్ను నిండి కబోదియై రోకటిదెబ్బకి ఖందకంలోపడి సచ్చిపోయినాడు. [నిష్క్రమించును.

బుస్సీ.—జిహోవా! జిహోవా! మేము పోరిన మే మేమగుదుమో !

[హైదరు రక్తవస్త్రములతో అంబటి తలతో ప్రవేశించును.]

బుసీ.—అరే ! ఎవరు నీవు ?

హైదరు.—క్యా సాబ్, నేను హైదర్జంగు కాదూ ? నాకీ తెల్వదూ మీకీ?

రాజు.—ఏమి సాహేబ్ ? మీరు పోరితిరా ఏమి? మీ యొడ లంతయు ఈ నెత్తు రేమి ?

హైదరు.—మేము పోరలేదు రాజాభాయి. బకాల్బీబిలపోరు సూడడానికి వెల్లి సిపాయీల నడ్మమే వున్యాం. బీబిలరోకళ్లకి వాళ్ల తల్కాయల్ పగిలి నామీద కురిశిన నెత్తుర్వానాకీ నావొల్లంతా యఖ్రా అయింది. మఱిపఖ్టీ, ఈపగిడీ ఈగర్మీచా ఈదాడీ లేకోపోతే, నామొఖం వుడ్కిపోయి వుంటుంది. ఆపిసాసీలు అంబలికి పోసినారయ్యా! నామొఖంమీద! ఆఖిమీడ! సూడడానికీ పోతే సావడానికి అయింది! ఈళ్ల మొగవాళ్లు బేరాలకీ పోయినారంట ; ఈళ్లు మనవాళ్లకి దంచుతావున్నారంటా అడ్డాఅడ్డా ఒకడు రెండు బీబిలు సస్తా వున్యారు సాబ్. నాకీ నోటీతెరిస్తే అంబలి నాఃక్కికీ లక్కిలాగా వస్తుంది ; నాల్కి కాల్తుంది ; అంటుకుంటుంది ! వదల్దు. తమాషా చెప్పడానికి వచ్చినాన్ ; కడుక్కొండాంకి లోపల్కిపోతాన్. [నిష్క్రా].

ద్వి.—[ప్రవేశించి] సిద్దీమక్కిలు, బకాలుబురుజు పట్టినాడు. బకాలుపేట అంతా దోపుడు అయింది. బీబిలు మాయమైనారు. [నిష్క్రా]మించును.

బూసీ.—మఱి మన మేల పోవుట ?

ప్ర—[ప్రవే.] సలాం సర్కార్. బొందిలిగూడెం, మన్నేగూడెం మాడిపోయి నవి. సాపుగా దోచినారు కాపుగూడెం మీదికి దౌడు తర్లీనారు. [నిష్క్రా]మించును.

చ.—[ప్రవేశించి] సర్కార్ సలాం. కాపుపేటలో షుకురుల్లా పోరుతాడు. కాపులు నాగేళ్లు, కాళ్లు, కఱ్ఱులు, గండగొడ్డళ్లు, కొడవళ్లు, గునపాలు, పాఱలు వీటితో కొడ్తారు 'అరే యిది బలరాముడి దెబ్బ సూడరా' అని కాపువాడు నాగేటితో కొట్తాడు. మనవాళ్లు 300 మందులు డింకకొడ్తారు. [అని నిష్క్రా].

[హైదరు అంబలి కడిగికొని ప్రవేశించును.

తృ.—[ప్రవే.] సర్కార్, వకనాగేలు కఱ్ఱుమొన షుకురుల్లా సాహెబుకీ పుఱ్ఱెలో దూరి ఆఖిమే బైటికివచ్చింది. ఇం కొకడు గడ్డపాఱతో తల్కాయ యెన్కకీకొడితే కాపువాడు నాగేలు లాక్కొన్నాడు. షుకురుల్లా తన్నుకొని గింజుకొని పీరులలో కలసిపోయి నిద్రపోతా వున్యాడు. [నిష్క్రా]మించును.

చ.—[ప్రవే. హైదరల్లీ నుద్దేశించి] సర్దార్, సాహెబ్, ఖిల్లాకి కుడి యెడమ అన్నివైపుల అగాడి పిచాడి లడాయి అయితుంది. వఖ్ సర్దార్ వఖిసర్దారుక్కి ఖుమ్మకుక్కి శెయ్యడానిక్కి లేదు. తమరు వస్తే కాపుపేట అయినా పడిపోతుంది, అని అనమరన్లీ సాహెబు చెప్తారు.

హైదరు.—నేను యేలడాయికి అయినా వజ్జానుగాని కఱ్ఱుషుకురుల్లా నాగేటి లడాయికి మాత్రం రాను. [చ. నిష్క్రా]మించును

బుస్సీ.—ఏమి రాజా ? మమ్ముల నందఱను ఇక్కడ గుండాన వైచుటకు తెచ్చినారా !

రాజు.—నేను ముందే చెప్పలేదా ? నన్ను బొబ్బిలివారి బట్రా జంటిరే !

చ.—[ప్రవే.] సర్కార్, మర్గయా అనమరల్లీఖాన్ ; మర్గయా సర్కార్ ; అనమల్లీఖాన్ ; మర్గయా : [అని నిష్క్రమించును.

ద్వి.—[ప్రవే.] సర్కార్, పేపేఖాన్ లెగిశినాడు. మనివాళ్లు ఇప్పుడు కాపు పేటమీాద ఫర్న్యారు. కాపుపేట వాళ్లకి కిందా వుంది. (అని నిష్క్రమించును.

తృ.—[ప్రవేశించి] మన హర్కారా వుండ్లే కూకూభాయి, ఆడు దారిలో బాణం తగిలి మర్గయా. మేం ఇంకా మర్గయాలేదు. (అని పో నుంకించును.

దౌవారికుడు.—అరే హర్కారా జవాన్, నీవు ఇంకా మర్గయా లేదూ అన్యావే, నీవు కూడా మర్గయా అయినావు పోయి; లేకొపోతే యెందుకి తెచ్చినావు పోయి ఆకూకూగాడిది షమాషారమ్ ?

తృ.—అరే మేము ఇంకా మర్గయా లేదూ అంటే !

దౌవా.—ఉందీ అంటే!

తృ.—అరే లేదురా అంటే !

దౌవా.—అరే ఉందిరా అంటే.

తృ.—నీకి ఇప్పుడు మర్గయా చేస్తాన్. [అని కత్తి దూయును.

దౌవా.—ఎగ్తాళికి చెప్పినాన్ భాయి.

తృ.—నీకీ యెగ్తాళీ వుంది, మాకీ సావు వుంది.

దౌవా.—అదే నేను చెప్పినమాట. పోభాయి పో. [తృ. నిష్క్ర]

చ.—[ప్రవేశించి] సర్కార్ సలాం, పెద్దబురుజు వుందీ లేదు, దాన్కి బేతాళం నామ్ చెప్తారు. ఆబేతాళబురుజుమీాదిక్కి మన్వాళ్లు నిచ్చెనలు వేసియెక్తారు; ఎక్కినంత మంది ఖందకం వుందీ లేదు కిందా ; అందులో పడ్తారు. ధూరాన్కి చీమల్బారు కన్పడ్తుంది. బారు ఎక్కుతుంది, నిచ్చెన జాడించినారు లాగ బారు పడిపోతుంది. ఎల్లుబంటిబారు ఎక్తుంది, కోతుల్బారు పడ్తుంది [అని నిష్క్రమించును.

[తృ. మిక్కిలి రోజుచు మహాసంభ్రమముతో ప్రవేశించును.

బూసీ.—ఏమిరా యీాయడావిడి?

తృ.—సాబ్! ఏమిచెప్పడం; పెద్ద ఫిరంగిగుండు నాకీభాఅని తర్మకొనివచ్చింది, బురుజుమీాదానుంచీ. నేను దాన్కికంటే ముందు రావాలకోసం బలేపగ్గుమేవచ్చినాన్, దాన్కి చేత గాభరా అయింది.

బుస్సీ.—[హైదరుతోను రాజుతోను జనాంతికము] వీఁడు తెచ్చు వృత్తాంత మంతయు ఇట్టిదిగానే యుండునా? [ప్రకాశము] ఏమిరా ఒడలు తెలిసి మాటలాడు చున్నావా?

తృ.—పోయి సూడండి సాబ్, ఇంకా అది యెన్క దిగబడే వస్తా వుంటుంది. ఇప్పటిక్కి మీకీ తగుల్తుంది.

బుస్సీ —పోరా మూర్ఖా.

తృ.—సాహెబ్, ఎన్ని ఫిరంగులు కొట్టినా గోడ దెబ్బకీ దెబ్బకీ వఖతులం పెళ్లి రాల్తుంది. గోడ పగల్దు, బొక్క పడదు. గుండు గుండు అక్కడ అడ్డ గ్రుచ్చుకొని గాండామురుగం తోలు మచ్చాల్ లేదూ, అదీలాగా వుంటుంది. దగ్గ్ర వెల్లడానికి పాంచిసీళ్లు, ఖంపు, అమ్న, బురద, వూబి, ఖందకం. దానిక్కమీద వంతెన కట్టి, ఖిల్లాకి బొక్కా చెయ్యడానికి పోతే, ఉప్పర్నుంచి, చాటుచాటుమే వుండి ఖాఫర్లు బడాబడా రాయిబండల్ దొర్లుతారు. మనివాళ్లు తుపాకులు లక్ష పేల్చినా, చాటుమేవుండే ఖాపర్కు తగల్దు. వఖ్వఖ్ ఖాపుర్ హగ్పడ్తాడు; వాడిక్కి దూరం గుండు తగుల్తాదూ లేదు; వాడు పడ్తాడూ లేదు. ఆఖాపుర్ గాడ్ని బాణం కిందికి భుర్రుభుర్రుభుర్రుభుర్రు వస్తుంది. వఖాన్కి వఖాన్కి వఖ్ఖు వఖ్ఖు మన దాడీవాలా మర్గయా. చీకటి చేసి, వంతెన వేశి బొక్కా కర్తాహే. బలే దళసరివుంది. బొక్కా అవతల్కిపోదు 'కోట పట్టలేము, ఖుమ్మక్కు కావాలా.' చెప్తారు ముసేటికితాక్ సాహేబు.

బుస్సీ.—లగ్గ లెక్కవారికి ఖుమ్మక్కు చేయు మను.

తృ.—బస్. [అని నిష్క్రమించును.

బుస్సీ.—హైదర్సాబ్. రాతికోటకంటె, ఇటికకోటకంటె మట్టికోట పడఁ గొట్టుట కష్టముగా నున్నది !

హైదరు.—ఇప్పుడు తెలుస్తా వుంది.

చ.—[ప్రవేశించి] సర్కార్ సలామ్, బేతాళ్ బురుజు మీ ఎదిరిరాణ్వ కిటకిట వుంది, వాళ్లసామికి రథం వుచ్చం లేదూ? అద్మి అద్మి నిండి ఆరథం వుంది బురుజు. ఆక్కడ ముత్యాలపాపయ్యంట వాళ్లకి సర్దార్. వాడు సింహం వున్నాడు సర్దార్. వాళ్లదీ పట్టాకత్తులు మనదీపా ల్మతాబులో తళ్తళా తళ్తళా తళతళా మెర్గుతుంది, అది తళ్తళా మన కన్నుకీ గుచ్చుకొంటుంది, మనకీ కబోదీ చేస్తుంది. నచ్ఛత్రం అంతా వఖ్ జాగామే చేరితే ఏమి వుంది అదీ వుంది బురుజుమీద. [నిష్క్ర.

ప్ర.—[ప్రవేశించి] మన్వాళ్లు బేతాళ్ బురుజు ఎక్కినాక్. వాళ్లకి వాళ్లకి లగాలగి మరామరి. [నిష్క్రమించును.

బుస్సీ.—ఇక పర్వా లేదు. బొక్కపడక పోయినను, మనవీరులు లోపల ప్రవేశించి సర్వ సంహారము చేయుదురు.

తృ—[ప్రవే.]ముత్యాలపాపయ్యా పట్టాకత్తి మన చంద్రోలు మహమ్మదుకీ కూడా లేదు. ఆ పాపయ్యచేతులో మన మూడూఖా న్మర్గయా ; దేదేఖాఁగయా ; దాదీఖాఁగయా;ణాణాబాయి,గుగ్గుమియా,లడ్డూసాబు,బర్ఫీసుల్తాన్, పేపేపైల్మాన్, అందఱు సఫాయి. [నిష్క్రమించును.

బుస్సీ—ఎంత సాదనాలు చేసినవారయ్యా యీబొబ్బిలి బంట్లు !

చ.—[ప్రవే.] ముసేఫనాల్ హాతీకి దిగి, లగ్గాకి యెక్కి, పాపయ్యతో కలపటమైనాడు. ఆళ్లకి యిద్దఱికి తడాఖా, అందఱు లబాయి మాని చూస్తారు. ఇద్దఱున్నూ అంతర్వల్లీ, దొంతర్వల్లీ, నాల్గేసి హాకాశపల్టీ లేశి, పార్వాపిట్టల్లాగ, ఆణ్ణి దాటి ఈడు, ఈణ్ణి దాటి ఆడు, పోతాడు. [అని నిష్క్రమించును.

బుస్సీ.—ఎంత సేపు ? ముసేఫనాల్ ఆలస్యం చేయండే ;

ప్ర.—[ప్రవే. హర్షముతో] సర్కార్ సలామ్, ముసేఫనాల్ తన పేరు చెప్పి ముత్యాలపాపయ్యని పేగులు వెళ్లబొడిచినాడు. వాడు నారాయణ నారాయణ అంటూ నేలకొరిగినాడు. [అని నిష్క్రమించును.

బుస్సీ.—బళీ ! బళీ ! ముసేపనాల్ !

తృ.—[ప్రవే. హర్షముతో] సర్కార్, ముసేపనాల్ వాళ్లజెండా తీసి, మన జెండావేశినాడు. వాళ్ల నౌబత్తు తోసి మననౌబత్తు మోగిస్తా వున్నాడు. [అని నిష్క్ర].

చ.—[ప్రవే.] అరే! రే! రే! దొంగదారిని వచ్చినాడు రంగారాయడు ఆ బురుజుమీఁదికి ! పట్టాకత్తితో ఊడుస్తాడు బురుజంతా. ఆయన్కి కోసం బలేకాగడాలు వేశినారు. 'బొబ్బిలియేటు సూడు, యెలమపోటు సూడు, రంగారాయడి రణరంగము సూడు.' అంటాయేస్తాడు. అంతా తిరువణ్ణామలె దీపోచ్చం అయింది. ఆయన షైమూం వున్యాడు సర్కార్! తుఫాన్ వున్యాడు ! ఇక్డవున్యాడు ! అక్డవున్యాడు! ఇక్డ లేడు ! అక్డ లేడు! అక్డా యిక్డా కూడా వున్యాడు! మల్లీ ఇందర్జాలం వున్యాడు, మల్లీ కంటికి హగ్పడ్తాడు, గుటికి హగ్పడడు. ఆయ్న ఎక్డ కన్పడ్తే అక్డ ఈరాజాగారి వం దంతా శరణు చెప్పేవాడు, దండం పెట్టేవాడు, దద్దిరిల్లి కందకంలో పడేవాడు. ఆయన సొంతచేతితో కత్తితో నరుకుతాడు ; గాలి నఱుకు తాడులాగ నరుకుతాడు. మంచి మంచి సిపాయి ఆయన్కి కొట్టడానికి పోతాడు, సలాం శేస్తాడు. ఆ మూర్ఖాన్ అద్మీ అద్మీకి గొంతు కోసి తల్లకిందు చేసి, నెత్తురువానలు కురిపిస్తాడు. నిలువు పెంటప్యాలు ఆయన్కి చుట్టు జౌతుఖానాలు. అవే నెత్తురు చిచ్చుబుడ్లు ఆయన్కి చుట్టు.

[అని నిష్క్రమించును.

హైదరు — సర్దార్, నేను మళ్లీ యెల్లి సూశి వొస్తాక్. [అని నిష్క్ర.]

బుస్సీ. — ఎంతసేపు ఆడఁగలఁడు ఈదొమ్మరియాట ?

తృ. — [ప్రవే.] సర్దార్, రంగారావు ముసేఫనాల్కి ఐదుకీ ఆఱుకీ వఖ్ గుదీగా ఈటెపోటుచేసి కందకంలో కూల్చినాడు. అతని ఎడమ్కాలి తన్నుతో మనఘంకా ఆకాసానికి పోయింది. మనఫౌజుమే ఎవడితల్కాయమే పడింది. అతని జెండా ఎగురుతుంది. ఇఫ్ఫు అద్దో ఆమోగేది ఆయన్ది నగారా. [నిష్క్ర]మించును.

బుస్సీ. — బళీ; బళీ; మహావీరుఁడు! మహావీరుడు! ఆయనతో మనకు యుద్ధము కంటె సఖ్యమయిన బాగుగా నుండును.

ప్ర. — [ప్రవే.]మనిసర్దార్లు పదితూర్లు తెల్లజెండా యెత్తితే 'మీా కేమిరా ఆడపిల్లలా?' అంటా, అతనిబంట్లు యెఱ్ఱజెండా లెత్తినారు. [నిష్క్ర]మించును.

బుస్సీ. — హా ! హా! బలారే ! బలారే !

ద్వి. — [ప్రవే.] మళ్లీ బేతాళం బురుజు మీాదికి నడ్పితే, ఎవరు పోవడం లే దని తిర్గుబాటు చేస్తారు.

బుస్సీ. — హైదరుజంగును నడుపు మను. [ద్వి. నిష్క్ర]మించును.

[హైదరు జంగు చినిగిన నగారా కుండ నెత్తికి తగుల్కొని యుండ రక్తవస్త్రములతో ప్రవేశించును.]

బుస్సీ. — ఎవర హోయి నీవు, ఇట్లు పెద్ద జీక్ వచ్చినట్లు వచ్చుచున్నావు?

హైదరు. — ఏం సర్దార్, నాకీ తెల్వదూ మీాకి? మన నగారాకుండ రంగారావు ఎడ్మాకాలితో తన్నితే, ఎగిరి వచ్చి నాతల్కాయమీాద పడి, చిన్గి గుచ్చుకొని వుంది. తల్కాయ లాక్కోవడానికి రాకుండ వుంది.

[నౌకరులు హైదరుతలనుండి కత్తితో తోలుం గోసి కుండం దివియుదురు.

బుస్సీ. — ఆశ్చర్యము ! అది నీతలకాయమీాఁదనే పడవలయునా !

ప్ర. — [ప్రవే.] సర్దార్. రాజా తమ్ముడు వెంగళ్రావు కోటబైటికి, 500 బంటు 150 గుఱ్ఱంతో తరలినాడు. కొండబోటుమీాదుగా మనదేరాలమీాదికే వస్తావున్నాడు.

బుస్సీ. — దారిలో మన గుఱ్ఱపు దండు వున్నది. పర్వా లేదు. [ప్ర. నిష్క్ర].

చ. — [ప్రవే.] సర్దార్, వెంగళ్రావుకి మనగుఱ్ఱం ఎదుర్కొన్నది. 2000 గుఱ్ఱం సఫాయి. ఆయన్కి, 100 గుఱ్ఱం, 150 మంది సిబ్బంది మర్గయా. ఆయన ఫిరంగిగుండు వస్తుంది లాగా కొండబోటు మీాదుగా వస్తున్నాడు.

బుస్సీ. — పర్వా లేదు, అక్కడ నున్నది ఫిరంగీల యనుపు. [చ. నిష్క్ర]

బుస్సీ.—[స్వగతము] ఏమి యాశ్చర్యము ! ఇంత గుఱ్ఱపుదండు నాశమైనందు లకు నైజాముగారికి ఏమి చెప్పగలము ?

ద్వి.—[ప్రవే.] సర్కార్, వెంగళ్రావు 50 గుఱ్ఱాలు 350 కాల్బలంతో కొండ బోటు మీదికి రాగానే, వారిమీదికి ఫెళ్ ఫెళ్, ఫెళ్ ఫెళ్, మోగినయి మన జజాయీల బార్లు. ఢామ ఢామని అగాదయినయి మన ఫిరంగీల బార్లు. 50గుఱ్ఱాలునఫాయి! 150గురితో ముందట మీకాడికి రాయిబారం వచ్చినాడే దర్మారావు ఆయన కూలి పోయిన్నాడు.

బుస్సీ.—అది చాల మంచిది మనకు. [ద్వి. నిష్క్ర]మించును.

[బుస్సీ డేరాపై గుండ్లు పడును.

బుస్సీ.—ఆరే ! ఇ దేమి మా డేరా మీదికి ఫిరంగిగుండ్లు ? ఎవరు కాల్చినవి ? అపాయముగా నున్న దే !

ఒకకింకరుఁడు.—[ప్రవేశించి విజయరామరాజు నుద్దేశించి] దండం హా ప్రభో ! ఏలినవారి డేరామీద ఫిరంగిగుండ్లు పడుతున్నయి. డేరా కాలిపోతా వుంది. పదిమందికి గాయాలైనయి.

రాజు.— [స్వగతము] ఇవి ఎట్లు వచ్చినవి మా డేరామీదికి ? వారికి ఫిరంగులు లేవే ? [ప్రకాశము] పోయి అరుసుఁడు. [కింకరుఁడు నిష్క్ర].

ప్ర.—సర్కార్, వెంగళ్రావు అగాదు మీదుగానే ఫిరంగీలపై పడినాడు. మనఫిరంగిబార్లకి వెనక తిరిగి వచ్చి పటాలరాముడు వాటిమీద దుమికినాడు. ఇద్దఱు వెయ్యిమంది జనానికి ఫిరంగి బారులవాళ్లకి అందఱికీ పొడిచి, నఱికి, చంపి, ఆఫిరంగులే అడవికి పారిపోయి మళ్లీ వస్తావున్న మనపౌజుమీదికి తిప్పి కాల్చి పౌజునంతా నాశంచేశారు. మీ డేరాల మీదికి కూడా తిప్పినారు. [అని నిష్క్ర]మించును.

బుస్సీ.—ఇప్పుడు ఫిరంగిగుండ్ల కారణము తెలిసినది. అయినను భయము లేదు. దారిలో ఆరా బున్నది.

తృ.—[ప్రవే.] సర్దార్ 200 మందితో వెంగళ్రావు, పటాలరామయ్య, తుపాకి మందు పరిశిసమైధానం మయానికి దుమకగానే ముసేటక్కి తార్ ఆరాబుకి నిప్పు పెట్టి న్యాను. దొర, రామ్య: వారిగుఱ్ఱాలు, వఖ మస్సి తప్ప అంతా భగ్ భగ్. [నిష్క్ర].

బుస్సీ —ఇఁక పర్వాలేదు. ఒంటిగాంఁడు వీ రేమి చేయఁగలరు ?

ప్ర.—[ప్రవే.]సర్దార్, పటాలరాముడు లాడూఖాన్ కలపట మైనారు; గుఱ్ఱాల మీదనే పరవళ్లు దొక్కుతారు. లాడూఖాన్ చేలి యీటెపోటికి రాముడు చచ్చి పడిపోయినాడు. వెంగళ్రాయడి యీటెపోటుకి లాడు పడిపోయినాడు, బది కేఖ్రన్నాడు.

[అని నిష్క్ర]మించును.

బుస్సీ.—మంచిది.

రాజు.—[స్వగతము]

క. తురకలవీరులు పలువురు
మరణంబుం బొందినారు ! మాటికి నన్నుఁ
గరకర కనెదరు ఖానులు ?
గిరిని బిడుగు లట్లు నన్నుఁ గెడపుదు రేమో ? ౬౨

వెంగళ్రావు.—[ప్రవేశించి రక్తవస్త్రములతో గాయములతో అతి క్రోధమున] ఎక్కడరా ఆవిజయరాముఁడు ? ఏఁడిరా విజయరాముఁడు ?

[ఎల్లవారును సంభ్రాంతులై లేతురు.

రాజు.—వెంగళ్రావు! [అని కేక వేసి గునగున పలాయితుఁ డగును.

వెంగళ్రావు.—నన్ను తప్పించుకొని పోఁగలవఁటరా? [అని తఱుమును; బుస్సీ లోనగువారు వెంగళ్రావును పట్టుకొని ఆఁపుదురు ; హైదరుజంగు దూరముగా నుండి చూచు చుండును. వెంగళ్రావు మూర్ఛితుఁడై పడిపోవును.]

బుస్సీ.—హాహా ! హాహా ! లేవ వయ్యా మహావీరుఁడా. లే వీర లోకాలం కారమా లే.

[వెంగళ్రావు మూర్ఛ తేరును.

బుస్సీ.—సేవకులారా, ఈయనను వైద్యశాలకుం గొనిపోయి రాజువలన ఈయనకు అపాయము గాకుండ చూచుకొనుచు, మందు లిచ్చి, మాకుఁ దెలుపుఁడు.

[సేవకులు వెంగళ్రావునుం గొని పోవుదురు.

బుస్సీ.—ఇట్టిమహావీరులతో ఏల పోరు పెట్టుకొంటిమి!

సేవకులు—[ప్రవే.] సర్కార్, ఆయన తేరినాడు ? 'వకరిచేత చావవలిశిన ఖర్మం మాకేమి ?' అని పలికి బాకుతో ఱొమ్ములో పొడుచుకొని కాలంచేశినాడు,

బుస్సీ.—జిహోవా ! జిహోవా ! ఈబొబ్బిలి సూర్యచంద్రులలో చంద్రుఁడు ఈయస్తగిరిం గ్రుంకినాఁడు ! రండి, మనమందఱము పోయి ఆ మహావీరుని చూతము. ఎన్ని గాయములు తగిలినవో, ఎంత బలాఢ్యుఁడో, ఎట్టియాకారమువాఁడో, చక్కఁగా చూతము. ఆయనను చూచి నేను మాదేశమున మాప్రభువుల యెదుట ఆతని రూపపరాక్రమములను వర్ణించెదను.

[అందఱు నిష్క్రమింతురు.

షష్ఠాంకము.

[రంగారాయఁడు పెంష్లికుమారులతోను, ఇతర బంధువులతోను, పరివారములతోను, సపరివారుఁడై నిండోలగంబుగా ప్రవేశించును.]

రంగా.—చెలికాని వెంకయ్యా, మనము బురుజు దిగి వచ్చుచున్నపుడు, పరాసు వారిడేరాకు కొండబోటునకు నడుమ కొండంత మంట ఎగసి మాయమైనదే, అదేమి? నల్లమందు పఱపా ?

చెలికాని వెంకయ్య.—అవును మహాప్రభూ. దానిలక్షణ మట్టిదే ;

రంగా.—అచట పెంగళ్రావు పోరుచుండెనా?

వెంక.—అట్టి దేమి లేనిచో ఏల నల్లమందు మారమ్మ అట్లు మండును ?

సభ్యులు.—ఈ నల్లమందు మారమ్మముందు ఆఁగలేక యున్నాము బాబూ !

రంగ.—మాయదృష్ట మెట్లున్నదో ?

[అంతట నల్లఁబాఱిన మానిసి యొకఁడు వడివడిగా, లేచుచు పడుచు ప్రవేశించును.]

నల్లమానిసి.—దండం మహాప్రభో, దండం, యెంగళబాబు యీరస్వార్గంయెల్లి నారు బాబూ.

రంగ.—హా ! హా ! హా ! [అని మూర్ఛిల్లి, తేరి, అరసికొని,] నీ వెవరవురా ?

నల్లమా.—నేను వారి బంటుని, జక్కణ్ణి, ఖబురు చెప్పడానికి మిగిలుండ మంటే మిగిలి వచ్చినాను బాబూ.

రంగ.—మాతమ్ముఁడు మా కేమియు చెప్ప లేదటరా ?

జక్క.—అన్నయ్యగారు నారణయిహారం సూడకైరి గదా అన్నారు బాబూ. నేను శెప్తా నని మనివి చేసుకొన్నా.

రంగ.—ఏమిరా ఎట్లు పోరినాఁడురా నా తమ్ముఁడు ?

జక్క.—శినబాబు మొగలాయీవాళ్ల గుఱ్ఱాలని రెండువేలని సవార్లతో తెగ నఱికినారు. 1000 ఫిరంగీలవాళ్లనికూల్చి ఆఫిరంగీలు పరాసులమీదికి తిప్పించి కాల్పించి నారు. అప్పటికే మిగిలిన మాతో ఆళ్ల డేరాలమీదికి వురికే తలికి నడమ నల్లమందు మారెమ్మమంటలో అందఱము మాడిపోయినాం. శినబాబూ నేను మిగిలినాము. ఆనక బుస్సీడేరాలోకి విజయరామరాజు కోసరం యెల్లి ఆయన్ని తఱుముకపోయి శినబాబు మూర్ఛపోయినారు. ఆళ్లచేతులలో తెప్పిరిల్లి ఆళ్లు ఎంత బతిమాలుకొన్నా యినక, రాజుని వొదలనని లగువు చేసిపడి యీరస్వార్గానికి యెల్లినారు, బాబూ.

[అని సొమ్మసిల్లి కూలును. నౌకరులు వాని బయటికిం గొనిపోవుదురు.

రంగ.—[ఱిచ్చపడియుండి] హాహాహాహా ! ఎపుడును నా యనుచరుఁడవుగా నుండువాఁడవు ; ఇప్పుడు నాకన్న ముందు నీవు ఎట్లు వీరస్వర్గమునకు వెళ్లితివయ్యా ! హాహాహాహా ! నా యదృష్టము !

రంగ.—అన్నలారా, పడవాళ్లారా నాకుడిభుజము విఱిగిపోయినదే! ఇఁక నే మున్నది ! వెంగళ్రావు పోయిన పిమ్మట ఇంక నేమి బొబ్బిలి !

[ఫిరంగియగాదులు, నౌకరులు సంభ్రాంతులై ప్రవేశింతురు.]

నౌక.—మహాప్రభో, పరాసుల ఫిరంగిగుళ్లు వచ్చి కోటలోనంతా పడతా వున్నయి, లోగిళ్లు కూలిపోతావున్నయి. గుళ్లదెబ్బలకు మన సోభత్తువాళ్లు నాశమై పోయినారు. మనజెండా ఏమయిందో తెలవకుండా యెగిరిపోయింది.

[రంగారాయని మ్రోల దివాణములో ఫిరంగిగుండ్లు పడును.

రంగ.—హాహా ! అయ్యా, పెండ్లికుమారులారా, ఓబంధువులారా—

సీ. పెండ్లికై విచ్చేయఁ బిలిచికొంటిని మిమ్ము ;
నిట నిట్టు లగు నని యెఱుఁగనైతి!
దురమునకై మిమ్ముఁ దోడు వేఁడఁగలేదు,
దైవంబు మా కిప్డు దాయ యగ్యె.
మముఁగూర్చియే కదా మలకలు వచ్చిరి,
వారికి మీమీఁద వైర మేమి ?
దారికి సామగ్రి దయసేసి కైకొని
సకుటుంబముగ మీరు సాగిపోండు

ఆ. 'పెండ్లికతమున మేము బొబ్బిలికి వచ్చి
యేఁగుచున్నార' మనినఁ, బోనిత్రు మిమ్ము.
మిగిలియుండుఁడు నేమాన మీరలేని;
మాకొఱకు మీకు సంఘాతమరణ మేల ? ౬౮

[పెండ్లికుమారులు రాజబాంధవులు అందఱు ఉగ్రవీక్షణులై నిష్క్రమింతురు.

రంగ.—వెంకయ్యా, ఏమి? వీరు బదులు చెప్పకయే లేచిపోయినారు ?

వెంకయ్య.—మహాప్రభూ, వారి గాంభీర్యము మీకు తెలిసినదే గదా ?

ఆ. ప్రాణ మిచ్చునట్టి బంధులు గాపునఁ,
బ్రాణబంధుసంజ్ఞఁ బడసినారు ;

మిత్తి నైనఁ బోర మీఁకై పొడుచువారు,
తొడుగు తొలఁచుకొంటకుఁ దొలఁగినారు. ౬౯

రంగ.—ఆహాహా ! ఏమి వారి యనురాగము ! ఏమి తెగువ ! నాకుం గూడ వారు మార్గదర్శకులైరే. నాకును స్వయముగా వదలించుకోవలసిన తొడుగులు కలవు గదా ? అంతఃపురము నగ్లకే దారి చూపుము.

వెంకయ్య.—ఏలినవారు ఇటు రావలయును. [రంగ-వెంకయ్య-నిష్క్ర.)

స్థలకము.—అంతఃపురము.

[పెండ్లికొమారితలు, మల్లమ్మదేవిగారును ఉపవిష్టలై ప్రవేశింతురు.
పెండ్లికుమారులు సంభ్రమమున ప్రవేశింతురు. పెండ్లికొమారితలు లేతురు.

మల్లమ్మ.—ఏమి నా ప్రాణములారా ! ఇట్లు మీ రొక్కుమ్మడి అంతఃపురము ప్రవేశించిన కారణ మేమి ?

పెండ్లి కుమారులలో నొక్కఁడు —దేవిగారికి! ఇవి మా కడపటి దండములు. వెంగళ్రాయనింగారు వీరస్వర్గమునకు వెళ్లినారు. రంగారాయనింగారు కోట వెలుపలకు రాజుతోను, పరాసులతోను, కలయఁబడుటకు తరలుచున్నారు. పరాసులు బొబ్బిలి కోటను కూల్చుచున్నారు మఱి మే మేలవచ్చితిమో తమకు చెప్పవలయునా?

[వెంగళ్రాయని భార్య సుభద్రమ్మ శోకించును.

రాణి.—అమ్మా, సుభద్రమ్మా, నాబంగారు చెల్లెలా, నీ ప్రాణేశ్వరుఁడు రవంత ముందు పోయినందులకు దుఃఖించెదవా ? ఈసమయములో మనకు దుఃఖము పనికిరాదు నాకూనా. నాముద్దుఁగూఁతులారా! మా ప్రాణేశ్వరులతో మీ ప్రాణేశ్వరులు వీర స్వర్గమునకు తరలియున్నారు. మన మచటికి ముందుగాఁ బోయి వీరు విజయంచేయు సమయమునకు గృహోత్సాలంకారములు గావించుకొని వీరికి స్వాగతము చెప్పవలదా ? ఎవరి దొరను వారు, తొలిచూపే కడసారి చూపు మాచుకొని, తొలిదండమే కడసారి దండము పెట్టి, ముందుగా తరలుఁడు.

[పెండ్లి కొమారితలు భర్తలకు ప్రణమిల్లి లేచి వారిబాకులం గైకొందురు.

[నేపథ్యమున]

'గోవింద గోవింద, నారాయణ, నారాయణ. [అందఱు ఆకర్ణింతురు

రాణి.—ఆహా ! పెద్దవారు అందఱు మనకన్న ముందుగానే తరలినారు ! వెనుకఁ బడుట మనకు అవమానము గాదా ? ఇదిగో నాకు నా ప్రాణేశ్వరులు ఇచ్చిన బాకున్నది. సుభద్రమ్మకు వెంగళ్రావు ఇచ్చి పోయిన బాకున్నది.

స్త్రీలు అందఱు.— (గేయము.)

భారతీ దేవిరో, భార్గవీ దేవిరో, పార్వతీ దేవిరో;
దీవింపుఁ డీమమ్ము దీనలను మాయ దీనలను దల్లులారా!
వీరపత్నుల మమ్ము వినక కనక ముందే
విడనాడు చున్నట్టి వీరే;
ప్రతిజన్మ మందుమా ప్రాణనాథులుగాఁగ
వరమొసంగుఁడు తల్లులారా!
మాకిట్టి వంతలు మరలరా కుండఁగ
మముఁగావుఁ డీతల్లులారా!
కడపటి మా మ్రొక్కు గైకొని మామీఁద
కనికరింపుఁడు తల్లులారా!

[అని బాకు ఱొమ్మునకు గుఱిచేసి కొని]

రంగరంగ శ్రీ రంగారంగా కావేరి రంగా
కమలా కాంతా మనోజ్ఞ భృంగ కస్తూరి రంగా.

[అని పొడుచుకొన నుంకింతురు. తెర వ్రాలును, తెరలో "గోవింద గోవింద, నారాయణ నారాయణ" పెండ్లికుమారులు బాకులు తుడుచుకొనుచు పూర్వస్థానమునకు వత్తురు. ఇతరులును అట్లే వత్తురు. [రంగారావును అట్లే ప్రవేశించును.

రంగ.—అయ్యలారా, మాయన్నలారా, మాతమ్ములారా, నాబంగారులారా,

సీ. విజయ బంధువులార, వేజన్మముల కైనఁ
దీర్చుకోనేర మీ పేర్చు ఋణము.
చేతు లారంగఁ బూజించితి మెవ్వారి,
ఖండించితిమి వారి ఖడ్గధార!
లీలలు మీఱ లాలించితి మెవ్వారి,
బడఁద్రుమ్మితిమి వారి బాకు మొనల!
ఆఁకఁబుడుపు లేదు! హతమయ్యె మగకూన!
కోట పాడయ్యె నింకేటి కీచట!
తే. నాదు ప్రాణంబు వెంగళ నాయకుండు
న న్నెదురు సూచు చున్నాఁడు కన్ను నొవ్వ,

అరుల బొందుల మీఁదుగా నతనికడకు
క్షణములోఁ జేరుదము రండు రణపథమున. ౭౧

[వెంకయ్య ప్రవేశించును.

రంగ.—వెంకయ్యా, ఏమిచేసి వచ్చితివి ?

వెంకయ్య.—మహాప్రభూ! ఎల్లవారితొడుగులు వదలించి వచ్చితిని.

సీ. వరవృషలుం గూడ వలసపో నొల్లక
యిటనె యీల్గఁగ నిశ్చయించుకొనిరి!
పండ్రెండును *బడాలు వారి గృహంబులు
ఖాలి సేయించి యాబాలముగను
తెలగా పడంతుల, వెలమ మడంతుల,
లోనికిఁ దోలి, తల్పులు బిగించి,
తోరంబుగా నన్ని చూరుపట్టెల వెంటఁ
జిచ్చు లంటించి, నేవచ్చినాఁడ.
తే. గవను తెరచి మనము గడచునప్పటికి భూ
చక్రమునకు నాక చక్రమునకు
మంటయిరుసు గూరి మనకంటికగపడు,
నేల తడయ నింక నేలినవార. ౭౨

రంగ.—[ఆత్మగతము]

తే. విజయరాముని కోర్కియే విజయ మొందె!
పాపి పింజారి హైదరు పలుకె నెగ్గె.
బొబ్బిలిగడీని బాడిడి పోటుమగఁడు
రంగరాయండు వెడలె గౌరవము దక్కె. ౭౩

ఆహా! ఆహా! ఆహా! [ప్రకాశము.] వీరాగ్రణులారా! మనము పరాసుల డేరా మీఁదికే పోదము ; మఱి తరలుఁడు. గోవిందా, హరి గోవిందా.

[అందఱు 'గోవిందా హరి గోవిందా' అని అఱచుచు వికటముగా నిష్క్రమింతురు.

---

* పా. బటాలు.

సప్తమాంకము.

స్థలకము:—బుస్సీ డేరా.

అంతట బుస్సీయు విజయరామరాజు ప్రభృతులును ప్రవేశింతురు.

[నేపథ్యమున మహాప్రకాశము కలుగును.]

బుస్సీ—[సంభ్రమమున] రాజా, ఇదే మయ్యా, ఇంత వెల్తురు ?

[రాజును బుస్సీయు పరిక్రమించి పరికించినట్లు అభినయించి కూర్చుందురు.

బుస్సీ.—ఏ మయ్యా ఆజ్వాల ? కోటయంతటను మంటికి మింటికి అంటి యున్నది.

రాజు.—దొరగారూ, ఈ వెలమవాని గర్వము మీ కేమి తెలియును? బయట మనతో యుద్ధము, లోపల 50 పెండిండ్లు. ఈ జ్వాల యతని బాణసంచాలమంట.

బుస్సీ.—ఏమి యాశ్చర్యము ! ఏమి యాశ్చర్యము ! 50 పెండిండ్లు! ఇదే సమయమని తెచ్చితివయ్యా ముట్టడి ! ఆహా ! ఆహా !

ప్ర.—సర్దార్, రంగారావు 700 మంది సిబ్బందితో కోట నుంచి మీ డేరాల మీదికి దూకినాడు. దారిలో లాలు ఖుమంబాను అడ్డినాడు. అక్కడ వారికి వీరికి లగాలగి మరామరి.

బుస్సీ.—లాలుతో చెప్పుము, రంగారావును ప్రాణముతో ఇక్కడికి తెమ్మని.

ప్ర.—సర్కార్ ఆజ్ఞ. [అని నిష్క్రమించును.

[అంతట హైదరుజంగు, వేంకటలక్ష్మిని చిన వేంకటరాయని జవానులచే పట్టించి తెప్పించి బుస్సీయెదుట నిలుపును.

బుస్సీ.—ఎవ రయ్యా వీరు హైదరుసాహెబు ?

హైదరు.—అయ్యా, ఈ బచ్చాకి తీస్కొని ఈమన్సి కోటకాడినుంచి యెల్తా వుంది. సోల్జర్లు అడ్డంవస్తే, వరహాలు సల్లుతుంది. వాళ్లు వాట్కి రాజాయిళాయి యెల్తుర్లో యేరుకొంటా వుంటే, ఇది తప్పించుకొని పారిపోతా వుంది. వరాలు గిరాలు చూచి బొబ్బిలి జమీన్దార్ ఇంఖా బచ్చాకీ తల్చి, అవిదొరకనివాళ్లు మనసిపాయీలు యీళ్లకిని పట్టుకొని ఇక్కడికి లేబోతే, యిది బాకుకే నూసి లడాయి చేస్తుంది. 100 మందిని కుమ్మింది. చూడడానికి దాసీవుంది, సాముగరిడీలకీ బురాక్ వుంది. పిల్లవాడికి తుపాకి వాత వేస్తామంటే అప్పట్కి యిది మమ్మల్కి సంపడం మానింది. మీరు మాటలాడ వొచ్చును.

బుస్సీ.—ఎవ రమ్మా మీరు ? సంకోచము లేకుండ ఉన్నమాట చెప్పుఁడు. మీకు నేము కీడు చేయము. ఇంత బీరము గల యాఁడువారికి ఎవ్వరైనను గౌరవము చేయవలసినది.

వెంకట.—అయ్యా, మీరే బుస్సీదొరగా రని నాకు తోఁచుచున్నది. వారే విజయరామరాజుగారు. కానిండు. నేను బొబ్బిలి రంగారాయనింగారి జనానా దాసీ జనము ముప్పది ముగ్గురిలో తలదాసిని. ఈ కూన చినవెంకటరావు మాయేలిన వారికి ఒక్కఁడే కుమారుఁడు. ఈయనను ఈయనతల్లి మల్లమ్మదేవి మమ్మేలినతల్లి ఈ రాజుచేతఁ జిక్కనీయక సాముర్లకోటలో చెల్లెలియింట్లో చేర్పు మని నాకు అప్పగించినది. నేను ఒప్పుకొని 'నాకొంటిలో ప్రాణ ముండఁగా' బాలునికి అపాయము లేదని పలికి, బాపన బాలునివేషాన కొనిపోవుచుండఁగా, మీ మ్రోలకు మమ్ము తెచ్చినారు. మీరు దొడ్డవా రిఁక. అటుపైని మీ చిత్తము.

బుస్సీ.—బళిబళి ! నీవు వారిపాలిటి ధర్మదేవతవు, మిమ్ము నేను రక్షించెదను.

రాజు.—ఛీ ఛీ ! ఈ బాలుని ఏనుఁగు కాలిక్రింద మట్టించి నేలఁ గలప వలయు బూసీదొరా !

బుస్సీ.—ఏమి పాపాత్ముఁడవు రాజా! అట్లు పలికెదవు !

రాజు.—బొబ్బిలిపురుగు మిగిలిన, నిన్ను నన్ను ఇఁక నుంచునా ?

బుస్సీ.—ఇంత ద్రోహము తలంచిన, నీ నెత్తిపైని దేవుఁడు పిడుగు వైచును జుమా. నౌకరులారా ! వీరిని గౌరవముగా విచారించుచు, సుఖముగా, మా డేరాలోనే, మాపడకగదిలో నుంచుఁడు.

[నౌకరులతో వేంకటలక్ష్మి బాలుంగొని నిష్క్రమించును.

ప్ర.—సర్దార్; యుద్ధం మాని పది తెల్లజెండాలు వేసుకొని సమీపించి రాయనింగారితో 'వీరాగ్రేసరా, మీతో బూసీదొరగారు సఖ్యం కోరుతూ వున్నారు; మీరు ప్రాణంతో వారి దగ్గిరికి విజయం చేయవలెను.' అని కోరితే, ఆలాగే వస్తాము విజయరాముణ్ణి మాకాడికి పెస్తే, అందాకా పోరుతూనే వుంటాము; మీరు దోరుతూనే వుండండి.' అని మళ్లీ మన దండును రూపుమాపుతా వున్నారు.

బుస్సీ.—మరల పోయి ఆయనతో 'అయ్యా, మీకుమారుని బాలుని చినవెంకటరావును దాసి వేంకటలక్ష్మి సాముర్ల కోటకు కొనిపోవుచు మాకు పట్టుఁబడినది. వారిని మేము కాచియున్నాము. బాలుని క్షేమముగా మీ కందించెదము, సఖ్యము చేసికొన దయ చేయవలయును.' అని వేఁడుకొని తెండు.

[ప్ర. నిష్క్రమించును.

చ.—సలాం సర్కార్. రంగారావు కుడి బుజం తెగిపోయింది, యెడ్మ మోకాలికి తుపాకిగుండు తగ్గి మోకాలు పగ్లీ పోయింది. రగతం దూకుతూ వుంది. మండీ యెస్కాని యెనకాకీ ముందూకి పక్కలాకి యెడ్మాచేతితో నఱుకుతాడు సాబ్.

[అని నిష్క్రమించును.

బుస్సీ.—ఆయన యేమి యంత్రమా వీరుఁడా ! హా! హా !

ప్ర.—సర్దార్, దగ్గిరికి వెళ్లడానికి గుఱ్ఱం చొఱడానికి సందు లేదు. రాణువ ఆయనకి చుట్టూ వెదురు పొద వుంది.

బుస్సీ.—[లేచి] అటయిన మేమే వెళ్లి దారిచేసికొనియెదము. [రాజుంగూర్చి చియినవ్వుతో]మహారాజా, మీరు వచ్చిన ఆయన వచ్చునఁట గదా, మీరు కూడ రండి.

[రాజు గునగునం బాఱి నిష్క్రమించును.

బుస్సీ.—పంద ! మేమే పోయెదము. [అని పరిక్రమించును.

చ.—సర్కార్, రంగారావు రక్తం కారికారి సొమ్మసిల్లి పోయినాడ్. మన వాళ్లు పట్టి ఎత్తబోతే తెప్పిరిల్లి మల్లీసొమ్మసిల్లిన్యాడు. గుండెగాయంగుండా బొట్న వేలు వుండ్లే అంతహాత్మ లేచి పోయింది చెప్పిన్యార్. ఆమహాపురుషుడి ధేధీప్యమానం రూపాన్ని రాణువ అంతా, మీద మీద పడి సూస్తావున్యారు సర్కార్ ; యేడుస్తావున్యారు కూడా. నేను వెంటనే మీకి చెప్పవెయ్యాల ఘున్క ఇక్కడ మీతోనే యేడ్వడాన్కి వచ్చిన్యాను సర్కార్.

బుస్సీ.—అటయిన మేమును అక్కడనే చూచెదము. [అని లేచి తూర్పు దెసం బరికించి] ఆహా ! సూర్యుఁ డుదయించినాఁడు! ఇతఁడిచ్చట నిన్న సంజవేళ నేమి కాంచినాఁడు! ఇపు డేమిచూడవచ్చినాఁడు! కెంపెక్కిన యీసూర్యుని ఇతని చెంగటి యీ సాంధ్యమేఘములను గనఁగా నిట్లు తోఁచుచున్నది. వీరిమతములో ఆత్మగాయముల వీరులు సూర్యమండలమును భేదించుకొని వీరస్వర్గమునకేఁగుదురు గదా. నానంజేసి

ఉ. రావుకులాగ్రగణ్యునికి రంగమహీపతికిన్ బ్రియంబునన్
త్రోవ యొసంగి తద్రుధిర ధోరణిచే రవి దాల్చె శోణతన్;
రావున కోహటి లక్కలపరంబున గుంపులువడ్డ తక్కు ర
క్తావిల వీర కోటులు సుమా తరు ణారుణ సాంధ్యమేఘముల్.

కదయించిన యీ నభోమణిం గంటిని. పోయి అస్తమించిన యాంధ్రామణిం గనియెద.

[అందఱు నిష్క్రమింతురు.

అష్టమాంకము.

స్థలకము:—బొబ్బిలికోట లోపల.

(బుస్సీ, విజయరామరాజు, హైదరుజంగు, ముసేపనాల్, పరివారముతో ప్రవేశింతురు)

హైదరు.—ఏమి ముసేపనాల్ బహద్దర్ ? ఈలూటీలో విస్తారం ధనం దొరికిందా మీకి ?

ముసే.—ఎక్కువగానే దొరికింది, హైదర్సాబ్. ఈయాశ్చర్యం ఇనండి. మాదీ పాపం జీవనం. వఖరిసావు మాకీ పెళ్లి వఖరినాశం మాకి హావిశ్యర్వం ; మాదీ చావ్రా నాశం అలాగే ఎవరికో పెళ్లి హావిశ్యర్వం అయితుంది. వారిధనం మొత్తంగా మాకి ఎక్కడా దొరకలేదు. బుగ్గిఐన వల్లుతో బంగారపు జవాహరీ కరిగినపెళ్లలు దొరికినయి. కొన్ని ఇస్త్రీ శవాల్మీద విశేషించి జవాహరీ దొరికింది. ఖిల్లామే ధనం దాశిన సోటు అడ్డదానికి వఖ సరపురు గయినా లేదు.

బుస్సీ.—స్త్రీ లేమయినారు? ఒకస్త్రీయైనను కోటనుండి తప్పించుకొని పోలేదు గదా !

ముసే.—స్త్రీలంతా సచ్చి పడివుంది. శానా మంది కాలిపోయింది.

బుస్సీ.—ఏమి యిది ! పెండ్లి యని చెప్పినాడే యీరాజు !

ఒకసిపాయి.—[సంభ్రాంతుఁడై ప్రవేశించి] నాకీ ఆయింట్లోదూరినదానిక్కి ఫాయిదా ఇద్దో నాదాడీ కాలిపోవడం. [అని నిష్క్రమించును.

బుస్సీ.—ఏమి రాజా, యీవింతలు చూతము రండి. [అని పరిక్రమింతురు.

రాజు.—[ఆత్మగతము] నాచేతను నాకనులారం జూచెదఁగాక.

బుస్సీ.—[పరికించి] యీ యిండ్లన్నీ కాలిపోయినవి ! ఇంకను కాలుచునే యున్నవి ! [కాంచి] ఏమి యివి ! కాలిపోయిన స్త్రీదేహములు ! [నిర్వర్ణించి] ఎక్కడను పురుషదేహము అగపడదు. [ఒండుచోఁగాంచి] హా! యిక్కడ ఈపసికూన సోలి పడిపోయి, పాలు త్రాగు చున్నట్లు నోరు కదలించుచున్నది! మఱియొక చోటఁగాంచి] హా ! హా ! ఇక్కడ ఈశిశువు చచ్చిన తల్లిమీఁద పడి పాలకై పీఁకు చున్నది! హా ! హా ! రాజా ! ఈకోటలోని స్త్రీ లందఱు నీవు చేసిన ద్రోహముచేత గోహారు చేసినారా యేమి ?

ముసే.—అవును సర్దార్ ; ఆలాగే జర్గింది.

బుస్సీ.—ఏమి రాజా ? ఇండ్లు కాలుచున్న మంటలను పెండ్లిబాణ సంచా అంటివే. ఎంత పాపాత్ముఁడవయ్యా !

రాజు.—[విసుగుతో] ఆ! నేనుమాత్రము చూచి చెప్పితినా యేమి ? ఊరక నన్ను పట్టుకొని సివాలు మాటమాటకు.

బుస్సీ.—రాజా ఈపాపము ఎవరి దయ్యా ?

రాజు.—ఏమి చేయను! మనదే.

బుస్సీ.—అది యెట్లయ్యా, ఉమ్మడిమాటగా పలికెదవు ?

రాజు.—నాకు ఈజమీను వచ్చినది, మీకు పేష్కస్సుధనము వచ్చినది.

బుస్సీ.—లేదు, నీవు మమ్ము మోసము చేసితివి. నేను ఏతప్పయిన మన్నింతును గాని, మోసమును మన్నింపను. హా ! హా ! ఎంత మోసపోయితిమి ! ఇందులకు శిక్ష రాజా, యీజమీనును మీకు మే మియ్యము.

రాజు.—[ఆత్మగతము] బెదరింపే. [ప్రకాశము] ఈపాపము నాయొక్కనిదే.

బుస్సీ.—అట్లు పలుకు. 'మనది' అనకు. [సూక్ష్మశ్రవణ మభినయించి] ఏమి యిది తెంపులేని ఘంటానాదమువలె వినఁబడుచున్నది! హైదరుజంగ్, మీకు వినఁబడ లేదా?

హైదరు.—అదుగో యినండి.అరబ్బిరాత్రులకథల్లో కొండమీదిక్కి ఆబంగారపు వున్నికి తేబోయేవాడిక్కి రాయిరాయిన్ని 'చీచీ' యన్న చీవాట్లలాగ మనకీ యిక్కడ 'చీచీ' ఇనబడటం లేదా ?

ముసే.—అవు నవును. ఇంకా ఇంకా ఏమ్టేమ్టో ఇనబడతా వుంది.

హైదరు.—ఇప్పు డేమి చెప్తారు ? ఇంకా రాత్రియైనకొద్దీ కోళాహాళం వుంటుంది. గుండెబద్దల్ ఆయ్యే షబ్దాలు ఇనబడుతుంది.

రాజు.—ఇన్నిచావులు ఆయిన యీ చోట శాకినీ డాకినీ బ్రహ్మరాక్షస బేతాళులు వేఁటలాడుట ఆశ్చర్యమా ?

హైదరు.—నేలదేకినీ, నింగినాకిని, జిన్, పిసాసీ, సైతాన్లు కూడా. ఈటి భయానికే నేను రాత్రి నాడేరాబైటికి అడ్గుపెడ్తాన్ లేదు.

బుస్సీ.—మనమిక్కడ ఉండఁ దగదు. డేరాలకే పోదము రండి. మనకే మందుగుండ్లు లేకపోయిన, మనది 174000 సేనయు, యీబొబ్బిలిబంట్లు 2000 మందిచేత నాశమై యుండును. [అందఱు పరిక్రమింతురు.

స్థలకము:—బుస్సీ డేరా.

బుస్సీ.—ఇచే మా డేరాలో కూర్చుందము [అట్లు చేయుట నభినయింతురు.

బుస్సీ.—ఎవరురా అక్కడ ?

నౌకరు.—సర్దార్, ఏమి సెలవు ?

బుస్సీ.—ఆ బాలుని వేంకటలక్ష్మమ్మను తోడ్కొనిరండు.

[నౌకర్లు అట్లే చేయుదురు. వేంకటలక్ష్మి బాలుని కుర్చీలో కూర్చుండఁబెట్టి నిలుచుండును.

వేంక.—బాబూ, దొరగారికి సలాము చేయుము.

బాలుఁడు.—సలాము బూచీ దొరగారికి [అని సలాము చేయును.

బూసీ.—[టోపీతీసి] సలాము చినవేంకటరాయనింగారికి—హైదరుసాహెబు, ఈయన నేమి చేయుందము ?

రాజు.—వినుఁగుకాల మట్టింపుఁ డని నే నప్పుడే చెప్పలేదా ?

బుస్సీ.—ఏమి పాపాత్ముఁడా. అట్లు పలికెదవు. బిడ్డలఁ గన్నవాఁడవు కావు గదా. ఆ శిసువును చంపి అతని నోటిముందటి యన్నమును హరించెదవా; నీది యెట్టి రాతిహృదయ మయ్యా !

రాజు.—అటయిన మీరు నాకు చేసినమేలు సున్న. వాఁడే నా ప్రాణానకు మృత్యువు.

బుసీ.—ఎట్లయ్యా ?

రాజు.—పరీక్షించి చూడుఁడు.

బుస్సీ.—నౌకరులారా, దివ్యపదార్థము లన్నియు, బాలుని మ్రోల పెట్టుఁడు. పుస్తకములు, కత్తి, కటారి, ఈఁటె, ఇంక వేయుకైదువులు కూడ పెట్టుఁడు.

[నౌకర్లు అట్లే చేయుదురు.

బుస్సీ.—బాబూ, ఇందులో నీ కేమి కావలయునో దానిని తీసికొమ్ము.

[బాలుఁడు పోయి కత్తిం గైకొని రాజుమొగముమీఁదికి ఎత్తును

బూసీ.—బళీ! బళీ! బలారే! బలారే! తండ్రిపగ తీర్చుకొనెడి కుమారుఁడవు బాబూ, తుపాకికడుపున ఫిరంగిలాగున పుట్టినాఁడవు. (రాజు నుద్దేశించి) రాజా, నీ పాపము నిన్ను త్వరలోనే కొట్టును గాని తప్పదయ్యా. వేంకటలక్ష్మమ్మా! ఈరాజు వలన మోసపోయి మేము ఆమహాత్ములకు చేసిన కీడునకు మితిలేనిదానికి కొంచెము పరిహారముగా, ఈ చిన్నిబాలుని నీతో సురక్షితముగా పంపెదను. ఎవరురా అక్కడ?

[నౌకరు ప్రవేశించును.

బుస్సీ.—ఈక్షణము పోయి, హసేనల్లీ సర్దారుతో మామాటగా చెప్పుము 'నీవు మా పరంగి తురుపు 200లతో, సకలపదార్థములతో, సవారిలో ఈవేంకటలక్ష్మమ్మను ఈచిన్న రాయనింగారిని, ఎక్కించుకొని, సామర్లకోటకు కొనిపోయి, తగిన మరియాదతో ఈయన పినతల్లికి అప్పగించి, మాసలాములుచెప్పి, మమ్ము కలసికోవలసినది.' అనియు, 'దారిలో ఈరాజు ఏమయిన శిశువునకు అపాయము చేయుటకు పన్నాగము పన్నెనా, దానిని నీవు హతము చేయవలసినది.' అనియు, 'ఇక్కడ రాజును మేము భద్రముగా కాపు కాచెదము.' అనియు, చెప్పుము. వీరిం దోడ్కొని పొమ్ము. [అని బాలుని ఎత్తుకొని ముద్దిడి, పండిచ్చి, దింపి] బాబూ, పోయివచ్చెదవా ?

బాలు.—పోయి వత్తాం, తలాం.

వేంకట.—సలాము దొరగారికి. ఒక మడుగులోనే మొసలియు, రాజహంసయు నున్నవి. అట్లే ఈసేనలోనే ఈరా జున్నాడు, మీరును ఉన్నారు. మీరన్నట్లు, ఈయనను, పాపము కొట్టునుగాని మానదు. సెలవు పుచ్చుకొంటిమి.

[నౌకరు, బాలుఁడు, వేంకటలక్ష్మియు నిష్క్రమింతురు.

రాజు.—ఎవరురా అక్కడ మానౌకరులు ?

నౌకరు.—[ప్రవేశించి] జయము జయము మహాప్రభువుగారికి. ఏమి యాజ్ఞ?

రాజు.—ఈక్షణమే పోయి, ఎల్లుండి తెల్లవాఱు నప్పటికి మాబాబును ఆనందరావును ఇక్కడికి బొబ్బిలి పట్టాభిషేకార్థమై సర్వసన్నాహముతో తోడ్కొనిరండు.

నౌకరు.—చిత్తము ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

బుస్సీ.—ఇఁక మీరందఱు పొండయ్యా; నేనును నాయాందోళన తీఱునట్లుగా, ఏసుదేవుని గూర్చి నాతప్పులు మన్నింపు మని ప్రార్థనచేసికొని విశ్రమించెదను.

ఇతరులు.—సలాము, సలాము, సలాము. [అని నిష్క్రమింతురు.

బుస్సీ.—నేనును ప్రార్థనాపవరకమున కేఁగెద. [అని నిష్క్రమించును.

[అష్టమ నవమాంకముల నడుమ]

ప్రవేశకము

స్థలకము.—బొబ్బిలికోటలోపల.

[అంతట వెట్టివాండ్రు ప్రవేశింతురు.]

వెట్టినాయకుఁడు.—[చేత చేపాటికఱ్ఱం బట్టుకొని నిలువంబడి, శవములను బండ్ల కెక్కించుట నభినయించుచు] యెట్టోడిబిడుకు యేంబదుకురా నారాయుఁడా! ఎత్తండిరా ఈ పీనుగలని, బళ్లలోకి. [ఇతరులు అట్లుచేయుట నభినయింతురు.

వెట్టినాయకుఁడు.—ఆయరె మజ్జా! యేమి శిత్రంరా ! మనము పదిబారల దూరాన వుండాలిశిన యీ ఆడంగులు గానివోసాలు, యేనిగలమీద బంగారపు అంబారీలలోను బంగారపు సవ్వారీలలోను తిరగాలిశిననోరు, మనశాత దున్నపోతుల బళ్లల్లో, యీడ్పులు పడి, గోతులలో పడతా వున్నారు ; ఏంకమ్మ మొచ్చిందిరా యీళ్లకి ! ఇ దేఁగుం దంటే:—

[గేయము.]

హరిహరీ నారాయ ణాదినా రాయణో
కరుణించ వోయ్మమ్ము కమల లో శనుఁడా.
నిన్నరా తిరికోట మొన్నరా తిరికోట
వన్నెమీ రినకోట వశినపుర మాయా. హరి॥
శిన్నమ్మ యిన్నాలు శిందులూ తొక్కితే,
పెద్దమ్మ పరవళ్లు పెడ తున్న దిపుడు హరి॥
పెద్ద మెల్తా దంట, శిన్న మొస్తా దంట,
వశినపురమూ మళ్లి వన్నైత దంట. హరి॥
ఏమొగం పకపక యెగిరెగిరి నవ్విందొ,
ఆమొగం యెక్కెక్కి అంగలార్చింది. హరి॥
ఏమొగం యెక్కెక్కి యేడ్తవుండిందో
ఆమొగం నవ్వింది అబ్బురంగాను. హరి॥
రంగరా వెల్లాడు, శింగార మెల్లింది,

ఆనందరా జింక ఆడతా డంట. హరి॥
ఆనందు డిక్కడ ఆడడానికి వొస్తె,
యెల్లిన శిన్నమ్మ యెం టొస్త దంట. హరి॥
అమ్మ లిద్దఱిశాత యిమ్ములూ కుమ్ములూ
నరమాన పులనొష్ట నలవ రా శినడు. హరి॥

[అంతట చాటింపు వెట్టివాఁడు ప్రవేశించును.]

చాటింపు.—ఎందుకన్నా యిక్క డంతా సుబ్బరం శేయిస్తా వున్నావు ?

వెట్టినాయ.—జేపు ఆనందమారాజుకి యీడ పట్టం కడతారంట; అందు కోసంరా ! నువ్వేంట్రా సాటించ సెల్తావు ?

చాటింపు.—నాను ఆనందమారాజుకి యీడ పట్టాబిసేకానికే ఊరంతా అలంఖారం శెయ్యాలిశిం దని సాటించ సెల్తా. సూశినావా అన్నా శిన్నమ్మ శపలశిత్తం?

వెట్టినా.—(జనాంతికము) మఱి గంటే, వోరే! నువ్వు నిన్నటి దాక రాయనిం గారి వుప్పు తిని, ఇప్పుడు ఆనందరాజుకోసం సాటిస్తా వేంట్రా ?

చాటింపు.—(జనాంతికము) నువ్వేలా గన్నా ఆనందరాజుకోసం సుభ్రం శేయిస్తావు ?

వెట్టివా.—(జనాంతికము) పాపారాయనిం గారికి కబు రెల్లింది; నాతమ్ముఁడే తీసకెల్లాడు. రాత్రి ఆయ నొస్తాడు. పెదరాజుకే పట్టం గడతాడు. (ప్రకాశము) ఈ కంపుకి నిలవలేకున్నానురా. ఈబల్లి తోలించు కెల్లి కొంచెం నీలుచ్చుకొంటా.

చాటింపు.—నా నెల్లి యెక్కణ్ణయినా మాసులు మిగిలున్నకాడ నాసాటింపు పాడే శొచ్చి నీలకాడ నీతో కలుసు కొంటానన్నా. [అందఱు నిష్క్రమింతురు.

ప్రవేశకము ముగిసినది.

నవమాంకము.

స్థలకము — స్కంధావారములో విజయరామరాజు డేరాకడ.

[తాండ్రపాపారాయఁడు మిరియాలసీతన్నయు ప్రవేశింతురు.]

సీతన్న.— వచ్చితి మయ్యా పాపయ్యా విజయరాముని డేరాకు. అందఱు బాఁగా నిద్రపోవుచున్నారు. పూర్వము, అశ్వత్థామ సౌప్తికము చేయలేదా ? అయినను మనము నిద్ర మేలుకొలిపియే చేయుదము. నేను బయట కాపుండెద, డేరాకడకు వచ్చినవారి నెల్ల క్రుక్కు మిక్కు అననీయక పరిమార్చుచుండెద. బుస్సీని రప్పించుటకు వీరిఫిరంగులు వారి డేరాలమీఁదికి ఆగాదు చేసెదను. నీవు సావకాశముగా రాజునకు జముని జేటి చేయింపుము. లోనికిం బొమ్ము.

పాపయ్య.— సరి, సీతన్నా, అట్లే కానిమ్ము

[సీతన్న నిష్క్రమించి డేరాద్వారము కడకు
మరల మరల వచ్చుచుం బోవుచుండును.

పాపయ్య.— బళీ ! మిరియాల సీతన్న పనిచే బుస్సీ వచ్చి నాపనిం జూచును గాక. వీఁడు నేను లేనప్పుడు గదా, నారాయనిని హతముచేసినాఁడు. నేనిపుడు వీనిని, బంధు మిత్త్ర పరివార బలత్రితయ సమేతుని హత మార్చెదను. వేనవేలు వీరభటుల చేతఁ గదా వీఁడు నారాయనిం గారులను, ఒంటరులను ఒక్కొక్కని మడియింపించినాఁడు. నేను ఒక్కండన వీనిని వీనిం గావ నేతెంచువారినిం గూడ పరిమార్చెద. హాహాహా ! ఏమి కనఁబడుచున్నది !

శా. రంగారాయఁడు, వేంగళేద్రుఁ, డనుఁగుల్,
రౌతుల్, భటుల్, రక్తది
గ్ధాంగుల్ నన్ మిడికన్నులం గనుచు జి
హ్వాల్ దోఁప నోళ్ళ్విచ్చి, కా

ింగుం జూపి, తృషం దదస్ర ఝర పా
　　ిం దీర్పు మన్నంజ్ఞ గాఁ
గం, గైదొన్నె ఘుటిం త్రయారె! యిదె రం,
　　గా వెంగ, నేఁ దిర్చెదన్. ౭౫

హా ! మరల ని|దేమి ! హా !

క. ఈతని ద్రోహమువలనన్
గాతర లై యగ్నిఁ బడిన కంజాతాస్యల్
చేతుల సన్నలచే నను
నీతని మెడఁ గోయు మనుచు నెగచెద రరరే! ౭౬

ఇఁక తడయంజనదు. నిద్రపోవుచున్న యీమూఁకను మదీయ సింహగర్జనముల చే 'ఓరి, వచ్చి మీరాజుం గాచుకొండిరా:' అని పిలుతునా? వలదు,; అట్లు చేసిన వీఁడు నారాక యెఱింగి పలాయితుఁడై దాఁగును. కావున లోనికే పోయి వచ్చినపని కావించెద.

ఆ. ఏనుఁగునకుఁ దుల్య మితని దేహము గాన
మేటి శిరము వ్రచ్చి మెదడు వడయఁ
గుత్తుకను బగిల్చి నెత్తురువాఁకను బొంద
నేను సింహ మవుదు నీక్షణమున. ౭౭

[అని లోనికిఁ బోవుట నభినయించి, బాకును దూయును.

[అంతట ఒక సేవకుఁడు కునికిపాట్లు పడుచు, పాదము లొత్తు
చుండ, మంచముపై నిద్రితుఁడు రాజు ప్రవేశించును.]

పాపయ్య.—(రాజుం దఱిసి) పులి ! పులి ! పులి !

రాజు.—[మేల్కొనుట నభినయించుచు] లేవకయే పోడు పోడు పోడువు.

[సేవకుఁడు పాపయ్యతోఁ గలియఁబడును. పాపయ్య వానిమెడ నొకచేతం బట్టి బయటికిం దెచ్చి సీతన్నచేత దానిం బెట్టును. సీతన్న వాని నట్లే కొని నిష్క్రమించును. పాపయ్య మరల లోనికి పరిక్రమించును.

రాజు.—[ఈయలబలమునకుం బోలె లేచి మంచము దిగి యివలికి వచ్చి కవాచి పై పొడ్చుచుండెను] ఏదిరా పులి ? ఎటుపోయినదిరా? చల్లారామా, ఏమైతివిరా! హా పులి నిన్ను నీడ్చికొని పోయినదా? [అని అన్నివైపుల వెదకుట నభినయించును.

పాపయ్య.—[ప్రవేశ మభినయించి ఎడమచేతితో రాజును గొంతునం బట్టుకొని కుడిచేత బాకు గొని అతని గుండియకుం గదియించి] తప్పించుకొన యత్నించితివా, ప్రాణము గాలి కలిసించెద. రాజా, ఇది అడవి పులిగాదోయి, బొబ్బిలిపులి; దీని పేరు బొబ్బిలి బెబ్బులి తాండ్ర పాపయ్య. ఈపులియే చల్లారాముని కొనిపోయినది.

రాజు.—పాపయ్యా, దొంగపోటు పొడువ వచ్చితివా!

పాపయ్య.—నీవు దొంగప్రొద్దునఁ గదా ముట్టడి వేయించితివి ?

[నేపథ్యమున.]

'హా ! నారాయణ ! నారాయణ !'

రాజు.—హా! హా! చల్లారాముని గొంతు ! [స్వగతము] బయట ఇతనిసిబ్బంది వచ్చియున్నారు గావలయు. (ప్రకాశము) పాపయ్యా, నిన్నుఁ జూచినతర్వాత, ఎంత పరివార మున్నను, ఇంక నేమి ఆశలు ? ఈ బొబ్బిలి నీ కిచ్చెదను, నా ప్రాణములు కావుము పాపయ్యా.

పాపయ్య.—ఆహాహా !

సీ. బొబ్బిలి యిత్తువా? యబ్బబ్బ శిబి కర్ణ
ధారాధరులకన్న దాత వైతి !
నీపాడు ప్రాణంబు నేను గైకోనురా,
గాలిలోపల నది కలయుఁ జుమ్ము.
ఉండెబో మ్మామాట ; యూడెనా యోరి నీ
ప్రక్కలోపల నున్న బల్లెకోల ?
వెలికి వచ్చెనో కంటినలుసు నీ కిప్పుడు ?
పరులసొత్తాశించు ఫలము గంటె ?
తే. వీజేడికి నీకు జగదేకవీరుఁడైన
రావువైఁ బగ యన నేమి రా బజీత ?
వెంగళుని వెండిలికి నన్ను వెడలకుండఁ
జేసిన ఫలంబుఁ గుడువు చేసేత నిపుడు. ౭౮

[నేపథ్యమున ఫిరంగియగాదులు]

పాపయ్య.—ఒకమాట కయిన బదులు చెప్పవయ్యా. నాచేతిపట్టుచేత నోట మాట రా కున్నదా యేమి? పట్టు కొంచెము సడలించెదను. [అని అట్లు చేయును.

రాజు.—[ఊపిరి త్రిప్పుకొని నిట్టూర్పు నిగిడించి]

శా. పాపారాయఁడ, రాచపుట్టువను, నీపాదంబులం బట్టితిన్;
నా ప్రాణంబులఁ గావు, నిండుకరుణ న్నాపాలిదైవంబ వై.

పాపయ్య.—

పాపా, పూనితి కాదె బాలుఁ గరిచేఁ బాదాన మట్టింపఁగా!
నీ పాపంబులు నాకుఁ దెల్పినది వానిం దాది కొంపోవుచున్ ౭౬

నీవు నాశము చేయించిన మాకోటను గూడ చూచి వచ్చితిని జుమా. రాజా, మారంగారాయని బంగారపు మంచముమీఁద పరుండెద నని ప్రతిజ్ఞ చేసితివఁట; నేను వచ్చుతఱికి దానిమీఁదనే గదా ఉంటివి, నిన్ను దానిమీఁదనే సుఖముగా పరుండఁ బెట్టి పెద్దనిదురఁ బుచ్చెద. ఇదిగో నిన్నుఁ గొనిపోయెద. పులిసాకిన యెద్దా?

[అంతట బుస్సీయు హైదరుజంగును ప్రవేశింతురు.]

[పాపయ్య రాజును పిల్లికూనం బోలె ఎడమచేత మెడ పట్టుకొని యున్నవాఁడు, అట్లే కుదిలించుచు, నిష్క్రమించును.

బుస్సీ.—ఏమి యిది! గడ్డి మేటిపాటి మూటను తాటిచెట్టుపాటి జమాను, ఎడమ చేతితో లోనికి కొనిపోవుచున్నాఁడు! ఈరాజు తన సామా నంతయు తరలించుకొను -చున్నాఁడు గావలయు, ఆహా! ఎంతమోసగాఁ డీతఁడు? పేష్కస్సులు ఎగవేయు టకై మనలనే సంహరింప మనమీఁదికే ఫిరంగులు త్రిప్పినాఁడు!

హైదరు.—[స్వగ.] నాకీ వచ్చేకన్న లక్షవర్హాలు రెయి గెయ్యాడానికిసహా.

[అంతట ప్రేవులహారాలతో రుధిరస్థాసకముతో, అట్టహాసముతో, తాండ్ర పాపయ్య ప్రవేశించును.

పాపయ్య.—[ఇటునటు వికటముగా పరిక్రమించుచు, పరవళ్లు ద్రొక్కుచు,] పూర్వము తాండ్ర పాపారాయఁడను, ఇపుడు రాకాసిమన్నీఁడ నయితిని. అయినను నాజూకుగా:—

సీ. రాజనంబులరాశి భోజనార్థంబుగాఁ
దంచుకైవడి వీని దంచినాఁడ,
పనసకాయను దోరపదనఁ గూరగ వండఁ
జెక్కుకైవడి వీని జెక్కినాఁడ,
పొట్లకాయను దియ్యంబులుసు దప్పళమ్ముకై
తఱుగుకైవడి వీనిఁ దఱిగినాఁడ,
అంటుమామిడిపండు నారగింపునకుఁగాఁ
గోయుకైవడి వీనిఁ గోసినాఁడ,

తే. యాతనల మ్రగ్గు మని వీని యమునియిల్లు
సేర్చితిని ; వీని కిఁక నేమి సేయఁ గలదు ?
ఇంతచేఁతయు నా చేతి కించుకేని
యాఁటదాయె నీఁకేమి నా కాట గలదు ? ౮౦

[అని ఆలోచించుట నభినయించుచుండును.

బుస్సీ.—హైదర్సాహేబ్, మన మొకటి అనుకొని వచ్చిన, ఇది మఱి యొకటి అయినది. ఇతనిమాటవలననే ఇతఁడు తాండ్రపాపయ్య యని తెలిసినది. ఇతఁడు రాజు వర్ణించినంతకన్న హెచ్చువాఁడుగానే యున్నాఁడు. రాజు చచ్చినాఁడు.

ఉ. స్తంభమునుండి పై కుఱికి దానవుఁ జీరిచి రొప్పుచున్న యా
డంభ మృగాధినాథుని విధంబునఁ జేర్చెడి దుర్నిరీక్ష్యుఁడై,
కుంభిని నేర్చు రుద్రుని విఘూర్ణన తాండవ చండ సంభ్రమా
రంభము నూని చూడ్కికి భరం బగునీతఁడు మర్త్యమాత్రుఁడే!

ఇప్పు డీమహావీరునీ ఎంతటివాఁడైనను ఎంద అయినను సమీపించు టెట్లు ?

హైదరు.—మాట్లాడకండీ ; ఇనబడితే మనమీదికే వస్తాడు.

పాపయ్య.—నా చేత వీనీ విజయనగరము కోట నా బొబ్బిలికోటలాగున నేల మట్టమై, వీని జను లెల్ల మ్రంది, సంజీవిచేత రామసైన్యముంబోలె ఎట్లో మాజనులు మాత్రము అందఱును బ్రదికి, రంగారావు యథాపూర్వము బొబ్బిలిలోను, చినవేంకటరావు యువరాజుగా విజయనగరములో క్రొత్తకోట కట్టించుకొని అందులోను, ఈ

జమీనుల నేలుచున్న, నాపగ తీఱును. [వెడవెడ ఆట్టహాసము చేసి] సరిసరి ! ఏల యీ కానితలంపు ? మఱి కడుపులోని యీ యాందోళనము తీఱు టెట్లు ? ఆ! జ్ఞప్తి యైనది ! ఆ హైదరుగాని చిత్రవధచేత తీఱును. ఈ నడిమి డేరా వాని దంట. దాని మీఁదనే పోయిపడుదునా? [పరికించుట నభినయించి] ఏల? పరంగిదండు తురకదండును నావైపే వచ్చుచున్నవి ? ఇవి బుస్సీ హైదర్ల దండులు గాఁబలయును. ఈరాణువలు నన్ను గుఱిపెట్ట వేమి ? ఆ ! తెలిసినది. నావెనుకనుండు తమ స్నేహితునను రాజునను వాని దండునను తగులు నని కాఁబలయును. మఱి యిది నన్ను పట్టుకొనఁ యత్నమా? సామును లగువులు లేవా? ఆహాహా! దండ్లా నావైకి !

దండు దండు లటంచు గుండె తల్లడ మేల ?
కొండంత వామికిఁ గొఱకచ్చు చాలు.
కట్టెమో పులరాశి గగనంబు ముట్టనీ,
చిట్టి నిప్పుక కాల్చి సివమాడుఁ బైని.
ముక్కంటి నిటలాన మొలకెత్తు మంటకు
నెక్కువా యేమి యేడేడు లోకాలు? రా॥

[దండు ప్రవేశించును. పాపయ్యవైపు నడుచును.

పాపయ్య.—ఆహా ! ఇన్నాళ్లకు నాచేతికి ఆటవిన యడవినఱకుఁడు దొరకినది. రండోయి మొనగాండ్రారా, రండి. [ప్రేవుహారములం జూపుచు] తాండ్ర పాపయ్య నయ్యా! మా స్నేహితుఁడు విజయరాముఁడు ఈ మా హారములను దొంగిలించి తమాషాకు తన కడుపులో దాఁచుకొన్నాఁడు ; వీనిని నేను గైకొని తమాషాకే ఆతనిని రాజదండనం బొందు మని యమధర్మరాజుకడకు పంపితిని. రండు మీరును పోయి ఆతమాషా చూతురుగాని.

సిపాయీ లందఱు.—[ఒకరికొకరు] తాండ్ర పాపయ్య! పాపయ్య రాజునుచంపొచ్చి ఆవేస మాడుతున్నాడు. మనము రాజుమీదికి వస్తే ఇక్కడ మఱి కోలాహలైంది.

[పాపయ్య వారింగార్చి 'కిల్లల్లల్లా, అని యార్చి, బాహాస్ఫోటనము సేయును. వారు వెఱచఱచుట నభినయించి వెనుకకు విఱుగుదురు.

పాపయ్య.—అయినదా మీపని ? సముద్రమును చూడఁగానే మీగుండె బ్రద్దలైనది. అడ్డు ఈఁదఁ దెగఁబడువాఁ డెవఁడు ? దావాగ్నిం జూడఁగానే లేళ్లు పాఱిపోయినవి, దానిని దాఁటిపోవున దేది! పొండి! పిడికెఁడుకూటికై దేహ మమ్ముకొన్న కకూలిరితిగాండ్రు మీరు. మీ పెండ్లాముబిడ్డల యుసురు నాకేల ? మిమ్ము విడిచి

పెట్టలిసి. ఏమి ! వచ్చిరా? ఏ మేని దురాలోచన గలదా మీకు ? అటయిన నిలువుండు. మిమ్ము రూపుమాపెదను. [అని నఱకఁబోవును. దండు పలాయిత మగును.

పాపయ్య.—మఱి యెట్లయ్యా నా దప్పి తీఱుట ? ఆహైదరుగానిం జీల్చి వాని రక్తమును కనులం జూచిననేగాని తీరదే ! వానిం గనుట యెట్లు !

[అని యరయుచుండును.

ఒక సిపాయి.—[ప్రవేశించి, పాపయ్యం గనకయే వడిగా బుస్సీహైదరుల కడకుఁ బోయి]— సలాం బూసీదొరవారికి.

[పాపయ్య వినుట నభియించును.

సిపాయి.—సలాం హైదర్జంగు బహద్దరువారికి. ఆఫిరంగుల్ రాజా మస్సీదికి కాల్చేసినది గావు. తాండ్రపాపారా వంట, దొర అంట ; ఆయనకీ కింద దళవాయంట, మిరాల సీతన్నంట. ఆయన మీకీ రక్షించడానికి వాటికి కాల్చినాడంట. పగ క్షేమ చెయ్యడానికి వెళ్లిన రాజాదండూకి నాలుగువందలమందికి సంపి 'పఖరిశాత్ర సావటానికి ఖారణం ఏమి?' అని పొడుచుకొని సచ్చినాడు ఇప్పుడే.—

పాపయ్య.—[స్వగతము] బళి ! సీతన్న నాకన్న ముందే పోయినాఁడు. ఆహా ! హైదరు ఇక్కడనే దొరకినాఁడు ! బుస్సీ యున్నాఁడు బళి బళీ ! [ప్రకాశము] ఓహో ! బుస్సీదొరగారూ ! ఇక్కడికే వచ్చినారా ! వీరే గదా హైదర్జంగు గారు దూదేకులవీరులు.

బుస్సీ.—సలాం పాపాయనివారికి. [హైదరు బుస్సీ వెనుక కేఁగును.

పాపయ్య.—[కటాలున సింహము దుమికినట్లు హైదరుమీఁది కరిగి మెడను ఎడమచేతం బట్టుకొని ఇవలికి ఈడ్చుకొని వచ్చి] రారా దూదేకులవాఁడా ? నిన్ను వెకెదను. నీవేగదా నాభర్త మాన్పు మన్నవాఁడవు, కోట వదలి పొమ్మన్నవాఁడవు. నీవస్తు సాధించితివే ! ఓరీ,

శా. నీవేబొబ్బిలికోట వాదువు సుమీ ; నీప్రాణమే రాయఁడౌ ;
నీ వి ప్పుక్కిఱి బిక్కిఱిం బడుదు గుండె ల్గొట్టుకో న్నబ్బమే
తా వాద్యోత్తమ మైన నౌబ తగు ; హైదర్జంగ, యీబొకునన్
నీవాద్యంబును జీల్చెదన్ ; వెలికిదే నీరాయనిం దోలెదన్. ౮3

[బాకెత్తి] తలఁచుకో నీసామిని !

హైదరు.—నీవే నా సామివి ! శరణు శరణు మహారాజ్ ; రక్షించు రక్షించు; సామీ రక్షించు.

పాపయ్య.—[ఆశ్చర్యముతో] ఓరీ నీచుఁడా ! ఈ టక్కు ఎక్కడ నేర్చితివి రా ! మా రంగారాయని బారిం బడిన మా విజయరాముని భటుల కడ నేర్చితివా?

బుస్సీ.—రాయనింగారూ, శర ణన్న తర్వాత కొట్టుట మీ వెలమనీతులలో లేదే. కావుఁడు దీనుని.

పాపయ్య.—బుస్సీదొరా, నీవు మిక్కిలి దొడ్డవాఁడవు మా చినవేంకటరాయనిం గాచినవాఁడవు ; వీనిచే మోసపోయితివి. నీవు తురుపు ఇచ్చిపంపఁగా వేంకటలక్ష్మి సామర్లకోటకుఁ బోవుచు మాలపల్లి కడనుండి మాకు సకలవృత్తాంతములను బారికవాని ముఖమునం జెప్పి బంపినది. సలాము నీకు. నీమాటచే వీనిని నాగుంటి మీరాసాహెబు టెక్కెమునకు బలాదూరుగా విడిచి పెట్టితిని. [అని మెడ విడిచి పాఱవైచును.

హైదరు.—[స్వగతము] బతికినాను రా బాబూ !

[అని మెడ తడవుకొనుచు, నిట్టూర్పులు నిగుడ్చుచు, పడియే యుండును.

పాపయ్య.—బుస్సీదొరా, చూచితివా మాబొబ్బిలి వెలమల వీరమును?

బుస్సీ.—చూచితిని, అనుభవించితిని, మెచ్చితిని.

పాపయ్య.—విజయరాముఁడు పంద యని కనుఁగొంటివా ?

బుస్సీ.—నూఱు మార్లు.

పాపయ్య.—ఇఁక నా కిక్కడ పని లేదు నేను త్వరగాపోయి రంగారావును నా కేల కబురు పంపలేదో అడుగవలయును.

బుస్సీ.—ఆయన పంపినాఁడు. జాబులం దెచ్చు హర్కారులను, రాజుపట్టించినాఁడు. వారు పోరి చచ్చినంతట ఆజాబులం గైకొన్నాఁడు.

పాపయ్య.—కబు రందియు నేను రాలే దని రంగారాయఁడు నామీఁద కోపగించుచుండును. నేనుపోయి యీసమాధానమును చెప్పుకోవలయును.

బుస్సీ.—బాలుని తక్తు ఎక్కించి నీవు మంత్రివిగా జమీ నేలించుచుండవలయు నని నా ప్రార్థన.

పాపయ్య.—ఆపని నీలాద్రిరాయఁడు కావించును. నేనునాకు ప్రేత పిండము వైచుకొంటిని ; ఇఁక నీలోకమున నుండఁజనదు. నేను పోయి విజయరామునికడనే పరమపదింతెద. మీదం డ్లన్నియు వచ్చి చూచు నపుడు, రాజుం జీల్చిన పులి యిది యని తెలియవలదా ? [అని కటారిచే నిష్క్రమించును.

బుస్సీ.—హైదర్సాబ్, రాజవధచిత్రమును చూచి వత్తము రా.

హైదరు.—మీరుపోయి సూడండి, కడుపునిండా సూస్కోని రండి, నేను

రాను. అక్డ పాపయ్య ఇంకా పోడుచుకొన్నాడో బతికేవున్నాడో? ఈతూరి ఆయన నా మెడ్కాయకి నులిమితే, నేను బత్కడం అబ్ధం.

బుస్సీ —అటయిన నేను మాత్రమే పోయి చూచివచ్చెదను. [అని నిష్క్ర].

హైదరు.—అబ్బా; మెడ పడిపోయిందిరా, నాయెద్మబాఘుం, అంతాచితికి పోయింది. [అని మెల్లఁగా కష్టముతో లేచి] ఇప్పటీక్కి నాకీ పానం దక్కింది, లక్ష వర్హాలు మునిగి పోయినయి. [అని నొప్పి నభినయించుచు, కుంటుచు నుండును.

బుస్సీ.—[ప్రవేశించి] హాహాహా ! ఏమి ఘోర వధ !

శా. వేలుక్ లక్షలు మాంసరాసులు నభోవిస్తార మావిస్తరిక్
గ్రాలక్, భుక్తికిఁ గూరుచుండి, మును శర్వాధ్యాన మందున్న బే
తాలుండో యన, రాజమాంసఖల సక్తప్రేక్ష బద్ధాసనా
భీలుం, డాత్మహతుండు పాపయ యుఱుక్ వీక్షింపఁగా ప్రేఁకమై.
[నేపథ్యమున కలకలధ్వని - ఓంభాయి, ఓంభాయి, ఓంభాయి.]

బుస్సీ.—ఇది, ఓహో. ఆనందరాజు పట్టాభిషేకముకై వచ్చుచున్న కలకలము గావలయును. హైదర్, మనము పోయి ఈతనివలన మనకు రావలసిన ఫేష్కస్సుల సిక్కడనే పుచ్చుకొందము. ఈతఁడు మరల విజయనగరముకోట చేరనా, మనకు పైకము ముట్టదు.

హైదరు.—ఆలాగే చేద్దాం. [స్వగతము] ఈగంధర్గోళంలో నా లక్ష ముణిగిపోయింది. [అని అందఱు నిష్క్ర]మింతురు.

నవమాంకము సమాప్తము.

దశమాంకము.

స్థలకము:—గోలకొండ నైజాము దర్బారు.

[నైజాము, వజీరు, బుస్సీదొర, హసేనాలీ, పరివారంబును యథోచితము ప్రవేశింతురు.]

నైజాము.—నిన్న హైదరును శిక్షించిన యాగ్రహములో అడుగ నైతిని. హసేనాలీ, ఇందఱు సర్దారులు గతించిన యీ రణములో, నీవెట్లు బ్రదికి వచ్చితివి ?

హసే.—మహాప్రభూ, నేను రాయనివారి పక్షముగా వాదించినందున నన్ను యుద్ధము చేయ నీక హైదర్జంగు నిలిపినాఁడు.

ప్రతీహారి.—[ప్రవేశించి] బందగానే ఆలీ ; నిన్న నే తెలుపుడు చేసుకొన్న వారు బొబ్బిలిరాజాగారి కుమారుణ్ని తోడ్కొని నీలాద్రిరావుగారూ దాదీ వచ్చి వున్నారు.

నైజాము.—ఓహో ! సమయానకువచ్చినారు. తత్క్షణమే తోడ్కొనిరా?

ప్రతీ.—[నిష్క్రమించి తోడ్కొని వచ్చి] వారే గోలకొండపాదుషాగారు. ఖుర్నిష సలాములు చేయండి. [అని నిష్క్రమించును.

[ముప్వురు మోఁకాలిమీఁద నిలుతురు.

నీలాద్రి.—బందగానే ఆలీ, మీగులామును, సామర్లకోట నీలాద్రిరాయఁడను సలాము చేయుచున్నాను. [అని సలాము చేసి, చేతులు జోడించుకొని బాలుంగూర్చి] బాబూ నీవు చెప్పు.—"నేను పాదుషాగారి గులామను, బొబ్బిలి రంగారాయనింగారి కుమారుఁడను, చినవేంకటరాయఁడను. సలాం చేయుచున్నాను" అని.

బాలుఁడు.—నేను పాదుసాగాలి గులామను, బొబ్బిలి రంగారాయనివారి కుమాలుదను, చినవేంకటలాయదను, తలాము చేస్తున్నాను.

నీలాద్రి.—బాబూ ; ఇట్లు సలాము చేయుము. [అని నేర్పును.

[బాలుఁడు సలాము చేసి చేతులు జోడించుకొని యుండును.

దాది.—నేను రంగారాయనివారి జనానా దాసిని, ఈ చిన్నబాబుగారి చిన్న దాదిని, వేంకటలక్ష్మిని. [అని సలాము చేసి చేతులు జోడించుకొని యుండును.

నైజాము.—నీలాద్రిరావుగారూ, మాకు బుస్సీగారివలన బొబ్బిలి వృత్తాంతమెల్ల తెలిసియున్నది. మీరు వచ్చినపని సంగ్రహముగా చెప్పుకొండి.

నీలాద్రి.—అటయిన మాపిర్యాదు కరము సంక్షిప్తమైనది. ధర్మరక్షకా, హైదరుజంగు చేసిన ద్రోహమువలన బొబ్బిలిగడ్డలో మిగిలిన మగపురుగు ఈశిశువు ఒక్కఁడే! స్త్రీలలో పీసింబాయని యీదాదియొక్కతె మిగిలినది. వీని నోటిముందఱ, సర్కారు పెట్టిన యన్నమును, బొబ్బిలి జమీనును, విజయనగరము దొర ఆనందరాజు అపహరించినాఁడు. ఈబాలుఁడు, హుజూరునకు, వంశక్రమాగతుఁడు, గులాము; వీనికి అన్నము పెట్టుము భూలోక దేవేంద్రా.

నైజాము.—బాలుని రక్షించెదము. ఆదుష్టుని హైదరును దండించినారము. లెండు కూర్చుండుఁడు. [నీలాద్రిరావును బాలుఁడును లేచి కూర్చుందురు.

నైజాము.—[సభ్యుల నుద్దేశించి] నిన్న వానిపైఁ గలిగిన యాగ్రహములో మిమ్ము అడుగలేదు; ఇపుడు, చెప్పుఁడు: వానికి విధించిన దండన రాజధర్మసముచితమా గాదా?

వజీరు.—బందగానె ఆలీ, అంతకన్న న్యాయ మయిన దండన యుండునా; బొబ్బిలి మహావీరులను హుజూరువారి రాణువను నాశము చేసినందులకు వానికి ఉరి దండన. వాఁడు లంచము గొని, సర్కారు పైకము పోఁగొట్టినందులకు ఇప్పటివఱకు వాఁడు లంచాలచేత చేర్చిన లక్షోపలక్షల ధన మెల్ల సర్కారు ఖజానాకు దాఖలు. మఱి విశేషము. వాని కుటుంబమునకు, యావజ్జీవము, జీవనాంశము. ఇంతకన్నను ధర్మముండునా?

నైజాము.—విజయరామరాజుమీఁదికి కత్తి దూసిన బాలుఁడు ఇతఁడే?

బుస్సీ.—ఔను సర్కార్;

నైజాము.—ఏమి బాలకా, అట్లు చేసితివా?

బాలుఁడు.—మాబాబును చంపించిన వాన్ని నేను కొత్తొద్దా?

నైజాము, వజీరులు.—[హర్షముతో] అరెరే! అరరే!

నైజాము.—మఱికొట్టితివా?

బాలుఁడు.—ఈ బూచీదొర అడ్డపడ్డాడు అందుకోసం కొత్తలేదు.

నైజాము.—అయనపెద్దవాఁడే, నిన్నుపొడిచి చంపిన నీవేమి చేయుదువు?

బాలుఁడు.—చావంతే భయమా? చావుకి భయపడ కూడదని మావాల్లందఱు చెప్తారు. చంపేస్తే మాబాబయ్యకాడికే వెల్తాను, అది నాకు యిష్టమే గదా!

అందఱు.—అరరే! అరరే! బాపురే బాలకా!

బుస్సీ.—మహాప్రభూ; ఈదాదియే తన చేతినుండి యీబాలుని హరింపవచ్చిన వారిని మన సిపాయీలను నూఱుగురను పరిమార్చినది.

నైజాము, సభ్యులు.—బలారే ! బలారే ! ఏమి వీరభూమి ఆగడ్డ !

నైజాము.—లే దాదీ. లే. నిన్ను మెచ్చినారము.

వేంకట.—ధర్మరక్షకుని కటాక్షము. [అని లేచి నిలుచును.

నైజాము.—దివాన్ బహద్దర్ టో౯గ్రాలీగారూ—కుమారునికి సర్వము యథోచితము జరుపునట్లుగా ఇపుడు ఉత్తర సర్కారులకు దొరలైన యింగ్లీషువారి గవర్నరుగా మదరాసురాజధానిలో నేలుచుండు దొరగారికి మాసిఫారసును జాబువ్రాయుడు. ఆ జాబును ప్రత్యేకముగా రవానాచేయుడు. దానినకలును వీరికిపుడు మేమిచ్చిన ఫర్మానాగా మాసికామొహరులనుం బొందించి, సవారిలో ఉంచి దానిని, ఇంక ఈచిన రాజావారికి మేమిచ్చినవిగా అనర్ఘ్యములైన మహారాజోచిత దివ్యభూషణములను ఒకకత్తెలాని తేజీని, ఢంకాను, మేళతాళములతోఁగూడ వారి సవారివెంటంగొనిపోయి వారిబసలో చేర్పుడు. నీలాద్రిరాయనింగారిని మాగొప్పసర్దారులకుందగిన మరియాదలతో సత్కరింపుడు. బాలుని గాచుటచేత మాకు గొప్పమేహనత్తు గావించినప్రభుభక్తశేఖరమణి వేంకటలక్ష్మిచేతికి నవరత్నఖచితమయిన జాలువాపసిఁడితోడా తొడుగుడు.

టో౯గ్రాలీ.—[లేచి] సర్కారాజ్ఞ. [అని కూర్చుండును.

నైజా.—హసేనాలీ, నీవు వీరితోఁ గూడఁ బోయి, మాఫర్మాన్ బొబ్బిలిలోను, విజయనగరములోను, ప్రకటించి, ఈరాజావారిని బొబ్బిలిజమీనులో కుదురు పఱిచి రమ్ము.

హసేనాలీ.—(లేచి) సర్కార్ ఆజ్ఞ. [అని కూర్చుండును.

నీలాద్రి, దాది.—మహాప్రసాదము, మహాప్రసాదము.

నీలాద్రి.—బాబూ, 'మహాప్రసాదము' అని చెప్పుము.

బాలు.—మహాప్లసాదము.

[నౌకర్లు పళ్లెములో రత్నాల కటారి పన్నీటికూజాయును తెచ్చి నైజాముకడ నిలుతురు.

నైజాము.—కుమారా, చినవేంకటరాయా, ఇటు రమ్ము.

[బాలుఁడు పోయి మోకరించి నిలుచును.

నైజాము.—ఇది మేము మాచేతితో నీ కిచ్చిన యినాము. (అని కటారినిచ్చి, పన్నీరు చల్లి) పోయి కూర్చుండుము.

బాలుడు.—మహాప్రసాదము. [అని సలాము చేసి పోయి కూర్చుండును.

[నైజాముకనుసన్న చేత దివాను నీలాద్రిరావునకు పన్నీరు చల్లును.

నీలాద్రి.—మహాప్రసాదము, మహాప్రసాదము !

నైజాము.—ఆడాదియు వీరులలో గణన కెక్కినది. ఈబాలుని కిది తల్లికన్న ఎక్కుడు. బాలునిం గాపాడినందున మాకు చాల మెహానత్తు చేసినది.

[అని హుసేనాలీకి కనుసన్న చేయును.

హుసేనాలి దాదికి పన్నీరు చల్లును.

దాది.—మహాప్రసాదము, మహాప్రసాదము !

నైజాము.—నీలాద్రిరావుగారూ. మీకోరిక తీఱినదా ? ఇంక నే మయినం జేయవలయునా ?

నీలాద్రి.—

ఉ. వేంకటరాయనిన్ నిసుఁగు వేకయికొంటిరి తల్లిదండ్రులై ;
యంకిలి యైన ద్రోహి తెగటాఱెను ; వీరులు పద్మనాయకుల్
బొంకరు కొంక రార్తులను బ్రోతురు రటం చెడ మెచ్చు కొంటిరే,
యింకను నేమి గోరుదు నహీనశయాన సమాన తెల్పుఁడా. ౮౫

అయిన నిది యగుఁ గాక !

(భరతవాక్యము.)

శా. సర్వజ్ఞాంకిత సింహరాట్ప్రభవ వంశ ప్రాజ్యముక్తామణుల్
గర్వోన్నద్ధ సపత్నభూమిధర పక్షచ్ఛేద నాఖండలుల్
ఉర్విం బ్రోతురు గాత శేషఫణిబాహుల్నిచ్చలుం బోషితాం
తర్వాణీంద్రులు పద్మనాయకులు పద్మానాయకప్రాభవుల్. ౮౬

[అందఱు నిష్క్రమింతురు.

బొబ్బిలియుద్ధనాటకము సమాప్తము.